
ప్రజాశక్తి
బుధవారం 2 జూలై 2025
5
విజయనగరం



రేపు వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 3న జగన్నాథ ఫంక్షన్ హాలులో జరిగే జిల్లా వైసిపి విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రజల కోసం బంగారు భవిష్యత్తు నిర్మిస్తే చంద్రబాబు పాలన వాటిని విధ్వంసం చేయడానికే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాన్ని సృష్టిస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ మోసమని, ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగడుతూ.. 'రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో'.. 'చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ' పేరుతో 5 వారాల బృహత్తర కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కెవివి సూర్యనారాయణ రాజు, ఇప్పిలి అనంత, నరసింహమూర్తి, నెక్కల నాయుడు బాబు, సిరిపురపు జగన్, వల్లిరెడ్డి శ్రీను, పతివాడ సత్యనారాయణ, బూర్ల నరేష్, బంగారు నాయుడు, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

వైద్యరంగంలో ప్రమాద ఘంటికలు

- వైద్యులపై దాడులను నిరోధించాలి
- డాక్టర్స్‌డే సభలో వక్తలు
- ప్రజాశక్తి ఆధ్వర్యంలో ఘనంగా వైద్యుల దినోత్సవం
- ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



డాక్టర్స్ డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వివిఎస్ ప్రసాద్, అప్పలనాయుడు, తిరుమల ప్రసాద్, తదితరులు



బిసి రాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

దేశంలో వైద్యరంగానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని వక్తలు అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజానికి వైద్యుల తోడ్పాటు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. డాక్టర్స్‌డే సందర్భంగా మంగళవారం తిరుమల-మెడికవర్ ఆస్పత్రిలో ప్రజాశక్తి ఆధ్వర్యాన డాక్టర్స్‌డే, ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. తొలుత వైద్య వృత్తికి ఆదర్శంగా నిలిచిన డాక్టర్ బిసి రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి ముద్రించిన డాక్టర్స్‌డే ప్రత్యేక సంచికను ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు, తిరుమల- మెడి కవర్ ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, డైరెక్టర్ కె.కృష్ణశాంతి, యునైటెడ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, ప్రజాశక్తి సిజిఎం తదితరులు ఆవిష్కరించారు.



అనంతరం ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్‌నాయుడు ఆధ్వర్యాన జరిగిన సభలో డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన డాక్టర్ బిసిరాయ్ జయంతి, మరణించిన రోజు ఒకే రోజు అవ్వడంతో జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పశ్చిమ బెంగాల్‌కు రెండో ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. 1962లో భారతరత్న అవార్డు పొందిన వ్యక్తిఅని కొనియాడారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగంలో తీసుకువస్తున్న మార్పుల వలన వైద్యులకు తీరని నష్టం వాటిల్లుందని విమర్శించారు. మిక్సోపతి వైద్య విధానం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు.

వైద్యసేవలను గుర్తించాలి



సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో రోగులకు ఎదురవుతున్నా ఇబ్బందులనే కాకుండా వైద్యులు అందిస్తున్న సేవలను కూడా గుర్తించాలని అన్నారు. వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

సేవాదృక్పథంతో వైద్య వృత్తిలోకి రావాలి



తిరుమల - మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో ఉంటేనే నేడు వైద్యవృత్తిలో అడుగు పెట్టాలని అన్నారు. వైద్య వత్తులోకి రావాలంటే వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కన పెట్టాలన్నారు. ప్రస్తుత ఉన్న సమాజంలో చాలామంది రోగులు గూగుల్ యూట్యూబ్‌ల్లో చూసి వైద్యుల వద్దకు వస్తున్నారని, వారి కంటే ఎక్కువ స్థాయిలో వైద్యులు తమ వృత్తిలో నైపుణ్యం పొందాలని సూచించారు. మొన్నటివరకు ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో ఉన్న రోబోటిక్ సర్జరీని నేడు విజయనగరంలో తీసుకువచ్చామని తెలిపారు.

వైద్యులపై దాడులను అరికట్టాలి



వైద్యులపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్ అన్నారు. ఈ దాడుల వల్ల వైద్య వృత్తిలోకి రావాలంటే నేడు భయపడుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన ఆ సంఘటనలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. గత ఏడాది కాలంగా విజయనగరం జిల్లా కేంద్రంలో 13 మంది వైద్యులు, హాస్పటల్స్‌పై దాడులు జరిగాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11మెడికల్ కళాశాలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం వల్ల అట్టడుగు సామాన్య ప్రజలకు వైద్యవృత్తి దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నచిన్న క్లినిక్‌లకు ట్రేడ్ టాక్స్ రూపంలో వసూలు చేయడం సరికాదన్నారు.

విద్య, వైద్యం అందుబాటులో ఉండాలి



ప్రజా శక్తి సిజిఎం వై.అచ్యుతరావు మాట్లాడుతూ వైద్యులు ఎప్పటికీ దేవుల్లేనని అన్నారు. 865 మందికి ఒక వైద్యుడు ఉండాల్సి ఉండగా దేశంలో ఆ పరిస్థితి లేదన్నారు. విద్య, వైద్యం అందరికీ అందుబాటులో ఉంటేనే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆ దిశగా పాలకులు కృషి చేయాలన్నారు.

బయట ఆహారంతో అనారోగ్యం



తిరుమల-మెడికవర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ నేడు ప్రజలంతా బయట తయారు చేసే ఆహార పదార్థాలకు అలవాటు పడుతున్నారని, దీనివల్ల అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. బయట ఉండే ఆహారం తినడం వలన కేన్సర్ రోగులు పెరుగుతున్నారని తెలిపారు. ఇంటి వద్ద వండిన ఆహారం తినడం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చునని సూచించారు. ప్రతి ఒక్కరూ మనసును కంట్రోల్లో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అనంతరం వైద్యులందరినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి మేనేజర్ సిహెచ్ రాము, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెడితే

మరో బషీరాబాగ్ ఉద్యమం

- అదానీకి విద్యుత్ రంగాన్ని అప్పగించేందుకు కుట్ర
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెడితే మరో బషీరాబాగ్ విద్యుత్ పోరాటం తప్పదని, వెంటనే స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రాష్ట్ర ప్రజలపై దాదాపు 50 వేల కోట్లు భారం, జిల్లాపై కోటిన్నర వరకు వేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచితే బషీరాబాగ్ పోరాటం వలన ఇంత వరకు పెంచలేదన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టాలని వైసిపి ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు,వామపక్షాలు వ్యతిరేకించాయన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి నాయకులు లోకేష్ స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టాలని పిలుపు ఇచ్చారన్నారు. మరి ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారో ప్రభుత్వం ,లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు వలన అధికంగా రీడింగ్ వస్తున్నట్లు ఇప్పటికే విజయవాడలో రుజువు అయిందన్నారు. స్మార్ట్ మీటర్లు ఉంటే ముందుగానే ప్రీ పెయిడ్ చేసుకుంటే తప్ప కరెంట్ వచ్చే అవకాశం ఉండదన్నారు. ఈనేపథ్యంలో స్మార్టుమీటర్లు పెడితే ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రజలు స్మార్ట్ మీటర్లు ను వ్యతిరేకించడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం విరమించుకుందన్నారు. మన రాష్ట్రంలో,జిల్లాలో ప్రజలు కూడా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో రైతుల నిరసన



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ కర్మాగారానికి భూములిచ్చిన రైతులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని మంగళవారం మండలంలోని బొడ్డవరలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాసం ఎదుట వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ రైతులను గాలికి వదిలేసి కంపెనీ యాజమాన్యానికి ప్రజాప్రతినిధులు కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇన్ని రోజుల నుంచి నిరసనలు చేపడుతున్నా స్పందించడం లేదని మండిపడ్డారు. తమ సమస్యపై ఎందుకు అంత చిన్నచూపు చూస్తున్నారని నిలదీశారు. అప్పుడు దగ్గరుండి భూములు కంపెనీకి ఇప్పించిన ఎమ్మెల్సీ బాధ్యత పడుతున్నా, మిగతా ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చెయ్యాలని, లేకుంటే నిరసనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

2 లక్షల మందికి స్పౌజ్ పించన్లు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • అంబటివలసలో పింఛన్లు పంపిణీ



పింఛను నగదు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

రాష్ట్రంలో సుమారు 2 లక్షల మందికి త్వరలో భాగస్వామి (స్పౌజ్) పింఛన్లను మంజూరు చేయనున్నట్లు ఎంఎస్ఎంఇ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. బొండపల్లి మండలం అంబటివలసలో మంగళవారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ స్పౌజ్ పింఛన్ల మంజూరులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇటువంటి సుమారు 2 లక్షల పింఛన్లను త్వరలో మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. జిల్లాలో 2,70,847 మందికి రూ.114.84 కోట్లు పింఛన్ల ద్వారా చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, డిపిఎం రవికుమార్, ఎంపిడిఒ గిరిబాల, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎపిఎం కె.పెంటం నాయుడు, కోరాడ కృష్ణ పాల్గొన్నారు.

మంచి పనులను ప్రజల్లో తీసుకెళ్లాలి

గజపతినగరంరూరల్ : ఏడాదికాలంగా కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం గజపతినగరంలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో క్లస్టర్, గ్రామ, మండల ఇన్‌ఛార్జులు, ముఖ్యనాయకులతో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమ సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనేక మంచి పనులు జరిగాయని చెప్పారు. వాటిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, కోరాడ కృష్ణ, అచ్చంనాయుడు, బుజ్జి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన



నెల్లిమర్ల.. చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500ఇవ్వాలని, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ జీతాలను ప్రతినెలా 10 వ తేదీ లోపు చెల్లించాలని, 17 రోజుల సమ్మె ఒప్పంద జీవోలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. అనంతరం ఈనెల 9న జరిగే జాతీయ సమ్మెలో పాల్గొంటామని ప్రజారోగ్య అధికారికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని అన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ అనే పదాన్ని తొలగించి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించి దశలవారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ రామనాయుడు, రాజు, ధనుంజయ, ప్రసాద్, బుజ్జి, నాయుడు, రామచంద్రరావు కుమారి ,శంకర్రావు, రమా, సూరి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మున్సిపల్ ఇంజనీరింగ్, నాన్ పిహెచ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద చెవిలో పువ్వులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జులై 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని కమిషనర్ తారక్‌నాద్‌కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు శేఖర్, శ్రీను, పైడిరాజు, బాబురావు, హరిబాబు, దుర్గారావు పాల్గొన్నారు.

బీమా పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుర్ల

ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష బీమా పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ వివి రమణమూర్తి, డీసీసీబీ జనరల్ మేనేజర్ కెవివిఆర్ఎన్ సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో మంగళవారం జన సురక్ష పథకాలపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల్లో బ్యాంక్ ఖాతాదారులు చేరాలన్నారు. ఆ పథకాలతో తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా కవరేజ్ పొందవచ్చునని చెప్పారు. సైబర్ మోసాల పట్ల ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా మోసానికి గురైతే 1930 నంబరుకు కాల్ చెయ్యాలని చెప్పారు. గుర్ల సహకార బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ హరికేశవరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఏ శ్రీనివాసనాయుడు, గ్రామ సర్పంచ్ మీసాల సత్యవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిటియులో పిజి ప్రవేశాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 విద్యా సంవత్సరానికి గాను కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో వివిధ కేటగిరీల కింద ఖాళీ సీట్లను భర్తీ చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ టి.శ్రీనివాసన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. ఈ నెల 8న ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఎంబిఎలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న ఎంఎ ఇంగ్లీష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, ట్రైబల్ స్టడీస్ మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు www.ctuap.ac.in వెబ్‌సైట్‌ను చూడొచ్చని చెప్పారు.

శంకరరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-డెంకాడ

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రజాశక్తి భోగాపురం మండల విలేకరి ఎన్.శంకరరావు కుటుంబాన్ని మంగళవారం సాయంత్రం ప్రజాశక్తి చీఫ్‌జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, విజయనగరం మేనేజర్ సిహెచ్ రాము, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, డెంకాడ మండల నాయకులు ఎం.రామారావు పరామర్శించారు. శంకరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సాదక బాధకాలు తెలుసుకున్నారు. ప్రజాశక్తికి శంకరరావు అందించిన సేవలను గుర్తు చేశారు. శంకరరావు కుటుంబానికి టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ పరామర్శించారు.

సర్వజన ఆసుపత్రిని

వైద్యకళాశాలలోకి తరలించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలు సంఘాల తీర్మానం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా సర్వజన ఆసుపత్రి(జిజిహెచ్)ని గాజుల రేగలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలోకి తరలించాలని పలు సంఘాలు తీర్మానించాయి. మంగళవారం పౌర వేదిక జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రజాసంఘాల రౌండు టేబుల్ సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడారు. సర్వజన ఆసుపత్రిలో ఒపి, ఐపిలు పెరగటంతో తగినన్ని మౌలిక సదుపాయాలు లేక రోగులు, అటు వైద్యులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్న సేవలపై ఒక నివేదిక తయారుచేసి జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు కలెక్టర్ అంబేద్కర్‌కు, జెడ్‌పి చైర్మన్‌కు అందజేశామని తెలిపారు. వైద్య కళాశాల నుండి డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది జిజిహెచ్‌కు రాలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో క్రిటికల్ కేర్ కూడా మెడికల్ కాలేజీలోనే నిర్మాణం జరుగుతుందని, 750 బెడ్స్ తో ఆధునిక నిర్మాణాలు అక్కడ జరిగాయని, అందుకే వెంటనే సర్వజన ఆసుపత్రిని మెడికల్ కాలేజివద్దకు తరలించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రికి భవనంలో న్యూరో సర్జరీ, న్యూరో మెడిసిన్,నెఫ్రాలజీ, యూరాలజీ,మెడికల్ అంకాలజీ,కార్డియాలజీ,లతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్వహిస్తూ క్యాన్సర్ రోగులకు ప్రత్యేక వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చెయ్యాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, ప్రజాసంఘాల నాయకులు దవడ కొండబాబు,దుక్క చంద్ర శేఖర్, ఇప్పలవలస గోపాలరావు,జాగరపు ఈశ్వర ప్రసాద్,డాక్టర్ పాండ్రంకి వెంకట రమణ,మమ్ముల తిరుపతిరావు, గంటా వీర్రాజు, పతివాడ చంద్రరావు, కృష్ణవేణి, స్వాతి,నాగ భూషణం, పిఎల్ఎన్ రాజు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను మరువొద్దు

కొత్తవలస ఎంఎంసి పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్‌పి శ్రీభరత్



మాట్లాడుతున్న విశాఖ ఎమ్‌పి శ్రీభరత్

ప్రజాశక్తి-కొత్తవలస

గత ఎన్నికల్లో కార్యకర్తల కష్టం దాగి ఉందని, వారిని మరువొద్దని విశాఖపట్నం ఎమ్‌పి ఎం.శ్రీభరత్ తెలిపారు. మంగళవారం మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఎన్‌ఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో కొత్తవలస ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, వైస్ చైర్మన్ తూర్పాటి ఆదిబాబు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్‌పితోపాటు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. అనంతరం ఎమ్‌పి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నూతన కార్యవర్గం అహర్నిశలు కృషి చేయాలని కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. కుటుంబ సాధికార సారథి నుంచి పొలిట్ బ్యూరో సభ్యుల వరకు అందరం రోడ్డెక్కాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు ఇందుకూరి సుధారాణి, రాయవరపు చంద్ర శేఖర్, మండల అధ్యక్షులు జిఎస్.నాయుడు, గొరపల్లి రవి, గొంప వెంకటరావు, మల్లు నాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, వెలమ కార్పొరేషన్ చైర్మన్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో వ్యవసాయం లాభసాటి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

వ్యవసాయంలో ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా లాభాలు పొందవచ్చని ఎఒ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలో ముచ్చర్ల, జిన్నాం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ సీడ్ డిన్నర్లతో నేరుగా విత్తనం, ఎరువులు కలిపి ఒకేసారి వేయడం ద్వారా రైతులకు దమ్ము ఖర్చు, నారు పెంచడం, నారు తీయడం, ఉడుపు ఖర్చులు ఉండవని తెలిపారు. కూలి ఖర్చులు కూడా తగ్గుతాయని చెప్పారు. డ్రోన్ ఉపయోగించి ఎరువులు చల్లడం కూడా తక్కువ ఖర్చుతో చేసుకోవచ్చని తెలిపారు.

ప్రాజెక్టులపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి- డెంకాడ

నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పునరుద్ధరణపై ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మంగళవారం అధికారులతో భోగాపురంలోని తమ స్వగృహంలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తిరిగి ప్రారంభించడంపై ప్రధానంగా చర్చించారు. రైతుల సాగునీటి అవసరాలను తీర్చడానికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎంతో కీలకమన్నారు. నిలిచిపోయిన ప్రాజెక్టులను త్వరితగతిన పునరుద్ధరించి, రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎపిఎస్ఐడిసి అధికారులను ఆదేశించారు.

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

2025 సంవత్సరానికి జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యు. మాణిక్యం నాయుడు తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ మరియు ఎయిడెడ్ మున్సిపాలిటీ, ప్రాథమిక/ ప్రాథమికోన్నత/ ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుండి జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. పదేళ్ల కనీస సర్వీసు పూర్తిచేసిన వారు http://nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈనెల 13లోగా స్వయంగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.



కోళ్లఫారంతో కలుషితమైన చెరువును పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోళ్లఫారం మూసివేయాలి

ప్రజాశక్తి-మెంటాడ

ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బిరసాడవలసలో నిర్వహిస్తున్న కోళ్ల ఫారాన్ని తక్షణమే మూసివేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వీరంతా కోళ్ల ఫారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని, తుప్పబందను కబ్జాచేసి కోళ్ల వ్యర్థాలను నిల్వ చేయడం వల్ల వాతావరణం కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రజలకు, వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. 20 ఎకరాల విస్తీర్ణం గల అనంతర సాగరం చెరువులో చేపలు చనిపోయి లీజుదారులు నష్టపోయారని చెప్పారు. ఇప్పటికైనా మంత్రులు సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, మాజీమంత్రి రాజన్నదొర స్పందించి కోళ్లఫారాన్ని మూసివేయించాలని కోరారు. కార్యక్రమంలో మెంటాడ నీటి సంఘం ఛానల్ అధ్యక్షులు రెడ్డి రాజగోపాల్, జెవివి నాయకులు గంద్రేటి అప్పలనాయుడు, పిట్టాడ మాజీ సర్పంచ్ రెడ్డి రాజప్పలనాయుడు, పొరిపిరెడ్డి శ్రీనివాసరావు, ఐద్వా నాయకులు రాకోటి హరికృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.పద్మలీలను సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.
- ప్రజాశక్తి, విజయనగరం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో అభివృద్ధి పనులకు మంగళవారం మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ శంకుస్థాపన చేశారు. సంగవీధిలో రూ.10.60లక్షలతో సిసి రోడ్డు, సాయినగర్ కాలనీలో రూ.1.60 లక్షలతో సిసి రోడ్డు, రూ.2.50 లక్షలతో సిసి కాలువ, పూల్ బాగ్ రోడ్డులో రూ.3 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పని చేస్తున్నామని, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, డిఇ కిరణ్ కుమార్, ఎఇలు గుప్తా, కోటేశ్వరరావు, కౌన్సిలర్లు కె.లక్ష్మి, బి.సురేష్, మాజీ కౌన్సిలర్ రౌతు రామమూర్తి, టిడిపి నాయకులు కె.సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న పట్టణంలో ప్రదర్శన

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెలో భాగంగా పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎం.గోపాలం, పికెఎస్ జిల్లా అధ్యక్షులు టి.అప్పలనాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం తెలిపారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి సెంటర్ నుంచి ప్రదర్శన ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలో కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని ఎంపిడిఒ చల్లా సుగుణాకరరావు అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంగళవారం పాతబగ్గాం ఆయన పర్యటించి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద ప్రభుత్వం ఇచ్చిన రెండు చెత్త బుట్టలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో ప్రధాన కూడలి వద్ద మరుగు కాలువలను, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రెటరీ తిరుపతిరావు, సర్పంచ్ లెంక పద్మ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని టాస్క్‌ఫోర్స్ సిఐ బంగారుపాప అన్నారు. మంగళవారం జమ్ము నారాయణపురం హైస్కూల్లో ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సత్యవతి , భారతీయ న్యాయ సేవా ఫౌండేషన్ సంస్థ సహకారంతో విద్యార్థులకు మాదక ద్రవ్యాలవల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజలెవ్వరూ మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, మద్యపానానికి, ధూమపానానికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని సూచించారు. మత్తు పదార్థాలు రవాణాచేసినా, వినియోగించినా డయల్ 100 లేదా 1972కు సమాచారం అందించాలని కోరారు.

బాలసదనంలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలోని బొబ్బిలి, గజపతినగరం, కెఎల్‌పురం బాల సదనంలను, శిశుగృహాలను వైద్య బృందం మంగళవారం పరిశీలించి పిల్లలకు వైద్య సేవలు అందించారు. అనారోగ్యంగా ఉన్న వారిని దగ్గరనే ఉన్న సిహెచ్‌సికి రిఫర్ చేశారు. పిల్లలను విజయనగరం ఘోష ఆసుపత్రి పరిధిలో నున్న డిఇఐసి ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉండవల్లి ఆదిత్య శేష సాయి, ఆప్టోమెట్రిస్ట్ పిఎస్‌బి చక్రవర్తి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ యడ్ల శ్రీనివాసరావు, బొబ్బిలి బాలసదన్ నుంచి జ్యోతి, గజపతినగరం బాలసదనం నుండి సంధ్య, కేఎల్ పురం నుంచి త్రివేణి పాల్గొని సేవలందించారు.

గ్రంథాలయ భవనానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో గ్రంథాలయ భవన నిర్మాణ స్థలాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం పరిశీలించారు. పట్టణంలో శాఖ గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి, అద్దె భవనంలోకి మార్చారు. ఈ విషయాన్ని పాఠకులు, శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్.. ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్థల పరిశీలన చేసి, భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇఒ రాజు కోరారు. మంగళవారం మండలంలోని బోనంగి గ్రామంలో డెంగీ మాసోత్సవాల్లో భాగంగా పెదమజ్జిపాలెం పిహెచ్‌సి వైద్యులు పల్లవి, సతీష్ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆరోగ్య సహాయకులు ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమతెరలను తప్పనిసరిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ తిరుపతి, ఎంఎల్‌హెచ్ పి హరీష్, ఎఎన్ఎం దుర్గాదేవి, ఆశాలు లక్ష్మి, ఫాతిమా, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో తహశీల్దార్ రాములమ్మ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి నాయకులు రుద్ర వెంకటరావు, సోంపురం ఎంపిటిసి ఆకుల సత్తిబాబు, జెసిఎస్ కన్వీనర్ భోజంకి శ్రీను, నాయకులు నిరుజోగి శ్రీను, చీపురుపల్లి వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిథిల భవనాల పునరుద్ధరణకు వినతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడ పంచాయతీకి చెందిన గుండాలపేట గ్రామంలో ఉన్న ఇందిరమ్మ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగంలో ఉన్న ఈ భవనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు మంగళవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కలిసి వీటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల అభ్యర్థనపై స్పందించిన మాధవి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వేపాడ

విజయనగరంలో ఈ నెల 3న నిర్వహించే వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ కె.కన్నబాబు హాజరవుతారని చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో నియమితులైన నాయకులు, సీనియర్ నేతలు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఎఐఐఇఎ వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) 75వ స్థాపన దినోత్సవం సందర్భంగా మంగళవారం వజ్రోత్సవ (ప్లాటినం జూబ్లీ) వేడుకలు ఎల్ఐసి కార్యాలయం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐసియుఎ విజయనగరం కార్యదర్శి అర్.అప్పలనాయుడు మాట్లాడుతూ 1956లో భారతీయ జీవిత బీమా సంస్థ ఆవిర్భవించడానికి ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విశేష కృషి చేసిందని తెలిపారు. బీమా ఉద్యోగుల హక్కుల కోసం పోరాటానికి నాంది పలికిందని, ఉద్యోగ భద్రత, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, సెలవులు, సిక్ లీవ్ వంటి హక్కుల కోసం నిరంతర పోరాటాలు చేసిందని తెలిపారు. ఎల్ఐసి, జిఐసి వంటి ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణను నిరోధించేందుకు దేశవ్యాప్త ఉద్యమాలు నడిపిందని అన్నారు. న్యాయం, సమానత్వం, లౌకికత, ప్రజాస్వామ్యం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించాలని తెలిపారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, ఎఐపిపిఎ నాయకులు స్వామి, ఎం.శ్రీనివాస, యూనియన్ సభ్యులు,ఏజెంట్లు పాల్గొన్నారు.

గరివిడి రూరల్ : ఎఐఐఇఎ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద ఎల్ఐసి ఉద్యోగులు వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి వర ప్రసాద్, అధ్యక్షులు కామేశ్వరి మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులుగా ఉండడం మహిళలకు గర్వ కారణం అని, ఇలాంటి మరో సంఘం మనుగడలో లేదని అన్నారు. పట్టాదారులకు సేవలందించడంలోనూ, సంస్థను మరింత బలోపేతం చేసుకోవడం తమ తక్షణ కర్తవ్యం అని తెలిపారు. బీమా రంగంలో ప్రాథమిక హక్కులైన జీవన వేతనం, ఉద్యోగ భద్రత, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, సెలవులు, సిక్ లీవ్ వంటి హక్కుల కోసం నిరంతర పోరాటాలు చేసిన అసోసియేషన్ ఉద్యోగులకు పెన్షన్ హక్కు సాధింపజేసి చారిత్రక విజయాన్ని అందించిందన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ బేస్ యూనిట్ గరివిడి ప్రెసిడెంట్ జి.సిద్ధార్థ, సెక్రటరీ ఈ వెంకటేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎల్ఐసి బ్రాంచి కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు



విజయనగరం ఎల్ఐసి కార్యాలయం వద్ద మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

హక్కుల కోసం నిరంతర పోరాటం

శృంగవరపుకోట : హక్కుల కోసం ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం పోరాడుతోందని ఆ యూనియన్ శృంగవరపుకోట బ్రాంచ్ అధ్యక్షులు జగన్నాథం అన్నారు. యూనియన్ వజ్రోత్సవంలోకి అడుగెడుతున్న సందర్భంగా పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. భోజన విరామ సమయంలో పతాకావిష్కరణ చేశారు. పుణ్యగిరి వద్దనున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి శివప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగులు సుబ్బారావు, సుజాత, మాధురి, హారిక తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వారే..

ఎమ్మెల్యే లలితకుమారి, సుధారాణి వేర్వేరుగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గం టిడిపిలో ఎవరికి వారే యమునాతీరు చందాన నాయకుల తీరు ఉంది. మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఈ విషయం తేటతెల్లమైంది. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి ఎవరికి వారు వేర్వేరుగా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఎన్నికల ముందు టిడిపిలో చేరిన సుధారాణి కోళ్ల లలిత కుమారికి మద్దతుగా పనిచేశారు. ఇటీవల కాలంలో పట్టణంలో జరిగే పార్టీ కార్యక్రమాల్లో వీరు ఇరువురు వేర్వేరుగా పాల్గొనడంతో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సుధారాణిని దూరం పెడుతున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అందుకు తగినట్టుగానే సుధారాణి టిడిపిలో చేరినప్పుడు ఆమెతో వచ్చిన ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు తో కలిసి ఆమె పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పట్టణంలో టిడిపి కేడర్‌ను కలుపుకొని తన పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా పార్టీ అధికారంలో లేనప్పుడు జెండా పట్టుకు తిరిగిన కార్యకర్తలను పట్టించుకోకుండా ఎన్నికల ముందు వైసిపి నుండి తెలుగుదేశానికి మద్దతు ఇచ్చిన వారికే విలువనిస్తూ తమకు విలువనీయటం లేదని స్థానిక టిడిపి వర్గం లలిత కుమారిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన తెలిసినదే. ఈ నేపథ్యంలోనే ఇటీవల డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ జిందాల్ కంపెనీ భూముల విషయంలో మాట్లాడుతూ రఘు రాజు వైసిపి ఎమ్మెల్సీ అని అన్నారు. దీంతో ఆయన టిడిపిలో ఉన్నారా? వైసిపిలో ఉన్నారా అనే చర్చ జరుగుతోంది. అయితే తాను వైసిపిలోనే ఉన్నట్లు ఆయన ఈమేరకు ప్రకటన కూడా ఇచ్చారు. మరోవైపు టిడిపిలో ఉన్న ఆయన సతీమణి సుధారాణిని ఎమ్మెల్యే లలితకుమారి దూరం పెడుతున్నట్లు చర్చ జరుగుతోంది.



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న సుధారాణి, నాయకులు

కంటి చూపు విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

పుష్పగిరి ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ విశాల్ గోవింద్ హరి

ప్రజాశక్తి-విజయనగరం



కంటిచూపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పుష్పగిరి కంటి ఆసుపత్రి విట్రియో రెటీనా ఇనిస్టిట్యూట్ వైస్ చైర్మన్ డాక్టర్ విశాల్ గోవింద్ హరి తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పుష్పగిరి విట్రియో రెటీనా ఇనిస్టిట్యూట్ అనేది లాభాపేక్షలేని నాబ్ గుర్తింపు పొందిన సూపర్‌స్పెషాలిటీ కంటి ఆసుపత్రి అని తెలిపారు. 16ఏళ్లగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో సేవలంది స్తుందన్నారు. ఏటా 30వేల కంటి శస్త్రచికిత్సలను నిర్వహిస్తోందన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. మెరుగైన కంటి ఆరోగ్య సంరక్షణ అందరికీ అవసరమన్నారు. గ్లకోమా అనేది కంటి నాడిని ప్రభావితం చేసే ఒక కంటి వ్యాధి అని, దీని ఫలితంగా క్రమంగా దృష్టిని కోల్పోతారని తెలిపారు. ఇది తరచూ కంటి ఒత్తిడి పెరుగుదలతో కూడికొని ఉంటుందన్నారు. చాలా సందర్భాల్లో గ్లకోమా ఎటువంటి లక్షణాలను కలిగించదని, యాదృచ్ఛికంగా బయటపడుతుందని అన్నారు. గ్లకోమాకు కంటి చుక్కలు, లేజర్‌చికిత్సలు, శస్త్ర చికిత్స విధానాల రూపంలో చికిత్స ఉంటుందన్నారు. నేటి పరిస్థితుల్లో గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. కుటుంబచరిత్ర కలిగిన, దీర్ఘకాలిక స్టెరాయిడ్ చికిత్స పొందుతున్న, కంటికి గాయమైన అధిక ఓప్రమాదం ఉన్న వ్యక్తులు గ్లకోమా కోసం క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గ్లకోమాను ముందుగానే గుర్తించడం ద్వారా అంధత్వాన్ని నివారించవచ్చునని తెలిపారు.

రోజుకు 50 ఇళ్లను సందర్శించాలి

కార్యకర్తలకు కర్రోతు పిలుపు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమానికి సంబంధించిన శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూలై 2 నుంచి నియోజకవర్గంలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి రోజు ప్రతి బూత్ పరిధిలో 35 నుంచి 50 కుటుంబాలకి డోర్ టు డోర్ సందర్శనలు చేయాల్సి ఉంటుందని, పార్టీ నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని 4 మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జీలు పాల్గొవాలన్నారు. మై టిడిపి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ప్రతి బూత్‌లో నాయకులు సమిష్టిగా పాల్గొనాలని, కుటుంబాల సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి పరిశీలకులు ఎండి నజీర్, నాయకులు మహంతి శంకరరావు, ఆకిరి ప్రసాద్, పల్లె భాస్కరరావు, గేదెల రాజారావు, పతివాడ విద్యాసాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

ఉత్సాహంగా సిఐటియు మహాసభ

ప్రజాశక్తి - సంతకవిటి

మండల కేంద్రంలో అన్ని సంఘాలతో కలిపి సిఐటియు మండల మహాసభ మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. మహాసభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ హాజరై మాట్లాడారు. జూలై 9న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి 12 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచి పని ఒకటీ లేదని విమర్శించారు. అంచలంచెలుగా కార్మిక చట్టాలు, హక్కులు హరిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న సమ్మెలో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొనాలని కోరారు. అనంతరం 12 మందితో మండల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కే.అసిరప్పుడు, కో కన్వీనర్‌గా వై.సుశీల, కమిటీ సభ్యులుగా వై.ఆనంద్, జి.శ్రీను, వి.గౌరమ్మ, సుగుణ, రాంబాయి, రాము, తవుడు, అచ్యుతరావు, రాములు, సూరీడమ్మలను ఎన్నుకున్నారు. మండల కన్వీనర్ కే.అసిరిప్పడు మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని కార్మిక సమస్యలు పరిష్కారం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సురేష్

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత

ఉపాధి హామీ ఎపిడి రమామణి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో ఉపాధిహామీ కింద మంజూరైన పనుల్లో పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎపిడి రమామణి సిబ్బందికి సూచించారు. మండలంలోని కొత్తరేగ, పాతరేగ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పండ్ల తోటల పెంపకంలో అధిక లక్ష్యాలను సాధించడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫారంపాండ్స్, కంపోస్టు ఫిట్స్ పనులు పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటి వరకు చేపడుతున్న పనులపై ఆమె ఆరా తీశారు. ఈ నెల 10వ తేదీలోగా పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ త్రినాథరావు, ఇసి సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


చిరస్మరణీయులు 'జయంతి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్రలో గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి ఆద్యుడు జయంతి రామలక్షణ మూర్తి అని, ఆయన నడిచే గ్రంథాలయమని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రొంగలి పోతన్న కొనియాడారు. జయంతి రామలక్ష్మణమూర్తి జయంతి సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పోతన్న మాట్లాడారు. నేడు గ్రామ గ్రామాన గ్రంథాలయాలు ఉఉన్నాయంటే అది జయంతి కృషి ఫలితమేనని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. అబ్దుల్ రావూఫ్ మాట్లాడుతూ జయంతిని నడయాడే గ్రంథాలయంగా అభివర్ణించారు. జయంతి స్మారక గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు మజ్జి కాంతారావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

బుక్ డిపో సెంటర్ నిర్వాహుల సేవలు అమూల్యం

జయంతి రామలక్ష్మణ మూర్తి జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం, జిల్లా గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో బుక్ డిపో సెంటర్ నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో గ్రంథాలయ ఉద్యమానికి జయంతి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బుక్‌డిపో సెంటర్ నిర్వాహకులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె.దయానంద్, జిల్లా కళాశాలల గ్రంథాలయల కన్వీనర్ బి.రామభద్రరాజు, పట్టణ కన్వీనర్ ప్రసాద్ పట్నాయక్, బాషా, ఈశ్వరరావు పాల్గొన్నారు.



జయంతి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

కొవ్వాడలో 4 వేల మొక్కలు నాటివేత

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో పర్యావరణ పరిరక్షణ దిశగా ఓ కీలక ముందడుగు పడింది. మంగళవారం గ్రామ సర్పంచ్ రఘు ఆధ్వర్యంలో గ్రామ వ్యాప్తంగా 4వేలకు పైగా అత్యంత ఖరీదైన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కోసం కోట్లాది రూపాయల సొంత నిధులతో ఇప్పటికే రహదారులు, శివాలయం, పార్కులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. ఇప్పుడు గ్రామంలో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటిస్తున్నా మన్నారు. ఇందుకోసం మొత్తం రూ. 30 లక్షలు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. గ్రామంలోని శ్మశానవాటికలు, పార్కులు, దేవాలయాలు, రహదారుల పక్కన ఈ మొక్కలను నాటారు. ఈ మొక్కలు పార్క్ స్టైల్‌లో గ్రామాన్ని అలంకరించనున్నాయన్నారు. గ్రామం మొత్తాన్ని ఉద్యానవనంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోందన్నారు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కల నాటింపు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పర్యావరణ పరిరక్షణకు తమ సర్పంచ్ చేస్తున్న కృషిని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు. గ్రామానికి ఆకర్షణీయతను తీసుకురావడమే కాకుండా, భవిష్యత్ తరాల కోసం పచ్చదనం పరిరక్షించేందుకు కృషి చేస్తున్న సర్పంచ్‌ను పలువురు అభినందించారు.



హాస్టల్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి

ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని 8వ డివిజన్ బోడెమ్మ బంగ్లా పరిధిలో గల ప్రభుత్వ బాలికల బిసి హాస్టల్‌లో మంగళవారం తిరుమల-మెడికవర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ తిరుమల ప్రసాద్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్‌ను ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నూతన తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హాస్టల్ బాలికలతో మాట్లాడి, వారి భోజన వసతి, అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు.

పింఛన్ల పంపిణీ

నగరంలోని 28వ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలో లబ్ధిదారులకు శాసన సభ్యురాలు పూసపాటి అధితి గజపతిరాజు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు, రోగగ్రస్తులకు పింఛన్లను అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్వి, నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాటం : బొత్స

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

టిడిపి ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలయ్యే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తెలిపారు.మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా హామీల అమలు చేసే విధంగా ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఇందుకు నాలుగు విడతల కార్యాచరణ రూపొందించామని, జూలై 7న నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో నాయకులు అప్పల నాయుడు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, కర్రి రామునాయుడు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- డెంకాడ

గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని డి.తాళ్లవలసలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇతో కలిసి ఆయన మంగళవారం పిడబ్ల్యుఎస్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంకు వద్ద క్లోరినేషన్ చేసే విధానం, వాల్వ్ పిట్స్, ట్యాంక్ పరిసరప్రాంతలు పరిశీలించి నీటిని క్లోరిన్ టెస్ట్ చేయించారు. అనంతరం పంచాయతీ సెక్రెటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కి తగు సూచనలు చేశారు. రామమందిరం వద్ద గ్రామ ప్రజలకు తడి చెత్త ప్రతిరోజు ఇవ్వాలని, పొడి చెత్త శనివారం మాత్రమే ఇవ్వాలని, వర్షాకాలం దృష్ట్యా కాచి చల్లార్చిన నీరు తాగాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.త్రిమూర్తులు, పంచాయతీ సెక్రెటరీ రజని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రేవంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి సుపరిపాలన తొలి అడుగు

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో ఈనెల 2 నుంచి జరిగే సుపరిపాలన తొలి అడుగు జార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఇంఉకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ తేదీ నుండి ప్రారంభం కానున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేపి.అదితి విజయలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకులు వీరేష్‌చంద్రదేవ్ పాల్గొన్నారు.

కమిషనర్ పేరుతో ట్రేడ్ లైసెన్స్ వసూలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి కమిషనర్ పల్లి నల్లనయ్య పేరుతో ట్రేడ్ లైసెన్సులు కట్టించుకున్నట్లు వచ్చిన సమాచారం మేరకు కమిషనర్ స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ పే ద్వారా అపరిచిత వ్యక్తి ట్రేడ్ లైసెన్సులు చెల్లించాలని, అందుకు కమిషనర్, విజయనగరం వారి పేరును వాడుకుంటున్నట్లు తెలిపారు. మరోసారి మల్లేశ్వరరావు పేరు తోనూ,ఇలా తరచూ పేర్లను మారుస్తూ అపరిచిత వ్యక్తులు ట్రేడ్ లైసెన్సలను ఫోన్ పే ద్వారా చెల్లించాలని సమాచారం అందిస్తున్నారని, ఇవన్నీ తప్పుడు సమాచారాలని తెలిపారు. క్యూ ఆర్ కోడ్లు ద్వారా ఫోన్ పేలు ద్వారా చెల్లింపులు చేయరాదన్నారు. కేవలం సచివాలయాలలోనూ, నగరపాలక సంస్థ కార్యాలయం వద్దనున్న ప్రత్యేక కౌంటర్లు వద్ద, డిడిల ద్వారా చెక్కుల రూపంలోనూ, పురమిత్ర యాప్‌ల ద్వారా, ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన విధానాలలో మాత్రమే చెల్లింపులు చేయాలని చెప్పారు.

అటెండర్ ఆత్మహత్య

గంట్యాడ : మండలంలోని లక్కిడాం కోఆపరేటివ్ బ్యాంకులో అటెండర్‌గా పనిచేస్తున్న రామవరం గ్రామానికి చెందిన చుక్క సత్యవేణి (27) కడుపునొప్పి తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి అప్పారావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. సత్యవేణి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ సాయికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేలు జరిమానా

రామభద్రపురం : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన సాలూరు చిట్లివీధికి చెందిన వ్యక్తికి సాలూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఇటీవల స్థానిక పోలీసు స్టేషన్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఈ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా సోమవారం విచారించి, జరిమానా విధించారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

కంటోన్మెంట్ : గంజాయి కేసులో ఇద్దరి యువకులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గాజులరేగకు చెందిన బెవర గణేష్, పద్మావతి నగర్ కు చెందిన భోగి రాహుల్ సిఎంఆర్ జంక్షన్ వద్ద గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నట్లు తెలిపారు .


ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

డాక్టర్స్ డే ప్రత్యేక అనుబంధం

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా | బుధవారం 2-7-2025 | 20 పేజీలు

వైద్యులకు ఆదర్శం బిసి రాయ్

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, బెంగాల్‌కు చెందిన సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ (బిసి రాయ్) జూలై 1వ తేదీన జన్మించారు. యాదృశ్చికంగా అదే రోజున ఆయన తుదిశ్వాస విడిచారు. వైద్య వృత్తికి ఆదర్శంగా నిలిచిన బిసి రాయ్‌కు నివాళిగానే భారత ప్రభుత్వం ఆ రోజును జాతీయ వైద్యుల దినోత్సవంగా ప్రకటించింది. 1991 నుండి మనదేశంలో జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నాం. వైద్యునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా రాయ్ తన సర్వస్వాన్నీ సమాజ అభ్యున్నతికి వెచ్చించారు. వైద్య వృత్తిలో ప్రజలకు విశేష సేవలందించి దేశంలోని వైద్యులందరికీ ఆదర్శంగా (మిగతా..2లో)

స్థాయికి అనుగుణంగా

విద్యా ప్రమాణాలు

మౌలిక సదుపాయాలకు కొదవ లేదు : ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ప్రభుత్వ మెడికల్ కాలేజీలో స్థాయికి తగ్గ విద్యాప్రమాణాలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, వైద్యులు, సిబ్బంది పోస్టులతోపాటు ఇతర టెక్నికల్, నాన్ టెక్నికల్ సహాయకుల పోస్టులు కూడా ఎప్పటికప్పుడు ప్రభుత్వం భర్తీ చేస్తోందని తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక సంచికకు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే...

విజయనగరంలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన విషయం విధితమే. 2023లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఏటా పెరుగుతున్న కళాశాల స్థాయికి తగ్గట్టు వైద్యులు, సిబ్బంది నియామకాలు, తరగతి గదులు, హాస్టల్ భవనాలు, లేబొరేటరీలు, ఉపన్యాస గ్యాలరీలు వంటివి ప్రభుత్వం సమకూరుస్తోంది. కళాశాలలో మొత్తం 150 సీట్లకుగాను 2023లో 149 సీట్లు భర్తీకాగా, గత ఏడాది శతశాతం భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ఆగస్టులో నూతన ప్రవేశాలు ప్రారంభమౌతాయి. గత ఏడాది నాటికి ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు జరిగేవి. అందుకనుగుణంగా ప్రస్తుతం మైక్రో బయాలజీ, ఫామోకాలజీ, పేథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటి మెడిసిన్ విభాగాలు ఉన్నాయి. మొదటి సంవత్సరం నాటికే ఎంబిబిఎస్ విద్యార్థుల కు అనాటమీ, హిస్టాలజీ, స్కిల్ ల్యాబ్‌లు, అవసరమైన తరగతి గదులు, ల్యాబ్స్, పరిపాలనా విభాగం, హాస్టల్ భవనం, ప్రొఫెసర్ ఛాంబర్లు వంటివి అప్పట్లోనే పూర్తిచేశారు. ఎంబిబిఎస్ మూడో సంవత్సరం ప్రారంభమైతే మరికొన్ని విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే ప్రొఫెసర్ల నియామకాలు ఇప్పటికే జరిగాయి. ముగ్గురు ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లగా 15మంది వరకు కొత్తగా వచ్చారు. హెడ్ నర్సులు కూడా ఆరుగురు వచ్చారు. ఇంకా ఆరు వైద్యపోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని త్వరలోనే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేదా ప్రొమెషన్ ప్రాతిపదికన భర్తీచేసేందుకు ప్రభుత్వం కసరత్తుచేస్తోంది. వీటితోపాటు 20కేటగిరీల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన 19పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్లు జారీచేశాం. ఇందులో ఒక కేటగిరికి సంబంధించి ప్రొవిజినల్ మెరిట్, ఐదు కేటగిరీలకు సంబంధించి స్పీకింగ్ ఉత్తర్వులు జారీ చేశాం. ఈ ఏడాది 50మంది విద్యార్థులు పెరగనున్న నేపథ్యంలో అందుకనుగుణంగా ఒక ఉపన్యాస గ్యాలరీ, హాస్టల్ సదుముదాయం నిర్మాణ పనులు చకచకా ముందుకు సాగుతున్నాయి.

రోగులు, వైద్యుల సంబంధాలు మెరుగుపడాలి

- నమ్మకం, స్వేచ్ఛతోనే మెరుగైన వైద్యసేవలు
- వైద్యులపై దాడుల నివారణకు చట్టం అవసరం
- ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రోగులు, వైద్యుల మధ్య సంబంధాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్ అన్నారు. తద్వారా మెరుగైన వైద్య సేవలందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నమ్మకంగా మెలగడంతోపాటు తగిన స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించినప్పడే వైద్యుల్లో మరింత అంకితభావం పెరిగేందుకు అవకాశం ఉటుందని వివరించారు. వైద్యులందరూ రోగుల ఆరోగ్యం కాపాడటమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తారని అన్నారు. అపోహలు, అనుమానాలతో రోగులు వైద్యులపై దాడులకు పాల్పడుతుండడం వల్ల క్లిష్టమైన పరిస్థితుల్లో సేవలు అందించడం కష్టతరంగా మారుతుందన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఇటీవల కాలంలో వైద్యులపట్ల రోగుల బంధువులు వ్యవహరిస్తున్న తీరు ఇబ్బందికరంగా మారుతోంది. ఇటువంటి తీరు మారకపోతే వైద్యులు కూడా రోగుల్ని కాపాడలేరు. చికిత్స సమయంలో రోగి శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలు సహకరించకపోతే వైద్యులు శ్రమ ఫలించకపోవచ్చు. ఇటువంటి సందర్భాల్లో రోగం నయం కాకపోవడమే కాక మరణాలు సంభవించవచ్చు. అప్పటి వరకు తమ ప్రాణాలు కాపాడాలని ప్రాథేయపడి దేవుడి రూపంలో వైద్యులేనని పొగిడిన రోగుల బంధువులు ఆకస్మికంగా దాడులకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయి. ఆసుపత్రి ఆస్తులను ధ్వంసం చేసినా, సిబ్బందిపై గాని, వైద్యులపై గాని దాడులు చేసి గాయపరిచినా 2008లో విడుదల చేసిన యాక్ట్ 11 ప్రకారం వారికి మూడేళ్ల జైలు, రూ.50 వేలు జరిమానా విధించే అవకాశముంది. ఈ నేరాన్ని కాగ్నిజబుల్, నాన్ బెయిలబుల్ నేరంగా గుర్తించారు. ఇటువంటి నేరాలకు మూడేళ్లకు బదులు 7ఏళ్ల జైలు శిక్ష విధించే విధంగా మార్పుచేయాలి. అసాంఘిక శక్తులను కట్టడి చేయాలంటే ఏదన్నా ఆసుపత్రిలో అనుకోని పరిస్థితుల్లో రోగి మరణిస్తే కొన్ని అసాంఘిక శక్తులు వైద్యులపై భౌతిక దాడులకు దిగడం లేదా బేరసారాలు చేయడం అలవాటైంది. ఇటువంటి సంఘటనలు గడిచిన ఏడాదిలో పదివరకు జరిగాయి. ఇలాంటి దాడులు కొనసాగితే, సీరియస్ కేసుకు చికిత్స ఇవ్వడానికి వైద్యులు ముందుకు వచ్చే సాహసం చేయలేరు. స్వేచ్ఛా వాతావరణంలో, ఒత్తిడి లేనప్పుడు మాత్రమే ఎటువంటి ప్రాణాపాయ స్థితిలోనైనా వైద్యులు సేవలు అందించేందుకు ముందుకు వచ్చే పరిస్థితి ఉండబోదు. మరోవైపు వినియోగదారుల రక్షణ చట్టం పేరిట వైద్యులు తమ జీవితంలో సంపాదించలేని మొత్తాన్ని శిక్షల కింద కోర్టులు విధిస్తుండడం వల్ల వైద్య వృత్తి కత్తిమీద సాములా మారుతోంది. రోగుల బంధువులు చేసే ఇటువంటి దాడులను నివారించక పోతే భవిష్యత్తులో అటు రోగులు, ఇటు వైద్యులు ఇబ్బందిపడే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్య సేవలను వినియోగదారుల చట్టం పరిధి నుండి తప్పించి, శిక్షకు బదులు జరిమానా విధించాలి. అనుకోని పరిస్థితుల్లో రోగి మరణించినప్పుడు వైద్య సేవలో నిర్లక్ష్యం ఉందని అనుమానముంటే జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వైద్యులకు రక్షణ కల్పించకపోతే ఆధునిక వైద్య రంగం నిర్వీర్యం అవుతుంది. సమాజం నష్టపోతుంది.

ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ మెడిసిన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆధునిక వైద్యరంగానికి తూట్లు పొడుస్తోంది. అల్లోపతీ, ఆయుర్వేదం కలిపి కిచిడి వైద్యం పేరిట ప్రజలకు నాణ్యత లేని వైద్యాన్ని అందించబోతుంది. ఈ రంగంలో చేరడానికి ఎవరు ముందుకొస్తారు? ఆధునిక వైద్యం.. అల్లోపతీ నిర్వీర్యం కాకుండా చూడాలంటే ఇటు వైద్యులపై దాడులను నిలువరించడంతోపాటు, నిర్భయ వాతావరణాన్ని కల్పించాలి. మరోవైపు ప్రభుత్వం అశాస్త్రీయ మైన మిక్సోపతి కిచిడి వైద్యం అలోచనలు ఆపాలి. వైద్యులు, ఆస్పత్రులు వైద్యసేవలు అందిస్తున్నప్పుడు సురక్షిత వాతావరణం కల్పించేందుకు అనువైన పరిస్థితులు, చట్టాలు కల్పించాలి. వైద్యసేవ అందిస్తున్నప్పుడు వైద్యులు ఎన్నో ఒత్తిళ్లకు గురౌతున్నారు. గుండె ఆపరేషన్ చేస్తున్న వైద్యులే గుండెపోటుకు గురౌతున్నారంటే సమస్య ఎంత తీవ్రత అన్నది అర్థం చేసుకోవచ్చు. ఒత్తిడి లేని వాతావరణంలో మరింత సంతృప్తి కరంగా సేవలందించగలరన్న అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉంది. ఇందుకు ప్రభుత్వాలు కూడా చొరవ చూపించాలి.

వైద్యులకు ఆదర్శం బిసి రాయ్

(మొదటి పేజీ తరువాయి)

నిలిచారు. వైద్య వృత్తి పట్ల ఆయన నిబద్ధత, సేవానిరతి, నిరాడంబరత, నిజాయితీ అద్వితీయమైనవి. డాక్టర్ రాయ్ 1882 జులై 1న పాట్నాలో జన్మించారు. 1929లో అఖిల భారత వైద్య సదస్సుకు అధ్యక్షులయ్యారు. 1942లో కోల్‌కతా విశ్వవిద్యాలయ ఉప కులపతిగా ఉన్నారు. 1943లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా, 1957లో ఇండియన్ సైన్సు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1961లో భారతరత్న పురస్కారం అందుకున్నారు. 1962 జూలై 1న 80 ఏళ్ల వయస్సులో ఆయన భౌతికంగా మనకు దూరమయ్యారు.

ప్రతి ఏటా జులై ఒకటో తేదీన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. రోగుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు చేసే నిరంతర సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది. అనుక్షణం ఆరోగ్యాన్ని. శారీరక, మానసిక స్థైర్యాన్ని అందించే డాక్టర్‌కు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం. ఆ ప్రాణదాతలు పోసే ఊపిరితో గుండెల నిండుగా కృతజ్ఞతలు నింపుకుని పదేపదే గుర్తుచేస్తూ ఉండేందుకు వారికోసం ప్రపంచమంతా ఒక రోజు కేటాయించింది. అదే ప్రపంచ డాక్టర్స్‌డే.

డాక్టర్స్‌డే చరిత్ర

జార్జియాలోని విండార్లో డాక్టర్ చార్లెస్ బి.తల్మండ్ గొప్ప వైద్యుడు. ఆయన రోగుల కోసం చేస్తున్న సేవను చూసి ఆయన భార్య బ్రౌన్‌తల్మండ్ ఆశ్చర్య పోయింది. డాక్టర్లు రోగుల కోసం తమ వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి నిరంతరం వారు పడుతున్న తపన, చేస్తున్న సేవలకు గుర్తుగా వారి గౌరవార్థం సంవత్సరంలో ఒక రోజును కేటాయించింది. వారి సేవలను మననం చేసుకుంటూ కృతజ్ఞతగా శుభాకాంక్షలు చెప్పాలని భావించింది. విండార్లో 1933 మార్చి 30న తొలి డాక్టర్స్ డేను పాటించారు. ఆరోజున గ్రీటింగ్ కార్డులు పంపడం, అసువులు బాసిన డాక్టర్లకు పూలతో నివాళులర్పించటం ద్వారా తొలి డాక్టర్స్ డే నిర్వహించారు. యుఎస్‌లో 1958 మార్చి 30న డాక్టర్స్‌డే పాటిస్తూ ప్రతినిధుల సభ తీర్మానించింది.

మార్చి 30వ తేదీని నేషనల్ డాక్టర్స్‌డేగా పాటించాల్సిందిగా 1990 అక్టోబర్ 30న జార్జిబుష్ చట్టం చేశారు. ప్రముఖ డాక్టర్ బిదన్‌చంద్ర రాయ్ గౌరవార్థం మన దేశంలో 1991 నుండి జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈయన 1882 జులై 1న బీహార్‌లోని పాట్నా జిల్లాలో ఉన్న బకింపూర్‌లో జన్మించారు. తండ్రి పేరు ప్రకాష్ చంద్ర. బిసి రాయ్ 14వ ఏటే తన తల్లిని కోల్పోయారు. అవివాహితుడైన డాక్టర్ బిసి రాయ్ తన ఆస్తులతో పాట్నాలో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవలకు దానిని అంకితం చేశారు. 1909-11 మధ్య ఇంగ్లాండ్‌లో వైద్యవిద్య పూర్తిచేసుకుని 1911లో భారతదేశానికి వచ్చి కలకత్తాలోని మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. జాదవ్‌పూర్ టిబి హాస్పటల్. ఆర్‌జి. బార్ వెడికల్ కాలేజ్ , కమలా నెహ్రు హాస్పటల్, విక్టోరియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్, చిత్తరంజన్ క్యాన్సర్ హాస్పటల్ మొదలగు వైద్య, ఆరోగ్య సంబంధిత సంస్థలను నెలకొల్పి వాటిద్వారా అపారమైన సేవలందించారు. 1926లో ప్రత్యేకంగా మహిళలు, పిల్లల కోసం చిత్తరంజన్ సేవాసదన్ పేరుతో వైద్యశాలను ఏర్పాటుచేసి మహిళల కోసం నర్సింగ్ శిక్షణా సంస్థను ఏర్పాటు చేశారు.

రాజకీయ రంగంలో..

1925లో రాజకీయ రంగప్రవేశం చేశారు. బారక్‌పూర్ అసెంబ్లీ నుంచి పోటీచేసి ప్రముఖుడైన "గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ బెంగాల్‌గా" పేరొందిన సురేంద్రనాథ్ బెనర్జీపై గెలుపొందారు. 1922-28 మధ్య కలకత్తా మెడికల్ జర్నల్‌కు సంపాదక బాధ్యతలు నిర్వర్తించారు. 1928లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా, కలకత్తా మేయర్‌గా, 1942లో కోల్‌కత్తా విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గానూ 1943లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ప్రెసిడెంట్‌గానూ ఎన్నికయ్యారు. విద్యావైద్య రంగాల్లో ఆయన సేవలకు గౌరవార్థం 1944లో డాక్టరేట్ పొందారు.

1948 జనవరి13వ తేదీన పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్య మంత్రిగా పదవి చేపట్టారు. 1961 ఫిబ్రవరి 4న ఆయనకు భారతరత్న వరించింది. భారత ప్రభుత్వం 1962లో జులై1వ తేదీన ఆయన గౌరవార్థం డాక్టర్స్‌డేగా నిర్వహించాలని ప్రకటించింది. 1976నుంచి వివిధ రంగాలలో సేవలందించిన వారికి డాక్టర్ బిసి రాయ్ పేరుమీద అవార్డులను ప్రదానం చేస్తున్నారు. నేటి వైద్యులకు, వైద్య విద్యార్థులకు డాక్టర్ బిసి.రాయ్ ఆదర్శ ప్రాయులు. ఆ మహానుభావుని ఆదర్శాలను నేటి వైద్యులు ఆచరించాలని కోరుకుంటున్నాం.

రోగి, వైద్యుని బంధం వాణిజ్య అంశం కాకూడదు

డాక్టర్ రాయ్‌ను వైద్యులు ఆదర్శంగా తీసుకుని వైద్య వృత్తిని సేవాదృకృథం, నిబద్ధత, అంకితభావంతో నిర్వర్తించటానికి కృషి చేయాలి. నాడు రోగి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా రోగాన్ని నయం చేయడంపైనే వైద్యులు దృష్టి సారించేవారు. కానీ నేడు నగదు ఉంటేనే నాడి చూస్తున్నారు. వైద్యం వ్యాపారమైపోయింది. వైద్యుడు-రోగి సంబంధం వాణిజ్య అంశంగా తయారైంది. జీవితంలో ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం బాగా లేకపోతే అన్నీ వృధానే. ఆరోగ్య పరిరక్షణ పట్ల ఆధునిక సమాజంలో చైతన్యం పెరుగుతోంది. అందుకే మనిషి తన దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు డబ్బులు ఖర్చు చేసేందుకు, సమయాన్ని వెచ్చించేందుకు పెద్దపీట వేస్తున్నాడు. ఆధునిక టెక్నాలజీ వైద్య రంగం స్వరూపాన్నే సమూలంగా మార్చేసింది. శరీరంలోని ప్రతి అవయవాన్నీ, ప్రతి భాగాన్ని శోధించి రోగానికి కారణాలేమేమిటో ఖచ్చితంగా కనిపెట్టగలిగే యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల వైద్యుని పాత్ర కూడా వేగంగా మారిపోయింది. స్పెషలైజేషన్స్ బాగా పెరిగిపోయాయి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు పెరుగుతున్నాయి. ఆస్పత్రిలో చేరిన రోగి ఆరోగ్యంగా తిరిగి వెళ్లే పరిస్థితులు మెరుగుపడ్డాయి. మరోవైపు కుటుంబ వైద్యులు కనుమరుగవుతున్నారు. రోగికీ, వైద్యునికీ మధ్య అంతరం పెరుగుతోంది. అలాగే వైద్యంలో ఆధునీకరణ ఫలి తాలు, నూ తన ఆవి ష్కరణలు సా మాన్యులకు అందడంలేదు. ప్రపంచీకరణ విధానాలు వైద్య రంగాన్ని బాగా దెబ్బ తీశాయి. ప్రభుత్వ వైద్యాన్ని పాలకులే నాశనం చేస్తున్నారు. ఈరంగంలో ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ వేగంగా అమలవుతోంది. వైద్య విద్యాభ్యాసం దగ్గర నుండే ఇది ప్రారంభమవుతోంది. రోగ నివారణా చర్యలకు ప్రభుత్వాలు మంగళం పాడాయి. నివారణ కన్నా చికిత్సకు ప్రాధాన్యతనిస్తున్నాయి. డబ్బున్నవారికీ, డబ్బులొచ్చే జబ్బులకూ వైద్యం అందుబాటులోకి వచ్చింది. డబ్బులేనోళ్లకూ, డబ్బులు రాని జబ్బులకూ వైద్యం దూరమైపోతోంది. అనేక సమస్యలు కూడా వైద్యరంగాన్ని పట్టి పీడిస్తున్నాయి. వైద్య రంగంలో అభివృద్ధిని రెండు పార్శ్వాలుగా చూడొచ్చు. మంచి చెడూ రెండూ ఉన్నాయి. వాటిపై సమాజంలో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'కార్పొరేట్'కి ధీటుగా ప్రభుత్వ వైద్యం

- వైద్యంతో లైఫ్‌స్టైల్ కలిస్తే సంపూర్ణ ఆరోగ్యం
- జిల్లాలో 50 పిహెచ్‌సిల ద్వారా ప్రజలకు సేవలు
- విజయనగరం డిఎంహెచ్‌ఒ ఎస్.జీవనరాణి



ప్రజాశక్తి - కంటోన్మెంట్

వైద్యంతోపాటు లైఫ్ స్టైల్ మారితేనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే..

మన జీవన విధానం వల్ల రోగాలు వస్తాయి. రోగాలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి ప్రబలిన వెంటనే వైద్యాధికారులను హెల్త్ సిబ్బందిని అప్రమత్తం చేసి నివారణ చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. కార్పొరేటర్ వైద్యానికి ధీటుగా ప్రభుత్వ వైద్యం అందిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ టెస్టులు చేస్తున్నాం. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఎన్‌సిడి ద్వారా బెస్ట్ క్యాన్సర్, సర్జికల్ క్యాన్సర్ తదితర వ్యాధులను తొలి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం నుండి కాపాడుకోవచ్చు. విజయనగరం జిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 4 నాలుగు ఏరియా ఆసుపత్రులు ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. నిరంతరం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలు రోగాలు బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలతో పాటు వైద్య సేవలు, పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనూ ప్రతిరోజు 50 నుంచి 70 మంది వరకు ఓపి ఉంటుంది. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ద్వారా ఆధార్ కార్డు లింక్‌తో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు నిరంతరం పరిరక్షణ ఉంటుందని ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

డాక్టర్స్‌కు ఎమ్మెల్సీ కోటా ఉండాలి

ఐఎంఎ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు జెసి నాయుడు



ప్రజాశక్తి-కంటోన్మెంట్

శాసన మండలి సభ్యులుగా మేధావుల కోటాలో వైద్యులకు కూడా సీట్లు కేటాయించాలని ఐఎంఎ రాష్ట్రపూర్వ అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులపై దాడులను అరికట్టాలన్నారు. ఇటువంటి ఘటనలు జరగడం వల్ల చాలా మంది రేడియోలజి, స్కిన్ విభాగాలవైపు వైద్య విద్యార్థులు మొగ్గు చూపుతున్నారని అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆయన మాటల్లోనే...

శాసనమండలిలో వైద్యులకు సీట్లు ఇవ్వడం ద్వారా వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుత సమాజంలో ప్రవేట్ ఆస్పత్రుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, అయితే చిన్ని చిన్న క్లినిక్‌లకు, నర్సింగ్ హోమ్‌లకు, కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రభుత్వ నిబంధనలు ఒకేలా ఉండడంతో చిన్న ఆస్పత్రులు నడిపేవారు ఇబ్బందులు పడుతున్నారు. హాస్పిటల్ స్థాయిని బట్టి ప్రభుత్వ నిబంధనలు ఉంటే రోగికి నాణ్యమైన వైద్యం అందుతుంది. అందువల్ల ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఫైర్ పొల్యూషన్ తదితర నిబంధనల వల్ల చిన్న చిన్న ఆస్పత్రులు నడుపుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ కొంత మంది డాక్టర్లు చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లు వల్ల మొత్తం డాక్టర్స్‌పై సమాజంలో అపనమ్మకం ఏర్పడుతోంది. భవిష్యత్తులో అటువంటి అభిప్రాయం లేకుండా ఇటు డాక్టర్లు, అటు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉంది. మండల కేంద్రాల్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు ఉన్న నిబంధనల్లో కొన్నింటిని తొలగిస్తే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది. సింగిల్‌విండోలో ఆస్పతులను రెన్యువల్ చేయాలి. సామాన్య ప్రజల నుంచి ప్రధాని మంత్రి స్థాయి వరకు ఒకే రకమైన వైద్య సేవలు అందించాలి. వైద్యులు, రోగుల మధ్య స్నేహపూర్వక వాతా వరణం కల్పి ంచేందుకు ఐఎంఎ తరుపున కృషి చేస్తున్నాం. ఏదేమైనా రోగులకు, వైద్యులకు మధ్య దూరం పెరిగితే ప్రమాదం. అందువల్ల వీరి మధ్య సత్సంబంధాలు పెంచేందుకు రానున్న కాలంలో పలు అవగాహనా కార్యక్రమాలు చేపడతాం. ఇందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాం.

3257 వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు

ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ కె.సాయిరాం



ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ కె.సాయిరాం తెలిపారు. జిల్లాలోని 38 ఆస్పత్రులకు ఎన్‌టిఆర్ వైద్య సేవ గుర్తింపును ప్రభుత్వం అందించిదన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా 3257 వ్యాధులకు, శస్త్రచికిత్సలకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులు 11, ప్రయివేటు ఆసుపత్రులు 27 చోట్ల ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందుతున్నాయి. మరో 15 ఆసుపత్రుల్లో ఉద్యోగులు, జర్నలిస్టు, పెన్షనర్లకు ఇన్సూరెన్స్ కార్డుల ద్వారా దంత వైద్య సేవలు అందిస్తున్నాం. విజయనగరం సర్వజన ఆసుపత్రి, ఘోషాసుపత్రి, శృంగవరపుకోట, భోగాపురం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, బాడంగి, గజపతినగరం ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రయివేటు ఆసుపత్రుల్లో అభినవ నర్సింగ్ హోమ్, అమృత హాస్పిటల్, ఆంధ్రా హాస్పిటల్, గాయత్రి హాస్పిటల్, జిఎంఆర్ వరలక్ష్మి కేర్ హాస్పిటల్, కాస్వీ హాస్పటల్, కోలపర్తి హాస్పిటల్, మిమ్స్, మారుతి హాస్పిటల్, మువ్వ గోపాల హాస్పిటల్, నెఫ్రోల్స్ (డిహెచ్ విజయనగరం), పిజి స్టార్, పుష్పగిరి, క్వీన్స్ ఎన్ఆర్ఐ, సంజీవని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ బాబూజి హాస్పిటల్, శ్రీ సాయికృష్ణ హాస్పిటల్, శ్రీసాయి పివిఆర్ హాస్పిటల్, శ్రీసాయిసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీనివాస్ నర్సింగ్ హోమ్, సన్‌రైజ్ హాస్పిటల్, స్వామి ఐ హాస్పిటల్, తిరుమల మెడికవర్, వెంకట రామా హాస్పిటల్, వెంకట పద్మ హాస్పిటల్, విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ద్వారా ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందిస్తున్నాం.

జిల్లాకు ఆర్‌పిసిహెచ్ ప్రాజెక్టు

- సీతానగరంలో ప్రయోగాత్మకంగా అమలు
- గర్భిణుల ఆహార అలవాట్లపై ఎఐజితో కలిసి అధ్యయనం
- పార్వతీపురం మన్యం డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు



ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో జిల్లాకు రీ ప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ ప్రాజెక్టు మంజూరైందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు చెప్పారు. డాక్టర్స్ డే ప్రత్యేక సంచికకు ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

జిల్లాలో సీతానగరం మండలంలో ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ యాప్ ద్వారా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు అప్ లోడ్ చేయనున్నాం. హైదరాబాద్‌లోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ పని చేయనుంది. గర్భిణుల ఆహారపు అలవాట్లను అధ్యయనం చేసి జననీమిత్ర యాప్‌లో అప్ లోడ్ చేస్తాం. గర్భిణులు రోజువారీ తీసుకుంటున్న ఆహారం, వారి అలవాట్లను కిందిస్థాయి సిబ్బంది తీసుకుని యాప్‌లో అప్ లోడ్ చేస్తున్నాం. తద్వారా ఎఐజి వైద్యుల సలహాలు, సూచనల మేరకు గర్భిణుల ఆహారపు అలవాట్లలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నాం. దీనికి సంబంధించి సమగ్ర సర్వే చేపడుతున్నాం. జిల్లాలో మాతా, శిశు మరణాలు తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నాం. గడచిన ఏప్రిల్ నుంచి జిల్లాలో మాతృమరణాలు లేవు. శిశు మరణాలు కూడా తగ్గాయి. సీతానగరం, పార్వతీపురం, గరుగుబిల్లి మండలాల్లో ఈ ప్రాజెక్టు కింద అధ్యయనం చేసి గర్భిణులు సమతులాహారం తీసుకునేలా చర్యలు తీసుకుంటాం.


మలేరియా నియంత్రణ కు చర్యలు

జిల్లాలో మలేరియా నియంత్రణపై దృష్టి సారిస్తున్నాం. మలేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యే 248 గ్రామాలను గుర్తించాం. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, సాలూరు, పాచిపెంట మండలాల్లో ఈ గ్రామాలను గుర్తించాం. ఎప్పటికప్పుడు ఈ గ్రామాల్లో జ్వరాలపై సర్వే నిర్వహించి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. అంతకంటే ముందు జిల్లాలో 155 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతిగృహాల్లో జూన్ 12కు ముందే ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే మొదటి విడత పూర్తి చేశాం.

ఇప్పటి వరకు జిల్లాలో 1100 మలేరియా, 8 డెంగీ కేసులు నమోదయ్యాయి. హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలను అప్రమత్తం చేశాం. గత ఏడాదిలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వసతిగృహాల్లో విద్యార్థుల మరణాలు ఉండరాదనే లక్ష్యంతో సిబ్బందిని అప్రమత్తం చేశాం. జిల్లాలోని 350 సచివాలయాల్లో ఎఎన్ఎంలున్నారు. వీరు తరచూ వసతిగృహాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేదు. అవసరమైతే ఆసుపత్రి అభివృద్ధి నిధి నుంచి డబ్బులతో లేని మందులు కొనుగోలు చేసుకోవచ్చు. జిల్లాలో 14 మంది వైద్యులు ఉన్నత విద్య కోసం వెళ్లారు. వీరి స్థానంలో వైద్యుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

- అందుబాటులో యూరాలజీ, న్యూరో సర్జన్, అంకాలజీ
- రోజుకు 1300 మందికి వైద్య సేవలు
- ఒపి సమయాల్లో మార్పులు
- విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు



ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా సర్వజన ఆసుపత్రి ద్వారా రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నామని, రోగులకు మరిన్ని మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా సర్వజన ప్రభుత్వ వైద్య కళాశాల (మహారాజా/ఘోషాసుపత్రి) సూపరిండెంటెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మెడికల్ కళాశాల స్థాయికి అనుగుణంగా వైద్య ప్రమాణాలు పెరుగుతున్నాయి. వైద్యుల పట్ల రోగులు అత్యంత నమ్మకంతో మెలిగినప్పుడే మానసిక స్థైర్యం మెరుగుపడుతుంది. తద్వారా వైద్యసేవలు ఆరోగ్యానికి దోహదపడతాయి. గతంతో పోలిస్తే ఇప్పటికే వైద్యసేవలు మెరుగు పడ్డాయి. ఆసుపత్రి సేవల పట్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పేషెంట్లు, ఇన్పేషెంట్ల సంఖ్య క్రమంగా పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనంగా చెప్ప వచ్చు. రోజుకు 1300 వరకు రోగులు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. యురాలజి, న్యూరోసర్జన్, అంకాలజీ, వంటి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా సర్వజన ఆసుపత్రి మెడికల్ కాలేజీగా గుర్తింపు కావాలంటే ఖచ్చితంగా 605 బెడ్‌లు ఉండాలని, అందుకే అన్ని బెడ్‌లు ఏర్పాటు చేశాం. అన్ని బెడ్‌లూ రోగులతో నిండి పోతున్నాయి. మెడికల్ కళాశాలలో ఔట్ అకడమిక్ సేవలకు అనుగుణంగానే, ఆసుపత్రిలో వైద్య సేవలు, ప్రమాణాలు మెరుగవుతున్నాయి. ఇలా మరో నాలుగైదేళ్ల పాటు ప్రమాణాలు మెరుగుపడ్డాక అన్ని రకాలైన వైద్యసేవలూ స్థానికంగానే దొరకుతాయి. విశాఖ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నీ రకాల వైద్య సేవలూ అందిస్తున్నాం. రోగులకు కూడా భద్రత పెంచాం. ఇక్కడికి వచ్చే రోగులు నేరుగా తాము వెళ్లాల్సిన విభాగాలకు వెళ్లే విధంగా ఎక్కడికక్కడ బోర్డులు, సహాయకులను ఏర్పాటు చేశాం. ఓపి రిజిస్ట్రేషన్ మొదలుకుని ఎక్స్, స్కానింగ్ రిపోర్టుల వరకు అంతా ఆన్లైన్లో జరుగుతున్నప్పటికీ రోగులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. అంకిత భావంతో పనిచేసే వైద్యులు, నిత్య అన్వేషణతో మెలిగే వైద్య విద్యార్థులు నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. ఆధునాతన యంత్ర పరికరాలతో పాటు వైద్యులు, సిబ్బంది, ల్యాబొరేటరీ, ఇతర సదుపాయాలు ఉన్నాయి. ఈ ఏడాది ఎంబిబిఎస్ రెండో సంవత్సరం ప్రారంభం కానుంది. ఇందుకు తగ్గట్టే రోగుల తాకిడి కూడా ఉంది. ఇక్కడ అన్ని రకాల వైద్యసేవలూ అందుబాటులో ఉన్నప్పటికీ మెడికల్ కాలేజీగా మారిన తరువాత న్యూరాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఆసుపత్రి పని గంటలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓ.పి ఉండేది. దాన్ని మారుస్తూ ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓపి పని వేళల్లో మార్పులు తీసుకు వచ్చాం. ఉదయం పూట ఆసుపత్రికి రాని రోగులకు మధ్యాహ్నం ఒపి ఎంతో ఉపయోగపడుతుంది.

ముందు జాగ్రత్తలతో మోకాళ్ల నొప్పుల నివారణ

ఎముకలు, కండరాలు వైద్య నిపుణులు భరత్ కుమార్



బొబ్బిలి : మోకాళ్ల నొప్పులు నివారణకు ముందు జాగ్రత్తలు తప్పనిసరి అని ఎముకలు, కండరాల వైద్య నిపుణులు బంకురు భరత్ కుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లో.. వయస్సు పెరిగే కొద్దీ మోకాళ్లలోని(మిగతా..5లో)

ముందు జాగ్రత్తలతో మోకాళ్ల నొప్పుల నివారణ

(4వ పేజీ తరువాయి)

కార్టిలేజ్ (గుజ్జు) అరిగిపోతుంది. వయసు రీత్యా కలిగే మార్పులో ఇది ఒకటి . 50 ఏళ్ల తర్వాత ఏదో ఒక దశలో ఆస్టియ అర్ధ రైటీస్ తీవ్రత ఉండే అవకాశం ఉంది. ప్రతిఒక్కరు ఎదో ఒకసారి ఆస్టియ అర్ధ రైటీస్ బారిన పడక తప్పదు. క్రమం తప్పకుండా వ్యాయామం చేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటే ఆస్టియ అర్ధ రైటీస్, కార్టిలేజ్ వంటి వాటిని అధిగమించవచ్చు. 25నుండి 40ఏళ్ళ వయసు వాళ్లలో ఎక్కువగా మోకాళ్ల నొప్పి కనిపిస్తుంది. ఎక్కువ సేపు కూర్చొని పైకి లేచినపుడు మోకాళ్ళ ముందు భాగంలో నొప్పి రావడం కాండ్రో మలేషియా లక్షణం. కాండ్రోమలేషియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు : 1.కింద కూర్చోవడం మానేయాలి. వాష్ రూమ్ కమోడ్ వాడాలి. 2.వీలైనంత వరకు మెట్లు ఎక్కడం, దిగడం తగ్గించాలి. 3.డెస్క్ జాబ్స్ లో ఉన్నవాళు ప్రతీ గంటకు పైకి లేచి అటు, ఇటు తిరగాలి. 4.మోకాలి వ్యాయమాలు పొద్దున్న అరగంట, రాత్రిపూట ఒక అరగంట చేయాలి. 5.మోకాళ్ల సమస్య ఉన్నవారు వాకింగ్ చెయ్యవచ్చు. 6.ఈత, సైక్లింగ్ మోకాళ్ల ఆరోగ్యానికి మంచి వ్యాయామం.

వైద్యులే ప్రాణదాతలు

ఔను! వైద్యులు ప్రాణదాతలే. సంపాదించిన జ్ఞానంతో సాటి మనిషిని కాపాడగలిగే శక్తి సామర్థ్యాలు కేవలం వైద్యులకు మాత్రమే ఉంటాయి. అందుకే కనిపించని దేవుళ్ల కన్నా గొప్పవారుగా కీర్తించబడతారు. గడిచిన రెండేళ్లలో కరోనా కష్టకాలంలోను, నేటి సీజనల్ వ్యాధులు, రోడ్డు ప్రమాదాలు నుంచి ఆరోగ్యాన్ని, ప్రాణాల్ని రక్షించగలుగుతున్నారు. ఈ విషయంలో రాత్రి, పగలు అనే తేడా లేదు. పేద, ధనిక అన్న తారతమ్యం అంతకన్నా కనిపించదు. ఎంత పనిఒత్తిడిలో వున్నా రోగిని రక్షించడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యంగా భావిస్తారు. కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులతో గడిపే అవకాశాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోగాలతో మూలుగుతున్నా.. మృత్యువుతో పోరాడుతున్నా.. వారిని అమ్మలా... నాన్నలా.... తోబుట్టువులా... అక్కున చేర్చుకుని సేవలందిస్తారు. అందుకే వృత్తుల్లో దేనికదే ప్రాధాన్యత ఉన్నప్పటికీ వైద్యవృత్తికి ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే మనిషి ప్రాణాలను కాపాడే అవకాశం, అందుకు తగ్గ శక్తిసామర్థ్యాలు వారికి మాత్రమే ఉంటాయి. ఇటువంటి పరిస్థితుల్లో జులై 1న జాతీయవైద్యుల దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో వైద్యసేవలు, వైద్యరంగంలో వచ్చిన మార్పులను గుర్తుచేసేదే ఈ ప్రత్యేక కథనం.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశ్వవ్యాప్తంగా కరాళనృత్యం చేస్తున్న కరోనా వైరస్ బారిన మన జిల్లాలోనూ లక్ష మందికిపైగా పడిన విషయం విధితమే. వీరందరికీ వైద్య సేవలందించడంలో వైద్యుల పాత్ర అత్యంత కీలకం. కరోనా వైరస్ ఒక అంటువ్యాధి అని తెలిసినా ప్రాణాలకు తెగించి సేవలందించిన త్యాగమూర్తులు కొందరు అశువులు బాసిన తీరు జిల్లా వాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. నేటి పరిస్థితుల్లో వైద్య వృత్తి కత్తిమీద సాములా మారింది. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రుల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా వైద్యులు లేరు. ఉన్న కొద్ది మంది వైద్యులే అన్ని రకాల సేవలూ అందించాల్సివస్తోంది. వైద్యులు నిరంతర విద్యార్థులు వంటివారు. వైద్యరంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. కొత్తకొత్త ఆవిష్కరణలను ఆకలింపజేసుకుంటూనే రోగులకు అందుకనుగుమైన వైద్యసేవలను అత్యంత ఓర్పు, సహనంతో అందిస్తుంటారు. అధ్యయనం తగ్గితే రోగులకు న్యాయం చేయలేని పరిస్థితి. ఇందుకోసం ఎంతో మంది వైద్యులు నిరంతరం హోం వర్కు, టీం వర్కు వంటి పద్ధతిని అవలంభిస్తుంటారు. ఇలాంటి పని ఒత్తిడిలో రోగులు లేదా వారి బంధువులతో మాట్లాడినప్పుడు చిరాకుపడినా, పరాకు వహించినా కొంతమంది దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడడం నేరమే కాదు. తల్లిదండ్రులను, దైవాన్ని అవమానించినట్టే లెక్క. ఎందుకంటే వైద్య వృత్తి అంత పవిత్రమైనది. రోగులనుంచి తమ ఆరోగ్యానికి హాని ఉంటుందని తెలిసినా వారిని చేరదీసి వైద్యారోగ్య సేవలు అందించేందుకు ఏమాత్రం వెనుకాడనిది వైద్యులు మాత్రమే. సాటి రక్త సంబంధీకులే పట్టించుకోని ఈ రోజుల్లో రోగులను వెన్నుతట్టి ఆరోగ్యం కుదుట పడుతుందంటూ కుశల ప్రశ్నలతో ధైర్యం చెప్పే వైద్యులను ఎంత గౌరవించినా తక్కువే. ఇలా ప్రభుత్వ వైద్యులు నిత్యం పనిభారంతో నలిగిపోతుంటే అటు ప్రైవేటు వైద్యులూ ఆప్తులుగా మారుతున్నారు. ప్రభుత్వ విధానాల వల్ల సంబంధిత ఆసుపత్రుల్లో తగిన ముందులు, లేదా వైద్యపరికరాలు, లేబొరేటరీలు వంటివి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రైవేటు నర్సింగ్ హోంలను ఆశ్రయించక తప్పడం లేదు. ఫీజుల, బిల్లుల సంగతి కాస్త పక్కనబెడితే రాత్రి, పగలు అన్న తేడా లేకుండా అందుబాటులో ఉండడం గొప్ప విషయమే. రోగి ఎలాంటి స్థితిలో వచ్చినా వారు వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగానే ఉంటారు. అందుకే వైద్యులను ప్రాణదాతలు అంటారు.



రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

కరోనా సమయంలో వైద్యుల వైపు చూసిన ప్రపంచం

ప్రపంచం యావత్తూ వైద్యులవైపు చూస్తోంది. రకరకాలుగా ప్రజల్ని పీడిస్తున్న, కొత్తగా పుట్టుకొస్తున్న వ్యాధుల బారి నుండి తమను రక్షించేది వైద్యులేనని నమ్ముతోంది. సునామిలా ప్రపంచాన్ని చుట్టేసి అతలాకుతలం చేసిన కరోనా బాధితులకు ముందు వరుసలో ఉండి వైద్యసేవలు అందించిన వైద్యులకు శిరస్సు వంచి మోకరిల్లుతోంది. మృత్యు అంచుల్లోకి వెళ్లిన పజలకు తమ చికిత్స ద్వారా పునర్జన్మను ప్రసాదించిన దేవుళ్లుగా కొలుస్తోంది. కరోనా నుండి మానవాళిని రక్షించేందుకు తమ జీవితాలను సైతం ఫణంగా పెట్టిన వారికి చేతులెత్తి మొక్కుతోంది. ఇప్పుడు వచ్చిన సమస్యకు పరిష్కారం చూపేది శాస్త్ర విజ్ఞానం తప్ప మరొకటి కాదని నమ్ముతోంది. కరోనా సమయంలో ప్రపంచం విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వైద్యులు, వైద్యసిబ్బంది సేవలను కొనియాడక తప్పదు. జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వారి సేవలను మననం చేసుకోవడం అందరి కర్తవ్యం.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- **కాలం చెల్లిన మందులు అమ్మితే మెడికల్ షాపులపై కఠిన చర్యలు**
- **జిల్లా డ్రగ్ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రజిత**



ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం జిల్లాలో నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రజిత హెచ్చరించారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

జిల్లాలో సుమారు 1660 మెడికల్ షాపులు ఉన్నాయి. రిటైల్ 1060, హోల్‌సేల్ మెడికల్ షాపులు 400 వరకు ఉన్నాయి. ప్రతి మెడికల్ షాపును ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విజయనగరం, బొబ్బిలి ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్లు లలిత , లావణ్య ఉన్నారు. ప్రతి నెలా ఇన్‌స్పెక్టర్లు ఒక్కొక్కరు 40 షాపులను తనిఖీ చేస్తారు. కాలం చెల్లిన మందులను మెడికల్ షాపుల్లో అమ్మరాదు. కాలం చెల్లిన మందులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి మెడికల్ షాపులో యాంటీ బయోటిక్ మందులు అమ్మే సమయంలో ఫార్మాసిస్ట్ ఉండాలి. యాంటీ బయోటిక్ మందులను వైద్యులు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల షాపుల్లో అమ్మకం చేయరాదు. మందులు కొనుగోలు చేసిన ప్రతిఒక్కరికి బిల్లు ఇవ్వాలి.

మంచి ఆహారపు అలవాట్లు చాలా అవసరం

చర్మవ్యాధుల వైద్య నిపుణులు చండీ ప్రియ



ప్రజాశక్తి-కంటోన్మెంట్

చర్మం ఆరోగ్యంగా ఉంచుకోవడానికి శారీరక పరిశుభ్రతతో పాటు మనిషి మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలి చాలా అవసరమని చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ బి.చండీ ప్రియ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

చర్మవ్యాధులు పెద్దవాళ్లకే కాకుండా చిన్న పిల్లలకు వస్తుంటాయి. చర్మానికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు సోకినప్పుడు ఆన్‌లైన్‌లో, గూగుల్‌లో చూసి క్రీములు వాడకూడదు. డాక్టర్ సలహా లేకుండా స్టెరాయిడ్ క్రీమ్స్ వాడకూడదు. చాలామంది యువత సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను చూసి క్రీములను ముఖ సౌందర్యం కోసం వాడుతున్నారు. అలా చేయడం వల్ల చర్మంపై దద్దుర్లు రావడం, సైడ్ ఎఫెక్ట్స్ కలగడం తరచూ జరుగుతుంది. వర్షాకాలంలో తడవడం, తడిగా ఉన్న దుస్తులు ధరించడం, పరిశుభ్రత పాటించకపోవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు స్టెరాయిడ్స్ రాయకూడదు. దగ్గర్లో ఉన్న స్కిన్ స్పెషలిస్టులను సంప్రదించి వైద్య సేవలు పొందాలి.

ఆహారపు అలవాట్లతోనే

గుండెజబ్బుల నుంచి రక్షణ

వెంకటరామా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ చిట్టి రమణారావు



ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతిఒక్కరూ ఆహార నియమాలు పాటించడం ద్వారానే గుండె జబ్బులకు దూరంగా ఉండ వచ్చునని నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు సమీపంలోని గల వెంకటరామా మల్టీ స్పెషాలిటీ ఆస్పతి ఎమ్‌డ్ డాక్టర్ చిట్టి రమణారావు తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

వెంకట రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో హార్ట్ కేర్ విభాగం ద్వారా గుండె సంబంధిత జబ్బులకు చికిత్స అందిస్తున్నాం. అంతేకాకుండా వైష్ణవ్ ఐకేర్ ద్వారా కంటి వైద్యసేవలు కూడా అందుబాటులోకి తెచ్చాం. లాప్రోస్కోపిక్ సదుపాయం కూడా అందుబాటులో ఉంది. డాక్టర్ వైష్ణవ్ పేరు మీద హార్ట్ కేర్‌ను స్థాపించి రెండు సంవత్సరాలు గడిచింది. హార్ట్‌కేర్‌లో అత్యాధునిక టెక్నాలజీని తీసుకువచ్చాం .కేథ్‌ల్యాబ్ ద్వారా యాంజియా గ్రామ్, స్టంటింగ్ సదుపాయాలు ఉన్నాయి. ఇప్పటివరకు సుమారు 2వేల కేసులు పైబడి విజయవంతంగా అత్యంత అనుభవం గల డాక్టర్లతో పూర్తిచేశాం. రౌండ్ ద క్లాక్ విధానంలో కార్డియాలజిస్ట్, కార్డియాక్ ఎమర్జెన్సీ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. హార్ట్ కేర్‌కు సంబంధించి అన్ని చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తున్నాం. అన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కార్డుల ద్వారా కూడా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక అనుభవం కలిగిన వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన రోగులకు బిఎస్‌కెవై కార్డుల ద్వారా కూడా వైద్యసేవలు అందిస్తున్నాం. కేథ్‌ల్యాబ్ లో ఆదిత్య నృసేన్, సుజిత్ నాయుడు, గౌరీ శంకర్ రెడ్డి, రెడ్డి మహేష్ వంటి అనుభజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. అంతేకాకుండా ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులు, జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలకు స్పెషలిస్టులు ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నాం. ప్రస్తుత రోజుల్లో ఆహార అలవాట్లలో విపరీతమైన మార్పులు వచ్చాయి. ఫాస్ట్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపునకు సంబంధించిన వ్యాధులు పెరిగి ఊబకాయం, పేగులకు సంబంధించిన వ్యాధులు, గ్యాస్ట్రిక్ వంటివి వస్తున్నాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలి. ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తీసుకోరాదు.

రొమ్ముల్లో గడ్డలన్నీ కేన్సర్లు కావు

జనరల్ సర్జన్ ఎస్.వి.సత్యశేఖర్



ప్రజాశక్తి-శృంగవరపుకోట

మహిళల్లో రొమ్ముల్లో వచ్చే గడ్డలన్నీ కేన్సర్లు కావని జనరల్ సర్జన్ డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్ అన్నారు. డాక్టర్సడే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సాధారణంగా ప్రతి మహిళలో వారి శరీర ఆకృతిని బట్టి రొమ్ము గ్రంథి భాగం, కొవ్వు భాగం కలిసి ఉంటుంది. బాలింత అయిన సమయంలో గ్రంథి భాగం కొంచెం ఎక్కువగా ఉండి అప్పుడప్పుడు చిన్న చిన్న పాల గడ్డలు ఏర్పడతాయి. పిల్లలకు పాలు ఇవ్వడం ఆపేసిన తరువాత ఆ గడ్డలు తగ్గిపోతాయి. రొమ్ము గడ్డల్లో ఉన్న రకాలు 1.ఫైబ్రో ఎడునోసిస్.. ఇవి పన్నెండు సంవత్సరాల నుండి 40 ఏళ్ల వయసు గల ఆడపిల్లలో ఎవరికైనా ఉండొచ్చు. ఇవి నొప్పి కలిగి రొమ్ము భాగంలోని గడ్డలు గడ్డలుగా అనిపించి కనిపించొచ్చు. రుతుక్రమంలో కూడా సైజ్ పెరిగే అవకాశం ఉంటుంది. రుతుక్రమం ఆగిపోగానే సైజుతగ్గి నొప్పి కూడా తగ్గుతుంది. దీనినే భ్రష్టు మాస్ట్రాలజీ అంటారు. ఇది చిన్న నొప్పి పుట్టి మాత్రలతోనే తగ్గుతుంది. అంత ప్రమాదం కాదు. 2.ఫైబ్రో అడినోమా... ఇది ఒక రొమ్ము భాగంలో ఏదో ఒక భాగంలో నిమ్మగడ్డ సైజులో లేదా అంతకన్నా పెద్దదైన ఆకారంలో కనిపిస్తుంది. ఈ గడ్డ రొమ్ములో ఏ భాగంలోనైనా తిరిగి నట్టుగా అనిపిస్తుంది. సాధారణంగా 17 నుంచి 35 ఏళ్ల వయసులో ఉన్న మహిళల్లో ఎక్కువగా వస్తుంది. ఇది సాధారణంగా ప్రమాద కారి కాదు. కానీ కాస్మొటిక్‌గా పెద్ద సైజులో ఉన్నప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం దీనికి సర్జరీ కన్నా చూస్తూ ఉండటమే మంచిది. దీన్ని స్కాన్ ద్వారా తెలుసుకోవచ్చు. 3.కేన్సర్ వ్యాధి... 30 ఏళ్ల నుండి 60 సంవత్సరాల లోపు పెళ్లి కాని, పిల్లలు లేని, బాగా లావుగా ఉన్న వారికి, కుటుంబపరంగా ఇంట్లో మహిళలకు కూడా వస్తుంది. ఇది రొమ్ములో నుంచి ఎత్తు భాగంలో రక్తస్రావంగా గానీ, రొమ్ము భాగంలో గడ్డలుగా గానీ, చంకలో గడ్డలుగా గానీ, ఆఖరి దశలో ఛాతీ నొప్పి గానీ ఉండే అవకాశం ఉంది. మొదటి రెండు దశల్లో ముందుగా చూసుకుంటే రికవరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్టేజ్- 3, 4లో అవకాశాలు ఉన్నప్పటికీ చాలా తక్కువ. దీనికి మల్టీ మోడల్టీ (సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ)తో తగ్గించడం జరుగుతుంది, ముందుగా చూసుకున్న ట్లయితే కేన్సర్ ఉన్నా ఎక్కువ కాలం బతికే అవకాశం ఉంటుంది.

ముందుగా ఎలా తెలుసుకోవాలి

ప్రతి మహిళా బ్రెస్ట్ సెల్ఫ్ ఎగ్జామినేషన్ (బిఎస్ఇ) రొమ్ము భాగాలను చేత్తో అదిమి చూసుకోవాలి. రొమ్ములో గడ్డలు ఉన్నప్పుడు వెంటనే జనరల్ సర్జన్‌కి చూపించాలి. వాటికి మెమోగ్రామ్, అల్ట్రా సౌండ్ స్కాన్, ఎఫ్ఎన్ఎసి, బయాప్సీ ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి తరువాత స్టేజీల కోసం సిటీ స్కాన్ చేసి మల్టీ మొరాలిటీ ద్వారా శస్త్రచికిత్స అందిస్తారు.

అపోహలు

రొమ్ములో గడ్డలు కొన్ని కొంత శాతం వరకు కూడా చిన్న చిన్న ఇబ్బంది పెట్టడం తప్ప పెద్దగా ప్రాబ్లమ్ అనిపించవు. కానీ చాలామంది మహిళలు సిగ్గు, బిడియంతో జనరల్ సర్జన్‌కు చూపించకుండా ఉండడం వల్ల అది ముదిరి కేన్సర్‌గా మారే అవకాశం ఉంటుంది. రొమ్ము గడ్డలపై అవగాహన లేని డాక్టర్లకు చూపించటం వల్ల వ్యాధి ముదిరే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

గర్భిణి సమయంలో జాగ్రత్తలు అవసరం

ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు పి.మధుబాల



ప్రజాశక్తి-శృంగవరపుకోట

గర్భిణి సమయంలో స్త్రీలు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పి.మధుబాల తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

ముఖ్యంగా మహిళలు గర్భిణి అని పరీక్ష ద్వారా తెలిసిన వెంటనే గైనకాలజిస్టును తప్పనిసరిగా సంప్రదించాలి. ఎందుకంటే? కొంతమందిలో మొదట్లో ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చే అవకాశాలు ఉంటాయి. గైనకాలజిస్టును సంప్రదిస్తే స్కాన్ ద్వారా అటువంటి ఇబ్బందులను తెలుసుకోగలం. ఎక్కువమందికి వాంతులు అవుతూ ఉంటాయి. అటువంటప్పుడు ఇది సాధారణమే కదా! అని పెద్దల మాటలు విని ఇంట్లో కూర్చోకూడదు. రెగ్యులర్‌గా వైద్యులతో తనిఖీలు చేయించుకొని సమయ ప్రకారం ఇంజెక్షన్లను వేయించాలి. ప్రెగ్నెన్సీ సమయంలో జంక్‌ఫుడ్ తినకూడదు. పండ్లు, ప్రోటీన్లు, పీచు పదార్థాలు ఉండే ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవచ్చు. ప్రెగ్నెన్సీ సమయంలో మొత్తం ఐదు స్కానింగ్‌లను చేయించు కోవాలి. అలా చేయడం ద్వారా బేబీకి హార్ట్ బీట్ వస్తుందో, లేదో తెలుస్తుంది. ఆరోగ్యకర ప్రెగ్నెన్సీ గురించి తెలుస్తుంది. బేబీ వృద్ధి, ఉమ్మనీరు వంటివి పరిశీలించాలి. బెడ్ రెస్ట్‌లో ఉండాల్సిన అవసరం లేదు. ఎవరు పని వారు చేసుకుంటూ వైద్యులను సంప్రదించాలి మా ఆసుపత్రిలో 70 శాతం డెలివరీ కేసులు నార్మల్‌గా అయ్యే విధంగా చూస్తున్నాం. సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా కూడా సేవలు అందిస్తున్నాం. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు కూడా ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా చేస్తున్నాం. గర్భసంచిలో కణితలు మొదలుగు ఆపరేషన్లు లాప్రోస్కోపీ ద్వారా చేస్తున్నాం.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రసూతి సంతాన సాఫల్య వైద్య నిపుణులు సునీత



ప్రజాశక్తి-బొబ్బిలి

గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్నే తీసు కోవాలని, ఎలాంటి బయట తిండ్లు తినకూడదని ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణులు వి. సునీత అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పాలు, పండ్లు, గుడ్లు, మాంసం వంటి పౌష్టికాహారం తీసుకోవాలి. మొదటి మూడు నెలలు ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలి. ఈ మాత్రల వల్ల పుట్టబోయే బిడ్డలో వెన్నెముక లోపాలను నివారించవచ్చు. గర్భిణులకు హైబిపి, డయాబెటిస్ వంటి సమస్యలకు వైద్యుల సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా వైద్యులతో పరీక్షించుకోవాలి. బరువైన వస్తువులు మోయడం చేయకూడదు. దూర ప్రయాణాలు చేయక పోవడమే మంచిది. పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు తాగిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు. వైద్యులను సంప్రదించిన ప్రతిసారీ గర్భాధారణ సమయంలో బరువు, బిపి, శరీరం నుంచి కోల్పోయే ప్రోటీన్లను తెలుసు కునేందుకు మూత్ర పరీక్షలు చేయించు కోవాలి. బిడ్డ ఎదుగుదల, పరిశీలనకు స్కానింగ్ చేయించాలి. నిద్రపోయేటప్పుడు ఎడమ వైపు తిరిగి పడుకోవడం మంచిది. నొప్పులు వచ్చినా, ఉమ్మనీరు పోయినా, రక్తస్రావం జరిగినా బిడ్డ కదలికలు లేకపోయినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తొలి మూడు నెలలు పూర్తయ్యేంత వరకు శృంగారానికి దూరంగా ఉండడం మంచిది. ప్రతి నెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య సేవలు

కొట్టాం పిహెచ్‌సి వైద్యాధికారి జె.హారిక



ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి, గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.హారిక అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే..

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణే లక్ష్యంగా సేవలందిస్తున్నాం. ముఖ్యంగా గిరిశిఖర గ్రామాలలో గిరిజనులకు వైద్య సేవలు అందే విషయంలో చాలా జాగ్రత్తలు వహిస్తున్నాం. పిఎం జన్‌మన్- డిఎ జుగా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గిరిజన జనాభా అధికంగా ఉన్న మండలాల్లో జూన్ 15 నుంచి సిట్యురేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నాం. గిరిశిఖర గ్రామాల గిరిజనుల కోసం మండలంలో వారాంతపు సంతలు జరిగే ప్రాంతంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం, అత్యవసర పరిస్థితులలో గిరిజనులకు వైద్య సహాయాలు త్వరగా అందేటట్లు చేయడం, పరిసరాలు, ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపడ తున్నాం. మైదాన ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నెలకు రెండు సార్లు గ్రామాలను సందర్శి స్తున్నారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్‌తో పాటు వెళ్లి వైద్య సేవలందిస్తున్నాం.

కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పుడు 24 గంటల వైద్య సేవలు అందుతున్నాయి. వీటితోపాటు మంచానికి పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ రోగులను పరామర్శిస్తూ వారి ఇంటి వద్దే వైద్య సేవలందిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నాం. ఇప్పటికే పిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాలను సందర్శిస్తూ వందలాది మందికి వైద్య సేవలు అందించాం. ప్రాథమికంగా ప్రజలకు వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనేది లక్ష్యం. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అన్ని రకాల వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంటాయి. గ్రామ స్థాయిలో నయం కాని ఆరోగ్య సమస్యలున్న వారిని ఎన్‌టిఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. చిన్న పిల్లలు, గర్భిణులకు కూడా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ఆశావర్కర్లు వైద్యం అవసరమైన వారిని గుర్తిస్తారు. కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా కృషిచేస్తున్నాం.

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతి వరం

జిల్లా హోమియోపతి సీనియర్ వైద్యాధికారి బట్టు వరప్రసాద్



ప్రజాశక్తి-కంటోన్మెంట్

హోమియోపతి ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ బట్టు వరప్రసాద్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఆయుర్వేదిక్ వైద్యంపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలను, ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం. హోమియోపతి వైద్యం ద్వారా కీళ్ల నొప్పులు, దగ్గు, జలుబు, చర్మ వ్యాధులు, అజీర్ణ వ్యాధులకు వైద్యం అందిస్తున్నాం. విజయనగరం జిల్లాలో 16 హోమియోపతి ఆస్పత్రుల ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. బల్లంకి, కొత్తవలస, లక్కవరపుకోట, రాకోడు, విజయనగరం, డెంకాడ, పూసపాటిరేగ, సతివాడ, గర్భాం, గరివిడి, గజపతినగరం, గుర్ల పెదమేడపల్లి, గరుగుబిల్లి, బొబ్బిలి, పార్వతీపురం, శివడవలస తదితర ఆస్పత్రుల ద్వారా హోమియో వైద్యాన్ని అందిస్తున్నాం.

ప్రతి ఆసుపత్రికి ప్రతిరోజూ 30 నుంచి 40 మంది వైద్యం చేయించుకునేందుకు వస్తున్నారు. మందులు పుష్కలంగా ఉన్నాయి. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి రెండు రోజులకు ఒకసారి గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. అల్లోపతికి దీటుగా హోమియో వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నాం.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సదాశివ ఆసుపత్రి వైద్యులు పెంట రాకేష్




ప్రజాశక్తి-బొబ్బిలి

పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని సదాశివ ఆసుపత్రి వైద్యులు పెంట రాకేష్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..


పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే దోమలను నివారించవచ్చు. పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి. దోమలను నివారిస్తే వ్యాధులను నివారించవచ్చు. నీరు వేడి చేసి చల్లార్చి తాగితే ఆరోగ్యంగా ఉండగలం. నీరు ఎంత ఎక్కువ తాగితే ఆరోగ్యానికి అంతమంచిది. మూత్ర, మల విసర్జన చేసిన తర్వాత చేతులను సబ్బుతో కడగాలి.

సీజనల్ వ్యాధులు వస్తే పారాసిటమాల్ మాత్రలు వేయాలి. అప్పటికీ తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి.



దీర్ఘకాలిక వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

న్యూరో ఫిజీషియన్ వంగపండు నిర్మల



ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎవరిలో అయితే బిపి, షుగర్ అనేవి ఉంటాయో వారు అశ్రద్ధ వహించకుండా జీవితకాలం మందులు క్రమం తప్పకుండా వేసుకోవాలని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ వంగపండు నిర్మల తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

మారుతున్న జీవనశైలితో అలవాటు చేసుకున్న పద్ధతులను ప్రతిఒక్కరూ మార్చుకోవాలి. నేటి యువత ఎక్కువగా స్మోకింగ్, డ్రింకింగ్, మత్తు పదార్థాలకు బానిసవ్వడం జరుగుతుంది. వీటి వలన బిపి, షుగర్, బ్రెయిన్‌స్ట్రోక్, బ్లడ్ క్లాట్ వంటివి సంభవిస్తున్నాయి. ప్రతి ఒక్కరు రసాయనాల ఆహార పదార్థాలు కాకుండా సేంద్రీయ వ్యవసాయ ఆహారాన్ని తీసుకోవాలి. అదేవిధంగా ఆయిల్ ఫుడ్ తగ్గించాలి. బ్రెయిన్ స్ట్రోక్ రెండు రకాలు. ఒకటి.. బ్రెయిన్ కు వెళ్లే రక్త నాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల స్ట్రోక్ వస్తుంది. రెండోది హెమరేజింగ్ స్ట్రోక్ అంటే బ్రెయిన్‌లో రక్త నాళాలు రక్త ప్రసరణ శక్తిని తట్టుకోలేక నరాలు చిట్లిపోవడం. హెమరేజింగ్ స్ట్రోక్ 15శాతం మందిలో చూస్తే, ఇస్కెమిక్ స్ట్రోక్ 85శాతం కేసుల్లో చూస్తుంటాం. హైపర్ టెన్షన్, సుగర్, పొగతాగడం, అల్కాహాల్, చెడు కొవ్వు వంటి వాటి ద్వారా స్ట్రోక్ వస్తుంది. అయితే వీటిని కంట్రోల్ చేసుకోవచ్చు. తద్వారా స్ట్రోక్‌ను కంట్రోల్ చేసుకోగలం. నాన్ మెడబుల్ ఫ్యాక్టర్స్ స్ట్రోక్ అనేది మన చేతిలో లేనిది. వయసు, వారసత్వంగా పురుషుల్లో కొంతమందికి రిస్కు ఉంటుంది. 55ఏళ్ల తరువాత రిస్కు ఎక్కువగా ఉంటుంది. ఏ సమయంలో డాక్టర్ వద్దకు వెళ్లాలంటే.. బాగా మాట్లాడుతున్న వ్యక్తి మాట తడబాటు రావడం, కాళ్లు చేయి పనిచేయకపోవడం, చూపు మందగించడం, ప్రతిదీ డబుల్ కనిపించడం, బ్యాలెన్సు తప్పడం, కంగారు పడడం ఇలా ఏ లక్షణం కనిపించినా వెంటనే న్యూరాలజీ డాక్టర్ వద్దకు వెళ్లాలి. సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ చేసి రక్తం గడ్డ కట్టిందా, రక్త ప్రసరణ జరుగుతుందా లేదా చూసి వైద్యసేవలు అందిస్తాం. స్ట్రోక్ వచ్చిన వారు నాలుగున్నర గంటల్లోగా ఆస్పత్రికి చేరుకోవాలి. క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం, మంచి ఆహారపు అలవాట్లు వంటివి అలవర్చుకోవాలి. ఆల్కహాలును నివారించాలి. వైద్యుల సలహాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు. మందులతో పాటు ఫిజియోథెరపీ క్రమం తప్పకుండా చేయించుకోవాలి.
















అధునాతన టెక్నాలజీతో పరీక్షలు

ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వరలక్ష్మి



ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్త్రీల సంతాన సాఫల్య లోపాలను తెలుసుకునేందుకు కొలపర్తి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో అధునాతన టెక్నాలజీతో పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వరలక్ష్మి తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే...

సంతాన సాఫల్య లోపాలు స్త్రీ, పురుషుల్లో సమానంగా ఉంటాయి. భార్యాభర్తలు ఒకేసారి వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. సంతాన సాఫల్యతపై అధునాతన టెక్నాలజీతో పరీక్షలు నిర్వహిస్తున్నాం. స్త్రీ, పురుషుల్లో చెరో 40 శాతం సంతానలేమికి కారణాలైతే తెలియకుండా 10 శాతం సాధారణంగా పురుషుల్లో ఉంటుంది. అందుకని భార్యాభర్తలిద్దరూ పరీక్షలు చేసుకోవడం తప్పనిసరి. ఎక్కువగా వీర్యకణాలు లేకపోవడం, వీర్యకణాల్లో చలనం తక్కువగా ఉండడం, సారూప్యతలో లోపాలు పురుషుల్లో కనబడతాయి. స్త్రీల్లో అయితే గర్భాశయంలో లోపాలు, అందులో కణతులు, ఇన్ఫెక్షన్ వ్యాధులు అన్నవాహిక మూసికొని పోవుట, అండాశయంలో అండాల ఉత్పత్తి లేకపోవడం... ఇలా అనేక హార్మోన్ల లోపాలుంటాయి. సమతుల్యత, గర్భాశయం, అండాశయాలు, అన్నవాహికల స్థితి, అండ వాహికలు నార్మల్, అడ్డంకులు కలిగి ఉన్నాయా, ఉత్పత్తి సక్రమంగా ఉందా? లేదా తెలుసుకొనేందుకు పరీక్షలు చేసే అధునాతన వైద్య పరికరాలతో చికిత్స అందిస్తున్నాం. వీర్య కణాలను సన్నటి ప్లాస్టిక్ కెథీటరీ ద్వారా భార్యకు గర్భాశయంలో ప్రవేశపెట్టే ఐయుఐ టెక్నాలజీతో చికిత్స చేస్తాం. మరో ముఖ్యమైన ఐవిఎఫ్ చికిత్స భర్త నుంచి సేకరించిన మంచి చలనం కలిగిన వీర్య కణాలను భార్య నుంచి తీసిన అండాలను లేబోరేటరీలో ఫలదీకరణం చేసి మూడు, ఐదు రోజుల వరకు ఇంక్యుబేటరీలో వాటిని జాగ్రత్తగా పెంచి పిండాలను గర్భకోశయంలోకి మార్పిడి చేసే అత్యాధునిక వైద్య చికిత్స నిర్వహిస్తున్నాం. మా నుంచి క్రమపద్ధతిలో స్కానింగ్, చికిత్స చేయించుకున్న గర్భిణులు ఎలాంటి అవకతవకలూ లేకుండా కాన్పులు చేయడం ద్వారా ఆరోగ్యకర శిశువులు జన్మించడం జరుగుతుంది.

దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తం

భారతి ఆసుపత్రి వైద్యులు దివాకర్‌బాబు



ప్రజాశక్తి-బొబ్బిలి

దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని భారతి ఆసుపత్రి వైద్యులు అక్కేన దివాకర్‌బాబు తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఫాస్ట్‌ఫుడ్స్, ఫాస్ట్ డెలివరీస్, టి20 క్రికెట్ అంతా వేగంగా జరుగుతున్న ప్రస్తుత సమాజంలో మన శరీరతత్వం, ఆరోగ్యం, వచ్చే వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం. వచ్చిన వ్యాధి తక్కువ రోజులు ఉంటుందా? ఎక్కువ రోజులు ఉంటుందా? అనే ఆలోచన లేకుండా రకరకాల మందులు వాడటం, ఆన్‌లైన్‌లో, వాట్సాప్ ట్రీట్‌మెంట్, మెడికల్‌షాపులో మందులు కొనుగోలు చేయడం, ఇరుగుపొరుగు సలహాలు తీసుకోవడం, జబ్బు ముదిరినంత వరకు నిపుణుల సలహా లేకుండా కాలయాపన చేయడం వల్ల ఎక్కువ కాంప్లికేషన్స్ వస్తున్నాయి. దీని పర్యావసానంగా ఎక్కువ పరీక్షలు, ఎక్కువ మందులు వాడాల్సి వస్తుంది. దీర్ఘకాలిక వ్యాధులు.. అంటే షుగర్, బిపి, థైరాయిడ్, గుండె జబ్బులు, కీళ్లవాతం వంటి వాటికి ఒక ప్రణాళిక ప్రకారం చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం. తక్కువ వ్యవధి చికిత్స, ఫలితాలు దీర్ఘకాలిక వ్యాధులకు సరిపోవు. తాత్కాలిక ఉపశమనం ఉంటుంది. అంతే తప్ప దీర్ఘకాలంలో మనకు సరైన ఫలితాలు ఇవ్వవు.

ఒక పద్ధతి ప్రకారం నిపుణుల సలహాలతో షుగర్, బిపి, కొలస్ట్రాల్ అదుపులో ఉంచుకోవడం, తగినంత వ్యాయామం చేయడం, ఆహారంలో తక్కువ ఉప్పు, చక్కెర వాడకం, మితంగా పోషకాహారం తీసుకోవడం, ఊబకాయం రాకుండా చూసుకోవడం, దూమపానం, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆయుస్సు పెంచుకుని ఆరోగ్యంగా ఉండొచ్చు ఎక్కువ కాలం.

ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటుపరం చేయొద్దు

- **ఆస్పత్రి వైద్యులపై దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి**
- **సామాన్యులకు అందుబాటులో ఉండే వైద్య విద్యను తేవాలి**
- **ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి రవికుమార్**



ప్రజాశక్తి- కంటోన్మెంట్

రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేయకుండా ఆపాలని మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుఎస్ రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

రాష్ట్రంలో ఉన్న 11 ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోంది. దీనివల్ల పేద, సామాన్య ప్రజలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుంది. గత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 50 శాతం వైద్య సీట్లు ప్రైవేటుపరం చేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొత్తం సీట్లను ప్రైవేటుపరం చేస్తున్నారు. దీనివల్ల సామాన్య పేద మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్య ఆందకుండా పోతుంది. దేశంలోను, రాష్ట్రంలోను వైద్యులపైన, వైద్య సిబ్బందిపైన విపరీతమైన దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులు జరగకుండా ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తేవాలి. ప్రస్తుతమున్న చట్టాలను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వల్ల వైద్యులపైనా, సిబ్బందిపైనా దాడులు జరుగుతున్నాయి. విజయనగరం జిల్లాలో ఏడాది కాలంలో పదిమంది వైద్యులు, ఆసుపత్రులపై దాడులు జరిగాయి. ప్రతి డాక్టరు రోగుల ప్రాణాలను కాపాడడానికి తమ సర్వశక్తులనూ వినియోగిస్తారు. అటువంటి సమయాల్లో కొన్ని అనుకోని సంఘటనలు జరిగితే అలాంటి సమయాల్లో దాడులకు పాల్పడుతున్నారు. అది సరైనది కాదు. ఇటువంటి దాడులను నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పభుత్వం ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న పాఠ్యపుస్తకాల్లో రోగం రాకుండా ముందస్తు చర్యలపై ఒక సబ్జెక్టును పెట్టాలి. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలంటే వైద్యవృత్తి అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి.

జాగ్రత్తలతో కిడ్నీ వ్యాధులు దూరం

ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ జె.శ్రీకాంత్



ప్రజాశక్తి- విజయనగరం

కిడ్నీల్లో రాళ్లు అనేవి ఎక్కువగా వేసవిలో వేడి వల్ల నీరు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల రాళ్లు ఏర్పడాయని, అలాగే వంశపార పర్యం కూడా 25శాతం మందికి రాళ్లు ఏర్పడే అవకాశం ఉందని ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ జె.శ్రీకాంత్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

కిడ్నీల్లో రాళ్లు ఏర్పడిన వ్యక్తి పక్కటెముకల్లో నొప్పి ఏర్పడిన అనంతరం కడుపునొప్పి ఎక్కువగా వస్తుంది. వాంతులు, యూరిన్ మంట, యూరినల్‌లో రక్తం వంటి లక్షణాలు కలుగు తాయి. కిడ్నీలో రాయి తయారై యూరినల్‌లో రాయి ఇరుక్కు న్నప్పుడు ఈ వ్యాధి తీవ్రత పెరుగు తుంది. ఆ రాళ్లు చిన్నగా ఉన్న ప్పుడు నీళ్లు ఎక్కువగా తాగడం, మందులను వినియోగిస్తే నివారిం చుకోవచ్చే. అదే రాళ్లు పరిమాణం పెరిగి యూరినల్‌కు అడ్డుపడిన ప్పుడు, కిడ్నీ వాపుఉన్నప్పుడు, జ్వరం, వాంతులు వచ్చినప్పుడు రాళ్లు తీసుకొనే ప్రయత్నం చేయాలి. ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ఆపరేషన్ లేకుండా ట్యూబ్ ద్వారా ఆ రాళ్లను తొలగించే అవకాశాలు ఉన్నాయి. వీటిని రోగులు వినియోగించుకోవచ్చును.

ఇన్విజబుల్ ఎలైనర్స్‌తో అద్భుత ఫలితాలు



వి-డెంటల్‌లో అధునాతన దంత వైద్యం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రపంచ స్థాయి దంతవైద్య విధానాలతో ఉత్తరాంధ్రలో అత్యుత్తమ దంత వైద్యం అందిస్తుంది వి-డెంటల్ హాస్పిటల్స్. విశాఖ పట్టణం, విజయ నగరం, శ్రీకాకుళంలలో అనతి కాలంలోనే దంత వైద్య సేవలు విస్తరింపజేసి ప్రజల మన్ననలు అందుకుంది. ఇప్పుడు పంటి వరుసను అందంగా తీర్చిదిద్దడంలో అధునాతనమైన 'ఇన్విజబుల్ ఎలైనర్స్' చికిత్స ద్వారా అద్భుత ఫలితాలు అందిస్తున్నారు. ఇంత వరకు వాడుకలో ఉన్న క్లిప్ (బ్రాసేస్) విధానానికి అడ్వాన్స్‌గా ఎలైనర్స్ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. క్లిప్ ట్రీట్మెంట్‌లో ఉన్న ఇబ్బందులను ఎలైనర్స్ పద్ధతిలో అధిగమించవచ్చునని నిపుణులు వి-డెంటల్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ మాడుగుల జాన్ తెలిపారు. దంత వైద్య రంగంలో 14 సంవత్సరాల విశేష అనుభవం కలిగిన కాస్మోటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ జాన్ మాడుగుల, ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ అనిత మాడుగుల, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కె.ఎం.కె రమేష్ సారథ్యంలో నెలకొల్పిన వి-డెంటల్ సాధించిన విజయాలు అనేకమనే చెప్పాలి. పూర్తి స్థాయి ప్రత్యేక నైపుణ్యం కలిగిన 20 మంది వైద్య బృందం వివిధ రకాల దంత చికిత్సలు అందిస్తున్నారు. నోటిలో పూర్తిగా పళ్లు లేని వారికి సైతం బేసల్ ఇంప్లాంట్స్ ప్రక్రియ ద్వారా శాశ్వత దంతాల అమర్చడం వి- డెంటల్ ప్రత్యేకత. ఎత్తు పళ్ళు, వంకర పళ్ళు, పళ్ల మధ్య ఖాళీలు కలిగిన వారికి పంటి వరుసను ఆర్థో ట్రీట్మెంట్ ద్వారా అందంగా తీర్చి దిద్దడంలో నూరుశాతం ఫలితాలు సాధ్యమని హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ జాన్ తెలిపారు. చిగుళ్ల సమస్య తో బాధ పడే వారికి లేజర్ ఫ్లాప్ ట్రీట్మెంట్ ద్వారా పూర్తిగా నయం చేయవచ్చన్నారు. దంత సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించడంలో వి-డెంటల్ హాస్పిటల్ ప్రత్యేకతను సంతరించుకుంది. వి-డెంటల్ హాస్పిటల్ అందిస్తున్న విశేష సేవలను గుర్తించి జెసిఐ సంస్థ బెస్ట్ డెంటల్ హాస్పిటల్ పురస్కారాన్ని అందించింది..

పెరుగుతున్న మెడ, నడుము నొప్పి సమస్యలు

ఎముకల వైద్య నిపుణులు శంకర్రావు



ప్రజాశక్తి- కంటోన్మెంట్

చాలా మందిలో మెడ, కండరాలు, నడుము నొప్పిలు అధికంగా వస్తున్నాయని ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శంకర్ రావు తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

ఎక్కువ సేపు కూర్చోవడం, అలా ఒకే వైపు చూడడంతో మెడ, నడుమునొప్పి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ సమస్యలు ఎక్కువయ్యాయి. వీటిని తగ్గించుకోవడం కోసం ప్రతి రోజు వ్యాయామం చేయాలి. మెడ, నడుముకు సంబధిం చిన వ్యాయామాలు చేయాలి. మంచి ఆహారం తీసుకోవాలి. యోగ చేసిన మంచిదే. ముఖ్యంగా మెడ, నడుము నొప్పు లేని వారు నాలుగు గంటలు పాటు కూర్చోవచ్చు, గంటల తరబడి కూర్చొని పని చేసుకునే వారు మధ్యలో కాసేపు నిల్చొని కూర్చోవడం మంచిది. అవసరం ఉంటేనే ల్యాప్‌టాప్ లు, ఫోన్లు వాడితే మంచిది. అవసరం లేనివాళ్ళు వాటికి జోలికి పోకుండా ఉంటే ఇలాంటి సమస్యలు నుండి తప్పించుకోవచ్చు. పడుకునేటప్పుడు తలకింద చిన్న సైజ్ దిండు పెట్టుకోవడం ఉత్తమం.

నడకతో ఆరోగ్యానికి మేలు

అభయ ఆసుపత్రి వైద్యులు బూరి అనిల్‌కుమార్

ప్రజాశక్తి-బొబ్బిలి

నడకతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని అభయ ఆసుపత్రి వైద్యులు బూరి అనిల్ కుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లో..

ప్రతి రోజు క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలం.



ఉదయం పూట వాకింగ్ కు వెళ్లే 30నిమిషాలు వంంందం 500 ఎంఎల్ నీరు తాగి మెత్తటి బూట్లు ధరించి మట్టి రోడ్డు లేదా తారు రోడ్డులో, గ్రౌండ్‌లో 30 నిమిషాల నుంచి 45 నిమిషాల వరకు వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. సాయంత్రం సమయంలో వాకింగ్ చేసే వారు మధ్యాహ్నం భోజనం చేసిన 3గంటల తర్వాత వాకింగ్ చేస్తే ఉపయోగకరం. మనం రోజువారి చేసే పని, వాకింగ్ ఒకటి కాదు. పని చేసే సమయంలో మనస్సు, ధ్యాస పని మీద ఉంటుంది. కావున పని మన శరీర అవయవాలు మీద చూపించదు. వాకింగ్ చేయడం వలన మనస్సు, ధ్యాస శరీరంపై ఉంటుంది. కావున అన్ని అవయువాలపై ప్రభావం చూపి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఊబకాయం, బిఎంఐ 25 కంటే ఎక్కువ ఉన్నవారు 30 నుంచి 35 నిమిషాలు వరకు వీలైనంత వరకు స్పీడ్ గా నడవాలి.

బిఎంఐ 22 నుంచి 25 మధ్య ఉన్నవారు వారి శరీరతత్వం బట్టి బ్రిస్క్ వాకింగ్ లేదా ఫాస్ట్ వాకింగ్ 30 నుంచి 35 నిమిషాలు లేదంటే 5నిమిషాలు స్లో రన్నింగ్, 5 నిమిషాలు మీడియం వాకింగ్ 40 నిమిషాలు పాటు చేయాలి . బిఎంఐ 22 కంటే తక్కువ ఉన్నవారు మీడియం రన్నింగ్ తో పాటు దగ్గర అడుగులు వేసి స్లో రన్నింగ్ చేయాలి. వాకింగ్ అయిపోయిన తర్వాత 15 నిమిషాలు పాటు ప్రాణయామం లేదా స్ట్రెట్చింగ్ వ్యాయామం చేయాలి. వాకింగ్ పూర్తి చేసిన 20నిమిషాలు వరకు టీ, కాఫీ తాగరాదు. వాకింగ్ వలన ఎముకులు ధృఢమవ్వడంతో పాటు శరీరంలో అధికమైన కొవ్వు కరుగుతుంది. శరీరంలో ప్రతి అవయవం కదిలి ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. ఉదయం ఎండలో వాకింగ్ చేయడం వలన విటమిన్ డి3 లోపాన్ని నివారించవచ్చు.

ఆరోగ్య హక్కు చట్టం అవసరం



ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు

ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాలను అనుసరించి ఆరోగ్యానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు చేయాలి. ప్రజలందరికీ రక్షిత మంచినీరు, సమతుల ఆహారం అందించాలి. పటిష్ట ఆసుపత్రుల వ్యవస్థ, సరిపడ ఆరోగ్య, వైద్య సిబ్బంది, ఆసుపత్రులలో మౌలిక వసతులను కల్పించాలి. దీనితో పాటు ప్రజలందరికీ అందుబాటు ధరల్లో మందుల లభ్యత మొదలగునవన్నీ కల్పించడం ద్వారా రోగులకు ఉపశమనం కల్గించడం ప్రధానంగా ప్రభుత్వ బాధ్యత. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మందుల ధరలను నియంత్రించే బాధ్యత నుండి అడ్డగోలుగా తప్పుకున్నది. అసలే వైద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ధరల పాలసీ రోగులపై మరింత భారం అవుతుంది. ఇటీవల 800 రకాల మందుల ధరలు పెరగడం ఈ విధానంలో భాగమే. మందుల కంపెనీ యజమానులకు అనుకూల విధానాలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం వెనకాడటం లేదు. ఈ ధరాఘాతం బిపి, షుగర్ (పట్టిక) మాత్రమేగాక అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందుల పైనా పడి ప్రజలు భారం మోయలేకున్నారు.

ప్రభుత్వ విధానాలే అనుకుంటే, ఇటు మందుల కంపెనీల అనైతిక వ్యాపార విధానాలు బజారులో పెచ్చుమీరుతున్నాయి. వైద్యులను, ఫార్మసీల యజమానులను ప్రలోభపెట్టడం, విపరీతమైన కమీషన్లు-ప్రోత్సాహకాలు ఇవ్వడం, విదేశీ యానాలు, ఖరీదైన బహుమతులు ఇవ్వడం, బల్క్ పర్చేజ్ పేరుతో ఆసుపత్రులు, ఇన్‌స్టిట్యూషనల్ల పర్చేజ్ పేరిట డిపార్టుమెంటు సిబ్బందికి విపరీతమైన లాభాల మార్జిన్లు ఆఫర్ చేయడంతోపాటు, బల్ల కింద లంచాల వరకు అన్ని రకాల అనైతిక చర్యలకు మందుల కంపనీల యాజమాన్యాలు పాల్పడుతున్నాయి. ఈ ఫార్మా కంపెనీల మందుల అమ్మకాల విధానాలపై చట్టపరమైన నియంత్రణ వుండాలని చాలా సంవత్సరాలుగా జన్ స్వాస్థ్య అభియాన్ (జెఎస్ఎ), ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎమ్ఆర్ఎఐ), ఆల్ ఇండియా డ్రగ్ యాక్షన్ కమిటీ (ఎఐడిఎసి) వంటి స్వచ్ఛంద సంస్థలు పోరాడుతున్నాయి. యుసిపిఎంపి ముసాయిదాను చట్టం చేసి, పటిష్టంగా అమలు చేసి, చట్టాన్ని ఉల్లంఘించే యజమానులను శిక్షించాలని పోరాడుతున్నాయి. కానీ కార్పొరేట్ అనుకూల కేంద్ర ప్రభుత్వం కనీసం యుసిపిఎంపిపై పార్లమెంటులో చర్చించకుండా, దాన్ని చట్టంగా కాకుండా కేవలం కంటి తుడుపు చర్యగా స్వచ్ఛందంగానే ఈ కోడ్‌ని అమలు చేసుకోమని ఫార్మా కంపెనీలకు అప్పచెప్పింది. అంటే ఫార్మా కంపెనీ యజమానుల కమిటీ సభ్యులే మందుల మార్కెటింగ్‌లో కంపెనీలు ఈ కోడ్ అమలు చేసే రీతిని సమీక్షించి నివేదిక ఇస్తారన్నమాట. పర్యవసానంగా మందుల కంపెనీలు నిర్ద్వంద్వంగా రోగులను లూటీ చేసే పరిస్థితి ఇంకా పెరుగుతున్నది.

యుసిపిఎంపి చట్టాన్ని అమలు చేసి రోగులకు ఉపశమనం కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం చాలా ఉదాసీనంగా వ్యవహరించడానికి కారణం ఇటీవల ఎన్నికల బాండ్ల ద్వారా మందుల కంపెనీలు బిజెపికి కోట్ల రూపాయల నిధులు ఇవ్వడం. ఈ వ్యవహారం కంపెనీలకు ప్రభుత్వానికి మధ్య జరిగిన క్విడ్ ప్రో కో అని అర్థం చేసుకోవాలి. ఎస్‌బిఐ ఎలక్టోరల్ బాండ్ల డేటా గమనిస్తే మన దేశంలో కేవలం 9 బడా మందుల కంపెనీల యజమానులే అధికారంలో ఉన్న పార్టీకి రూ.400 కోట్ల ఎలక్టోరల్ బాండ్ల ద్వారా చందా ఇచ్చారు. ఇంకా చిన్నా పెద్దా కంపెనీలు కలసి ఎన్ని కోట్ల రూపాయల చందాలు ఇచ్చాయో తెలియాలి. ఇది పెద్ద స్కామ్. ఈ ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన కంపెనీల జాబితాలోని ఒక కంపెనీయే చిన్న పిల్లల ప్రాణాలతో చెలగాటమాడే నాసిరకం మందులు తయారు చేసినట్లు ఇటీవల చాలా వార్తలు పత్రికల్లో రావడం చూశాం. యుసిపిఎంపి చట్టం అమలు లేకపోవడంవల్లే బాబా రాందేవ్ లాంటి వ్యాపారవేత్తలు కేంద్ర ప్రభుత్వ వత్తాసుతో తమ పతంజలి ఉత్పత్తులపై తప్పుడు ప్రకటనలు, తప్పుడు మార్కెటింగ్ విధానాలతో ఇష్టారాజ్యంగా వ్యాపారాన్ని విస్తరించుకోవడం, దానిపై ఇటీవల సుప్రీం కోర్టు పతంజలి కంపెనీపై సీరియస్ అవ్వడం, పతంజలి కంపెనీ బహిరంగ క్షమాపణ చెప్పడం చూశాం.

గణాంకాల ప్రకారం మన దేశంలో 47 నుంచి 50 శాతం వైద్య ఖర్చును ప్రజలు తమ జేబుల నుండే పెట్టుకుంటున్నారు. అసలే ఒకపక్క ద్రవ్యోల్బణం పెరుగుతూ ప్రజల ఆదాయాలు తగ్గుతూ, పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్య, ఇతర రోజువారీ ఖర్చులు సగటు మనిషికి పెనుభారం అవుతుంటే ప్రభుత్వం... రోగాల చికిత్సలు, మందులు ఇతర వైద్య ఖర్చులపై విపరీతమై జిఎస్‌టి పన్ను భారం వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్య వేదిక (పిఎవి), జన్ స్వాస్థ్య అభియాన్ (జెఎస్ఎ) వంటి సంస్థలు ఆరోగ్య హక్కు చట్టంగా తేవాలని అప్పుడే ప్రజలందరికీ వైద్య ఖర్చుల భారం నుండి ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వాలను డిమాండు చేస్తున్నాయి. 2024 ఎన్నికల నేపథ్యంలో పిఎవి ఆరోగ్య హక్కు చట్టం ముసాయిదాని రూపొందించి అన్ని రాజకీయ పార్టీలకు పంపించింది. అలాగే తమ మ్యానిఫెస్టోలో ఆరోగ్య హక్కు చట్టంపై అన్ని పార్టీలు తమ విధానం తెలియజేయాలని డిమాండు చేసింది. కేవలం వామపక్ష పార్టీలు మినహా ఏ ఇతర రాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందించలేదు. పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ హెల్త్ ఇన్సూరెన్సే సంజీవని అని ప్రజల్ని మభ్యపెడుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు ప్రతీ ప్రభుత్వం జిడిపిలో 5 శాతాన్ని బడ్జెట్ ప్రజారోగ్యంపై కేటాయించాలి. మన దేశంలో ప్రభుత్వాలు 1.5 శాతం-1.8 శాతం మించి కేటాయింపులు చేయడం లేదు. ఇంత తక్కువ బడ్జెట్‌లో ప్రైమరీ ఆసుపత్రులను మొదలుకొని టెర్షియరీ కేర్ ఆసుపత్రుల వరకు ఉన్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించడం, మందులు/వైద్య పరికరాలు, ఆసుపత్రుల నిర్వహణ, అంబులెన్సుల నిర్వహణ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సరిపడ వైద్య ఆరోగ్య సిబ్బంది నియామకాలు, వారి జీతాలు ఎలా సాధ్యం? తక్కువ బడ్జెట్ కేటాయింపుల కారణంగానే ప్రైమరీ కేర్ మొత్తం నిర్వీర్యం అయ్యింది. ప్రభుత్వాలు ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత నుండి పూర్తిగా తప్పుకోడానికి ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి హెల్త్ ఇన్సూరెన్సు స్కీములను తీసుకొచ్చాయి. రోగుల భవిష్యత్ అంతా ఆసుపత్రుల యాజమాన్యాలు, ఇన్సూరెన్సు కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఇన్సూరెన్స్ విధానంలో ఆసుపత్రులు-ఇన్సూరెన్స్ కంపెనీలు కుమ్మక్కై మరింత దోపిడీ చేసే అవకాశం ఉంది. కాగ్ నివేదిక ప్రకారం 2022-23లో ఆయుష్మాన్ భారత్ స్కీము అమలులో 13,51,299 కేసులు నకిలీవని తేల్చింది. ఈ నివేదికపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించింది.

కరోనా కాలంలో సంభవించిన లక్షల మరణాలు, ఆసుపత్రులలో ఆక్సిజన్ మొదలుకొని పడకలు, మందులు, వైద్య పరికరాల అందుబాటు, సిబ్బంది కొరత ఇలా ప్రతీ అంశంలో మన ఇన్సూరెన్సు మోడల్ ఆరోగ్య వ్యవస్థలో లోపాలు బయటపడ్డాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సి వచ్చింది. అదే సమయంలో ధనికులకు మాత్రం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందాయి. పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. అందుకే మన దేశంలో ఆరోగ్య హక్కు చట్టంతో మాత్రమే ప్రజల ఆర్థిక అసమానతలతో తావు లేకుండా అందరికి సామానంగా వైద్యం అందించడం సాధ్యమవుతుంది. ఆరోగ్య హక్కు చట్టం లేనంతకాలం ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జవాబుదారీగా ఉండజాలదు.

ఇప్పటికైనా ఆరోగ్యం అన్న సబ్జెక్టు ఒక రాజకీయ అంశంగా ప్రజలు గుర్తించి పాలకులను ఆరోగ్య హక్కు చట్టం తెచ్చి అమలు చేసే రీతిలో ఒత్తిడి చేయాలి. అలాగే ప్రభుత్వాలు కూడా చికిత్స కంటే వ్యాధి నివారణే ప్రధానం అనే విధానం రూపొందించాలి. ఆరోగ్య శ్రీ / ఆయుష్మాన్ భారత్ కేటాయింపులను ఆరోగ్య బడ్జెట్‌గా కాకుండా హెల్త్ ఇన్సూరెన్స్ ఖర్చుగా పేర్కొనాలి. ఆరోగ్య బడ్జెట్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాలు అమలు చేస్తూ, కావాలంటే వేరేగా హెల్త్ ఇన్సురెన్సుపై నిధులు ఖర్చు చేయాలి. ప్రజారోగ్య వేదిక రూపొందించిన ఆరోగ్య హక్కు ముసాయిదాను ఎన్నికలైన వెంటనే కొత్త ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టి, చట్ట రూపకల్పన చేసి తక్షణం అమలు చేయాలి. ◆

పెరిగిన కొన్ని మందుల ధరలు

మందు పేరు	ప్యాకింగు		పాత ధర రూ.	కొత్త ధర రూ.
బిపి	టెల్మి సార్టన్ 40 ఎంజి	10 మాత్రలు	265	290
షుగర్	గ్లిమిప్రైడ్ 1 ఎంజి	30 మాత్రలు	109.87	125.32
అల్సర్	రాబిప్రజోల్ డోంపెరిడాన్	10 మాత్రలు	298	328
కోనాలో వాడిన మందు	ఐవర్మెక్టిన్ 12 ఎంజి	10 మాత్రలు	195	350
నెలసరి మందు	నార్ ఎథిస్టిరాన్	10 మాత్రలు	58	98

పెరుగుతున్న మధుమేహ రోగులు

గుండె, ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ ఎన్‌కె రావు

ప్రజాశక్తి - బొబ్బిలి



కరోనా అనంతరం మధుమేహ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, కోవిడ్ సోకిన వారికి షుగర్ స్థాయిలు బాగా పెరుగుతున్నాయని లాలిత్య ఆస్పత్రి గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎన్‌కె రావు తెలిపారు. డాక్టర్స్ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

కోవిడ్ నిర్ధారణ అయ్యాక స్వల్పలక్షణాలే ఉన్నా, లక్షణాలేవీ లేకపోయినా వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో వచ్చిన సందేశాలను అనుసరించి మొదటి రోజు నుంచే స్టెరాయిడ్స్ వాడడం వల్ల మధుమేహం రోగుల్లో రక్తంలో గ్లూకోజ్ శాతం విపరీతంగా పెరుగుతోంది. ఇదివరకు మధుమేహం లేని వారికి కూడా కొత్తగా కనిపిస్తోంది. కోవిడ్ బారినపడి ఊపిరితిత్తులు ప్రభావమైన వారిలో సహజ లక్షణమైన సాగే గుణం కొంత మేర తగ్గుతుంది. దూమపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి. ఇమ్యూనిటీ పెంచుకోవడం కోసం మాంసాహారాన్ని అతిగా తీసుకోవడం మంచిది కాదు. దీంతోపాటు ఆకుకూరలు, కాయకూరలు, పాలు, పండ్లు అన్నీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. మాంసాహారం మాత్రమే అధికంగా తీసుకోవడం వల్ల రక్తంలో కొవ్వుశాతం పెరిగి గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారులు తిరుమల ప్రసాద్, శ్రీకాంత్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

డయేరియా, మలేరియా వ్యాధులు చాలావరకు తగ్గుముకం పట్టాయని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎన్.తిరుమల ప్రసాద్, పి.శ్రీకాంత్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడారు. మరిన్ని వివరాలు వారి మాటల్లోనే...

ఒకప్పుడు సీజన్ ప్రారంభంలోనే డయేరియా, మలేరియా రోగాలతో ప్రజలు ఎక్కువమంది హాస్పటల్ బారిన పడేవారు. ఇప్పుడు ప్రజలకు అవగాహన పెంచడంతో ముందస్తుగా రోగాల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు, స్ప్రేయింగ్ చేయించడం, ఏడు సచివాలయాలు పరిధిలో మెడికల్ అవేర్నెస్ క్యాంపులు నిర్వహించడం జరిగింది. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండడంతో ఆ మేరకు డెంగీ, మలేరియా వంటి రోగాలు ప్రభావం లేదు. ఈ ఏడాది ప్రత్యేకంగా స్టాప్ డయరియా కార్యక్రమాల ద్వారా ప్రత్యేకించి డయేరియాకు గురయ్యే గ్రామాలను గుర్తించి ఆ గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్తలని తీసుకున్నాం. రానున్న రోజుల్లో వర్షాలు పడ్డా, ప్రజలు వేడినీళ్ల తాగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరికైనా జ్వరం వచ్చి నాలుగు రోజుల్లో తగ్గుముఖం కానట్లయితే వెంటనే హాస్పిటల్‌కు వచ్చి వైద్యులను సంప్రదించాలి. బందలుప్పి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్లు సిబ్బంది అందుబాటులో ఉండడం జరుగుతుందన్నారు.







గుండె పోటుకు సిహెచ్‌సిలో ఖరీదైన ఇంజక్షన్

నెల్లిమర్ల సిహెచ్‌సి వైద్యాధికారి ఎం.తిరుమలదేవి

ప్రజాశక్తి - నెల్లిమర్ల




స్థానిక సామాజిక ఆసుపత్రిలో గుండెపోటుతో వచ్చిన వారికి అత్యవసర పరిస్థితుల్లో ఖరీదైన ఇంజక్షన్ ఇచ్చి ప్రాణం నిలబెడుతున్నామని ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి, గైనిక్ వైద్యులు ఎం. తిరుమల దేవి తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. మరిన్ని విషయాలు ఆమె మాటల్లోనే..

నేను ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టాను. ముఖ్యంగా సామాజిక ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటుతో 6 గంటల లోపుగా వచ్చిన వారికి దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఖరీదైన స్టేమీ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయం లేకుండా కాపాడుతున్నాం. గుండె పోటుతో వచ్చిన వారిని ఇసిజి ద్వారా వ్యాధి నిర్ధారణ జరిపి ఇంజక్షన్ ఇచ్చి ప్రాణం నిలబెడుతున్నాం. పాము, విషపురిత కీటకాల కాటుకు కూడా ప్రాణం నిలబెట్టే ఇంజక్షన్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. గైనిక్ వైద్యురాలిగా ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సాధారణ ప్రసావాలు జరుపుతున్నాం, జిల్లాలో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువ ఉండగా సిహెచ్‌సిలో మాత్రం సాధారణ ప్రసావాలు జరుగుతున్నట్లు గుర్తించాం. కాగా గర్భిణులు హై రిస్క్, రక్త హీనత, ఎదురు కాళ్ళతో బిడ్డలు ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించడంతో బాటు సాధారణ ప్రసావాలు జరుపుతున్నాం. ఈ ప్రాంత ప్రజలు సిహెచ్‌సి సేవలు వినియోగించుకోవాలని డాక్టర్స్ డే సందర్భంగా ఆమె కోరారు.

సిహెచ్‌సిలో మెరుగైన ప్రసూతి సేవలు

సామాజిక ఆసుపత్రిలో మెరుగైన ప్రసూతి సేవలు అందిస్తున్నాం. సిహెచ్‌సిలో గదులు ఇబ్బంది ఉన్నప్పటికి గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం ఆస్పుపత్రి ద్వారా నెలకు 20 ప్రసవాలు జరుగుతున్నాయి. మరో 10 ప్రసవాలు జరుపడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రాంతంలో ప్రయివేట్ ఆసుపత్రుల హవా ఎక్కువగా ఉంది. వాటిని అధిగమిస్తూ మెరుగైన ప్రసూతి సేవలు అందిస్తాం. సిహెచ్‌సికి రోజు 200 మంది రోగులు జ్వరాలు, వాంతులు, షుగర్, దంత సంబంధిత వ్యాధులతో వస్తున్నారు. వారికి 5గురు వైద్య సేవలు అందిస్తున్నారు ని ఆమె చెప్పారు.













అత్యాధునిక వైద్యానికి చిరునామా కాష్వీ

అందుబాటులో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
ఆసుపత్రి ఎమ్‌డి ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

ఇప్పుడు మన విజయనగరంలో అత్యాధునికి వైద్యానికి చిరునామాగా కాష్వీ హస్పటిల్ అందుబాటులో ఉంది. ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయిలో కాష్వీ హస్పటల్‌లో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మోపాడ (ఆర్థో), డాక్టర్ చంద్రకళ కర్రోతు (హెచ్‌హెచ్‌ఎస్‌ఎం)లు నిత్యం అందుబాటులో ఉంటూ ఎటువంటి సమస్యలైనా ఆధునిక వైద్య పరికరాలతో, అనుభవం గల వైద్య నిపుణులతో 24 గంటలు పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. అన్ని వైద్య పరీక్షలూ ఒకే చోట అందించే ఆసుపత్రి కాష్వీ.. డాక్టర్స్ డే సందర్భంగా ఆస్పత్రి ఎమ్‌డి ప్రవీణ్‌కుమార్ ఆస్పత్రి గురంచి మరిన్ని విషయాలు పంచుకున్నారు. ఆయన మాటల్లోనే.. జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో ఉన్న కాష్వీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు ఉన్నాయి. కాష్వీ ఆస్పత్రిలో అన్ని రకాల అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. టెస్లా ఎంఆర్‌ఐ



స్కాన్, 64 స్లైస్ సిటీ స్కాన్, క్యాథ్ ల్యాబ్, డిజిటల్ ఎక్స్రే, అల్ట్రా సౌండ్ స్కాన్, 2డి ఎక్కో, టిఎంటి, డయాలసిస్ వంటి అడ్వాన్సుడ్ మెడికల్ ఎక్విప్మెంట్ అన్ని రకాల వైద్య సేవలూ ఒకే చోట ఉన్నాయి. గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, పక్షవాతం, పాముకాటు, శ్వాస కోస వ్యాధులు, విష పదార్థాలు సేవించిన వారికి మా ఆసుపత్రిలో 24 గంటలు వైద్య సదుపాయం ఉంది. కాష్వీ ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ డిపార్ట్మెంట్ అందుబాటులో ఉంది. హైసియు, క్యాజువాలటీ, 24/7 పార్మసీ, లాబోరేటరీ, అంబులెన్స్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. 24 గంటల ఎంఆర్‌ఐ సిటి స్కాన్, ఐసియు, క్యాజువాలిటీ, ఫార్మసీ, లేబరేటరీ, అంబులెన్స్ సదుపాయం ఉన్నాయి. మా ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు కార్డియాలజీ, ఆంకాలజీ, న్యూరాలజీ జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, పర్మనాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్ సర్జరీ, జనరల్ సర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, గైనకాలజీ, ఇఎన్‌టీ, డెర్మటాలజీ, డెంటల్ అండ్ ఫిజియోథెరపే తదితర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. నిష్ణాతులైన వైద్యులు రోగులకు అత్యంత మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

చిన్న పిల్లలు, నవజాతి శిశువుల వైద్యనిపుణులు డాక్టర్ దువ్వాన పవన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



తల్లిదండ్రులు చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని చిన్న పిల్లలు, నవజాతి శిశువుల వైద్యనిపుణులు డాక్టర్ దువ్వాన పవన్ కుమార్ అన్నారు. 'డాక్టర్స్‌డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

రాయగడ రోడ్డు హీరో హెూండా షోరూం పక్కన అమృత చిన్నపిల్లల క్లినిక్ ద్వారా వైద్య సేవలు చేసేందుకు అన్నివేళలా అందుబాటులో ఉంటున్నాం. ఈ ఏడాది సీజన్ ప్రారంభమైంది. పెద్దవారి కంటే చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి వ్యాధులు పిల్లలకు సోకే ప్రమాదం ఉంటుంది. కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. పాఠశాలలకు పంపించిన పిల్లలను పరిశుభ్రంగా ఉంచుతూ పరిసరాల పరిశుభ్రతపై వారిని నిరంతరం పర్యవేక్షణ చేయడం అతి ముఖ్యం. పిల్లల్లో జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఏమైనా ఉంటే అశ్రద్ధ వహించకుండా వైద్యులను సంప్రదించాలి. నవజాతి శిశువుల్లో పచ్చకామర్లు సాధారణంగా రావచ్చు. వాటిపై అప్రమత్తతో డాక్టర్లను సంప్రదించాలి. తమ క్లినిక్ లో అందుకు తగ్గ ఫోటో థెరపీ అత్యాధునిక పరికరాలతో అందుబాటులో ఉన్నాయి.

ప్రతి గ్రామాన్నీ పరిశీలిస్తున్నాం

గంట్యాడ పిహెచ్‌సి వైద్యాధికారి హేమలత

ప్రజాశక్తి- గంట్యాడ



గంట్యాడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉన్న అన్ని గ్రామాలనూ పరిశీలించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటు న్నామని గంట్యాడ పిహెచ్‌సి వైద్యాధికారి బొల్లేపల్లి హేమలత న్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రభుత్వ ఆదేశాలు మేరకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాలలోని పారిశుధ్యం, పరిశుభ్రత గురించి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో చర్చిస్తూ పలు సూచనలు చేస్తున్నాం. పరిశుభ్రమైన తాగునీరు అందించాలని చెప్పాం. స్థానిక ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు గ్రామాలలో పరిశీలన చేసి రోగులను గుర్తించి సరైన వైద్యం అందించాలని చెప్పాం. 104 వాహనం ద్వారా గ్రామాల్లో సేవలందిస్తున్నాం. నేను ఆసుపత్రిలో ఓపి చూసి మరో వైద్యునితో కలిసి సేవలందిస్తున్నాం. ఆసుపత్రి పరిధిలో ఉన్న కొర్లాం, నరవ గ్రామాలలో హెచ్‌డబ్ల్యుసిలకు కేటాయించాం. వీటికి కావలసిన అన్ని సహకారాలనూ అందిస్తున్నాం. ప్రతి మంగళవారం ఏఎన్‌ఎంలకు ఆశాలకు సమావేశం ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులను, గ్రామాల్లో ఉన్న పారిశుధ్యం, తాగునీరు గురించి అడిగి తెలుసుకుంటున్నాం. గర్భిణులకు తనిఖీలు చేసి విజయనగరం ఘోషాసుపత్రికి పంపించడానికి కృషి చేస్తున్నాం.

చిగుళ్లవ్యాధి ఉంటే గుండె జబ్బులొచ్చే అవకాశాలు

ఆర్థోపెడిక్స్ డాక్టర్ రామకార్తీక్

ప్రజాశక్తి-శృంగవరపుకోట



చిగుళ్ల వ్యాధి ఉన్నవారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయని ప్రముఖ ఆర్థోపెడిక్స్ డాక్టర్ రామ కార్తీక్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

చిగుళ్ల వ్యాధి.. ఇది చిగుళ్లకు వచ్చే ఇన్ఫెక్షన్. ఇది చిగుళ్ల వాపు, దంతాల చుట్టూ ఉన్న ఎముక క్షీణతకు దారితీస్తుంది. గుండెకు రక్త సరఫరాలో అడ్డంకులు ఏర్పడటం వల్ల గుండెపోటు సంభవిస్తుంది. చిగుళ్ల వ్యాధిలో ఉండే బాక్టీరియా రక్తప్రవాహంలోకి ప్రవేశించి, గుండెకు సంబంధించిన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ముఖ్యంగా, చిగుళ్లవాపు గుండె జబ్బులకు సంబంధించిన ఇన్ఫ్లమేషన్‌కు కారణమవుతుంది. ఇది రక్తనాళాల సమస్యలకు దారితీస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, చిగుళ్ల వ్యాధి ఉన్నవారికి గుండెపోటు వచ్చే ప్రమాదం 2 నుండి 3 రెట్లు ఎక్కువని తేలింది. మీ నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ద్వారా మీ గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచవచ్చు. మీరు దంతవైద్యులను క్రమం తప్పకుండా సందర్శించడం ద్వారా చిగుళ్ల వ్యాధిని నివారించవచ్చు. లేదా చికిత్స పొందవచ్చు. మీరు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి మీ దంతవైద్యుడు, వైద్యుడితో సంప్రదించడం ముఖ్యం.

మాత, శిశు మరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రేగిడి



మాత, శిశు మరణాల రేటును తగ్గించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రీనా చౌదరి అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే..

ఏ స్త్రీ జన్మనిస్తూ మరణించకూడదు. ఏ శిశువూ మరణించడానికే జన్మించకూడదు. గర్భం దాల్చిన తర్వాత కనీసం నాలుగు సార్లు వైద్యులతో సంరక్షణ పరీక్షలు చేయించుకోవాలి. ఏడు నవజాత సంరక్షణ శిశు సంరక్షణ సేవలను ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు అందిస్తారు.. గర్భిణి, శిశువుల సేవలను మాత, శిశు సంరక్షణ కార్డులో నమోదు చేస్తారు. మాత, శిశు ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం కిల్కారి వాయిస్ కాల్స్ (01244588000) ద్వారా గర్భిణి నాలుగో నెల నుండి ప్రసవానంతరం బిడ్డకు ఏడాది వయసు వచ్చేంతవరకు తగు సూచనలు పొందవచ్చు. మొదటి త్రైమాసికంలో ఆల్బెండజోల్ 400 మి.గ్రా, తర్వాత రోజుకు ఒక ఐరన్ మాత్ర చొప్పున 6 నెలల వరకు 180 ఐరన్ మాత్రలు, రోజుకు రెండు కాల్షియం మాత్రలు చొప్పున ఆరు నెలల వరకు 360 మాత్రలు వేసుకోవాలి. గర్భ నిర్ధారణ అయిన వెంటనే టిడి ఇంజక్షన్ తీసుకోవాలి. నెల వ్యవధిలో రెండో టిడి ఇంజక్షన్ వేసుకోవాలి. గర్భిణీ కాలంలో తప్పనిసరిగా హెచ్‌బి రక్త పరీక్ష, మూత్రం (ఆల్బుమిన్, షుగర్) పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. కుటుంబ నియంత్రణ కోసం శాశ్వత పద్ధతులు మహిళలకు ట్యూబెక్టమి, పురుషులకు వాసక్టమి ద్వారా ఆపరేషన్లు ఉచితంగా చేయించుకోవచ్చు.

అతిసారతో అప్రమత్తం

రేగిడి పిహెచ్‌సి వైద్యాధికారి షాహిని రాఘవ్

ప్రజాశక్తి-రేగిడి



అతిసారతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఒమ్మి షాహిని రాఘవ్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

బిడ్డకు ఒక రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు పలుచగా విరోచనాలు అయితే దాన్ని అతిసార అంటారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బు నీటితో కడుక్కోవాలి. రోటా వైరస్, తట్టుకు టీకాలు వేయించాలి. తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సురక్షితమైన తాగునీటిని ఉపయోగించాలి. సబ్బు, నీటితో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తల్లిపాలు తాగకపోవడం, తరచుగా పలుచని మలవిసర్జన కారణంగా తీవ్రమైన నిర్జలీకరణ, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ప్రమాదకరంగా భావించాలి. ఒఆర్ఎస్ ప్యాకెట్లు వాడాలి. శరీరం కోల్పోయిన నీటిని, ఖనిజాలను ఒఆర్ఎస్ ద్రావణం తిరిగి నింపుతుంది. మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు జింక్ అరమాత్ర (పది మిల్లి గ్రాములు), ఆరు నెలల కంటే ఎక్కువ వయసు వారికి ఒక మాత్ర (20 మిల్లీ గ్రాములు) పరిశుభ్రమైన నీళ్లలో లేదా తల్లిపాలలో కలిపి ఇవ్వాలి. జింక్ వల్ల జబ్బు పడకుండా కాపాడుతుంది. త్వరితంగా నయం చేస్తుంది. నీళ్ల విరోచనాలు తగ్గిపోయిన తర్వాత టానిక్‌లా పనిచేస్తుంది. జింక్ మాత్రలు 14 రోజుల వరకు వాడాలి. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం ద్వారా పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, బాల్యంలో వచ్చే వ్యాధులు, వైకల్యాలతో కూడిన అభివృద్ధి ఆలస్యాలు, పాఠశాల విద్యార్థులకు తనిఖీలు నిర్వహిస్తారు. లోపాలు ఉన్న విద్యార్థులను జిల్లా భవిత కేంద్రానికి పంపించి తగు చికిత్స అందిస్తారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

రేగిడి పిహెచ్‌సి వైద్యాధికారి అసిరినాయుడు

ప్రజాశక్తి-రేగిడి



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చందక అసిరినాయుడు కోరారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

వాతావరణ మార్పుల కారణంగా అనేక రకాల సీజనల్ వ్యాధులు పెరుగుతుంటాయి. అందువల్ల, మీరు మీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలి. చిన్నారుల పట్ల మరిన్ని జాగ్రత్తలు పాటించాలి. పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగాలి. కొబ్బరి బోండాలు ఇంటి పరిసరాల నుంచి దూరంగా పారవేయాలి. నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వాడిక నీటి వద్ద ఆకుపచ్చగా లేకుండా చూడండి. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. వేడి ఆహారాన్ని తీసుకోవాలి. వర్షంలో తడవడం వల్ల జలుబు, దగ్గు వచ్చే అవకాశం ఉంది. తడిసిన వెంటనే బట్టలు తీసి, ఎండిన వస్త్రాలు వాడాలి శరీరంలో జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టరును సంప్రదించాలి.

జ్వరానికి యాంటీబయోటిక్స్ అవసరం లేదు

చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎన్.స్నేహ

పజాశక్తి-శృంగవరపుకోట



జ్వరానికి యాంటీబయోటిక్స్ అవసరం లేదని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.స్నేహ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు వివరాలు ఆమె మాటల్లోనే...

చిన్న జ్వరం (100.4-102.2 °F) లేదా వైరల్ బ్రాంకైటిస్‌కి యాంటీబయోటిక్ ఇవ్వకూడదని ఐసిఎంఆర్ సూచించింది. వైరస్ వల్ల కలిగే జ్వరాలకు వ్యాధి నిరోధక మందులు ఇవ్వొద్దని భారత పిల్లల వైద్య సమాఖ్య చెబుతోంది. ముక్కు జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్ ఉంటే యాంటీబయోటిక్స్ ఇవ్వకండి. డాక్టర్ సూచన లేకుండా సొంత వైద్యం చేయొద్దు. మార్కెట్‌లో డాక్టర్ సూచన లేకుండా యాంటీబయోటిక్స్ తీసుకుంటే ఎఎంఆర్ (మైక్రోబియల్ రెసిస్టెన్స్) పెరుగుతుంది. పిల్లలకు స్వల్ప జలుబు, దగ్గు ఉన్నప్పుడు 3-7 రోజులు విశ్రాంతి, పోషకాహారం సరిపోతుంది. ఈ సమయంలో యాంటీబయోటిక్ లేకుండా ఇంటి తయారీలో చికిత్స అవసరమవుతుంది. ఒకసారి ఇచ్చిన యాంటీబయోటిక్ కోర్స్ పూర్తి చేయకపోతే రోగాలు మళ్లీ రావచ్చు, బాక్టీరియా దానిపై రెసిస్టెంట్ అవుతుంది. జాగ్రత్తగా అంచనా చేసి యాంటీబయోటిక్స్ ఇవ్వాలి. డాక్టర్ లేకుండా పైగా ఒటిసి (ఓవర్ ది కౌంటర్) మందులకు ఆధారపడొద్దు. ఇమ్యూనిటీ మద్దతు ఇవ్వడానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలి.

అందుబాటులోకి రోబోటిక్ వైద్యసేవలు




- తిరుమల- మెడికవర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ ప్రమాణాలు
- అందుబాటులో హెల్త్ చెకప్ ప్యాకేజీలు
- ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల ప్రసాద్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

శాస్త్ర సాంకేతిక వ్యవస్థ అభివృద్ధి చెందిన క్రమంలో రోబోటిక్ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని తిరుమల -మెడికవర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ తిరుమల ప్రసాద్ తెలిపారు. తమ ఆసుపత్రిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందజేస్తున్నామని తెలిపారు. ఎంఆర్ఐ సహా అనేక వైద్యఆరోగ్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వైద్యారోగ్య రంగంలో మెడికవర్ కొత్తకొత్త ఆవిష్కరణలను సృష్టిస్తోందని అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

వైద్యరంగం రోజురోజుకూ పురోగమిస్తోంది. అందులో భాగంగా రోబోటిక్ వైద్యసేవలు నూతనంగా ఆవిష్కరించాయి. ఇందులో ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో ప్రతికూల పరిస్థితులు కూడా ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా రోగులకు తక్కువ నొప్పితో వైద్యం చేయవచ్చు. వైద్యుల శ్రమ, అలసట కూడా తగ్గుతుంది. టెలీ సర్జరీలకు కూడా అవకాశం ఉంటుంది. సాధారణ సర్జరీలతో పోలిస్తే లోపాలు తక్కువగా ఉంటాయనడంతో సందేహం లేదు. కానీ, రోబోటిక్ సాంకేతిక వ్యవస్థ చాలా ఖరీదైనది. అలాగే లోపాలు జరిగినప్పుడు మానవాళికి జరిగే హాని కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ రకమైన నష్టాన్ని అత్యుత్తమ వైద్య అధిగమించేందుకు ఇంకా పరిశోధనలు నిపుణులు, జరుగుతున్నాయి. ఇటువంటి రోబోటిక్ వైద్యసేవలు కూడా తమ వద్ద అందుబాటులో ఉన్నాయని చెప్పడానికి గర్వపడుతున్నాం.



తిరుమల–మెడికవర్ ఆసుపత్రిలో అన్ని రకాల అనారోగ్య సమస్యలకు వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ సర్జరీ, లేప్రోస్కోపిక్, గైనకాలజీ, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ మెడిసిన్, యూరాలజీ, పల్మనాలజీ, ఇఎన్‌టి, రేడియాలజీ, రుమటాలజీ, కీళ్ళు, ఎముకలు జాయింట్ రీప్లేస్‌మెంట్, ఇంటర్నల్ మెడిసిన్ వంటి ఎన్నో సదుపాయాలు స్థానికంగా ఉన్నాయి. ఇందుకనుగుణంగానే మౌలిక వసతులను సమ కూర్చాం. రోగనిర్ధారణ చేసే డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఇటీవలే ఎంఆర్ఐ స్కాన్ కూడా అందుబాటులోకి వచ్చింది. అత్యాధునిక పద్ధతిలో ఔట్, ఇన్ పేషెంట్ల కు సేవలు అందు తున్నా యి. ఆసుపత్రిలో 250 జనరల్ బెడ్స్, 35 ఐసియు బెడ్స్, 32 స్లైస్ సీటీ స్కాన్ బెడ్స్, స్టేట్ ఆఫ్ ద హార్ట్ ప్లాట్ పేనల్ కేథ్ ల్యాబ్, కార్డియాక్ అండ్ పెరిఫెరల్ యాంజియో గ్రామ్ అండ్ యాంజియో ప్లాస్టీ, ఫైవర్ వరల్డ్ క్లాస్ ఆపరేషన్ థియేటర్స్, సిఆర్ఆర్‌టి సి–ఆర్మస్, ఎండో స్కోపీ అండ్ ఇఆర్‌సిపి యూనిట్, త్రీ ఎకో మిషన్స్, బ్రాంకో స్కోపీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ హెచ్‌డి ల్యాపోస్కోపీ అండ్ హిస్టిరో స్కోపీ యూనిట్, అంబులెన్స్, మొబైల్ ఐసియు, ఆర్ఐఆర్ఎస్ వంటి మౌలిక సవతులు ఉన్నాయి. అధునాత మెడికల్ లేబొరేటరీలు ఉన్నాయి. అత్యాధునిక శిక్షణ పొందిన వైద్యారోగ్య సిబ్బంది ఉన్నారు. కేన్సర్ ఇనిస్టిట్యూట్, సంతాన సాఫల్య కేంద్రాలు, మల్టీస్పెషాలిటీ, చిన్నపిల్లల విభాగ సేవలు ప్రత్యేకంగా ఉన్నాయి.

ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్యాన్ని పరీక్షించుకుని అప్రమత్తంగా మెలిగేందుకు తమ సంస్థ ఎన్నో హెల్త్‌కేర్ చెకప్ ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటిలో టోటల్ బాడీ చెకప్, ఎక్స్‌క్లూజివ్ హెల్త్ చెకప్, మాస్టర్స్ హెల్త్‌చెకప్, హార్ట్ హెల్త్ చెకప్, కంప్లీట్ గ్యాస్ట్రో ప్యాకేజీ, బేసిక్ హెల్త్ చెకప్ ప్యాకేజీ, వెల్ ఉమెన్ చెకప్ వంటి ప్యాకేజీలు ఉన్నాయి. వీటితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ సంస్థల కార్డులపైనా సేవలందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్, ఇఎస్ఐ తదితరాలపై రోజూ సేవలు అందిస్తున్నాం.

అల్లోపతికి ధీటుగా ఆయుర్వేదిక్ వైద్యం

జిల్లా ఆయుర్వేదిక్ విభాగం సీనియర్ మెడికల్ అధికారి ఎం.ఆనంద రావు



ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం జిల్లాలో అల్లోపతికి ధీటుగా ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తున్నట్లు జిల్లా ఆయుర్వేదిక్ ఆస్పత్రి సీనియర్ మెడికల్ అధికారి ఎం.ఆనంద రావు తెలిపారు. జిల్లాలో ఆయుర్వేదిక్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలోని విజయనగరం, భీమాలి, వేపాడ, ఎస్.కోట, జామి ,మెంటాడ, రామభద్రపురం, బాడంగి, పెరుమాలి ,సంకిలి, భూసాయి వలస, కోమటిపల్లి, భోగాపురం, బొబ్బిలి, కెల్ల, తదితర ఆయుర్వేద ఆసుపత్రుల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతిరోజూ ఆసుపత్రిలో 50 మంది వరకు రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఆయుర్వేద విభాగంలో అన్ని రకాల వ్యాధులకూ వైద్యం అందిస్తున్నాం. ఆయుర్వేదం వైద్యంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలందరూ వినియోగించుకోవాలి.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యత
- అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు
- రాకోడు పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్‌బి అఖిల



ప్రజాశక్తి - కంటోన్మెంట్

గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.బి.అఖిల తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

విజయనగరం మండలం రాకోడు పిహెచ్‌సి పరిధిలో 13 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. జొన్నవలస, దుప్పాడ, సారిక, రాకోడు, కోరుకొండ, కోరుకొండ పాలెం, ద్వారపూడి, చెల్లూరు, బియ్యాలపేట, నారాయణ పురం, మలిచర్ల, గొల్లలపేట, గుంకలాం, గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా 37 గ్రామాల పరిధిలో 43వేల జనాభాకు వైద్యం అందిస్తున్నాం. గ్రామాల్లో వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం వ్యక్తిగత పరిశుభ్రత, పెళ్లయిన తర్వాత బిడ్డకు మూడు నాలుగేళ్ల గ్యాప్ వంటివాటిపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులను గుర్తించి పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నాం. ప్రతి గ్రామంలో నార్మల్ డెలివరీ కోసం బాలబాలికలు నవజాత శిశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీక రించాం. అంటువ్యాధులు, మలేరియా, టైఫాయిడ్, లెప్రసీ, క్షయ వంటివి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సంచార చికిత్స 104 ద్వారా వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. గర్భిణీలు బిపి, సుగర్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా సైకియాట్రిక్, డెంటల్ వైద్య సేవలను ప్రత్యేక రోజుల్లో అందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత వైద్యసేవలను పొందాలి.

హోమియోపతి వైద్యంపై ప్రజలకు అవగాహన

రాకోడు హోమియోపతి వైద్యులు పి.సత్యేంద్ర కుమార్



ప్రజాశక్తి- కంటోన్మెంట్

హోమియోపతి వైద్యంపై ప్రజల్లో పూర్తి అవగాహ న కల్పిస్తున్నామని రాకోడు పిహెచ్‌సి హోమియో పతి వైద్యాధికారి పి.సత్యేంద్ర కుమార్ తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

విజయనగరం మండల పరిధిలో ఉన్న ప్రజలకు హోమియోపతి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. కీళ్ల అరుగుదల, చర్మ సంబంధ వ్యాధులు ,జీర్ణకోశ వ్యాధులు, అలర్జీ, చిన్నపిల్లల్లో తరచూగా వచ్చే జ్వరం, దగ్గు, కఫం వంటి రోగాలకు హోమియోపతి వైద్యసేవలు అందిస్తున్నాం. ఆసుపత్రి ద్వారా 50 మంది వరకు ప్రతిరోజు రోగులకు అన్ని రకాల జబ్బులకు వైద్యం అందిస్తున్నాం. చికెన్ పాక్స్ వంటి అంటు రోగాలకు కూడా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

గ్రామీణ వైద్యుల సంక్షేమానికి కృషి


ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ సంఘం జోనల్ కార్యదర్శి గెద్ద చిరంజీవరావు



ప్రజాశక్తి–విజయగనరం

గ్రామీణ వైద్యుల (ఆర్ఎంపి) సంక్షేమానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యదర్శి గెద్ద చిరంజీవరావు తెలిపారు. డాక్టర్స్‌డేను పురస్కరించుకొని ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే.

వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి జరిగినా మారుమూల పట్టణ గ్రామీణ గిరిజన వాడల్లో ప్రజలకు ఏ అనారోగ్య సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది ఆగ్రామంలో ఉండే గ్రామీణ వైద్యుడు ఆర్ఎంపి మాత్రమే. ప్రజలతో మమేకమై ప్రజా ఆరోగ్య వైద్య వ్యవస్థలో కీలక పాత్ర వహించేది గ్రామీణ వైద్యులే. దేశ భద్రతలో సైనికుడు పాత్ర ఎలాంటిదో గ్రామీణ ప్రాంతంలో ఆర్ఎంపి పాత్ర అంతే. కరోనా లాంటి విపత్తులో కూడా ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ ప్రభుత్వానికి కూడా సహకరించాం. జిల్లాలో ఒక సంఘముగా ఏర్పడి ప్రతి సభ్యుడికి అండగా వుంటూ సామాజిక కార్యక్రమాల్లో, రక్తదాన శిబిరాలలో, అవగాహన ర్యాలీల్లో పాల్గొని ప్రభుత్వ అధికారులతో ప్రజా ప్రతినిధులతో స్వచ్ఛంద సంస్థలతో చాలా దగ్గరయ్యాం. 2009లో జీవో నెంబర్ 429 ద్వారా మహారాజా ఆసుపత్రిలో కమ్యూనిటీ పారా మెడికల్ శిక్షణ పొందాం. ప్రభుత్వాలు జీవోలు విడుదల చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాలవల్ల అవి ఆగిపోయాయి. యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్‌కు అన్ని జిల్లాల్లోవినతులు ఇచ్చాం. సానుకూలంగా స్పందించి ప్రభుత్వం రాగానే అందరికీ న్యాయం చేస్తామని మాట ఇచ్చారు. ఆ మాటను నెరవేర్చాలి. రాష్ట్రంలో అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య నాయకులు రాజా సిద్ధార్థ .జి ఎస్ ప్రసాద్ .కంబాల బాబురావు జంగం జోషి నాయకత్వంలో పనిచేస్తూ ప్రభుత్వ గుర్తింపు కోసం ప్రయత్నం చేస్తున్నాం. గ్రామీణ వైద్యులకు కమ్యూనిటీ పారా మెడిక్ హెల్త్ ప్రొవైడర్ గా శిక్షణ ఇచ్చి ప్రజా ఆరోగ్య కార్యక్రమాలలో ఉపయోగించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.



వైరల్ జ్వరాల పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-విజయనగరం

వాతావరణ పరిస్థితులు మారుతున్న పరిస్థితుల్లో వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అబ్దుల్ రెహమాన్ మెమోరియల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎమ్‌డి అజాజ్ ఉర్ రెహమాన్ తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వైరల్ జ్వరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వారం రోజుల నుంచి వాతావరణ పరిస్థితి ఒక్క సారిగా మారిపోయింది, ఇలా ఒక సీజన్ నుంచి మరో సీజన్లోకి ప్రవేశించే ముందు రకరకాల ఇన్ఫెక్షన్లు దాడిచేస్తాయి, చల్లగా ఉన్న వాతావరణం వైరస్‌ల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. అందువల్ల ఈ సీజన్లో వైరల్ ఇన్ఫెక్షన్లు, జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ప్రతి పదిమందిలో ముగ్గురు-నలుగురికి జలుబు, ఇద్దరు-ముగ్గురికి జ్వరంతో కూడిన వైరల్ ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.

వైరల్ ఫీవర్ అంటే ఏమిటి ?

వైరల్ జ్వరాలు అకస్మాత్తుగా సోకుతాయి. ఒక్కోసారి జ్వరం 102 డిగ్రీల కంటే ఎక్కువగా ఉండొచ్చు. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పుల మధ్య రోగి నిస్సత్తువగా మారిపోతారు. కొందరిలో ఒంటిమీద దద్దుర్లు, వాంతులు, అరుదుగా విరేచనాలూ కనిపిస్తాయి. కొందరిలో జలుబు వంటి లక్షణాలేవీ లేకుండానే జ్వరాలు వేధిస్తుంటాయి. సాధారణంగా వీటిని 'విష జ్వరాలు" అంటారు. వాటంతట అవే తగ్గిపోయే సాధారణ వైరల్ జ్వరాలూ కూడా కొన్నిఉంటాయి. అలాగే తప్పనిసరిగా చికిత్స తీసుకోవల్సిన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటివి వైరల్ ఫీవర్ కిందికే వస్తాయి.

వైరల్ ఫివర్స్ ఎందుకు వస్తాయి ?

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాసనాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు కూడా వైరల్ ఫీపర్స్ విజృంభిస్తాయి. చల్లదనం తీవ్రత పెరగడం వల్ల రక్తనాళాలు కుంచించుకు పోతాయి . దీంతో రక్తసరఫరా నెమ్మదిస్తుంది. రక్తంలో ఉండే తెల్లరక్త కణాల సంఖ్యక్రమంగా తగ్గడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఈ ఇన్ఫెక్షన్లు, జ్వరాలు, పిల్లల్లో చాలా త్వరగా వ్యాప్తి చెందుతాయి. జన సముదాయం ఎక్కువగా ఉన్నచోట వైరస్ ఎక్కువగా లను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే జ్వరాలు పిల్లల్లో త్వరగా వ్యాప్తి చెందుతాయి.

వైరల్ ఫీవర్ లక్షణాలు ఏమిటి ?

వైరల్ ఫీవర్ సోకితే ఒళ్లు నొప్పులు, జ్వరం, నీరసం, నిస్సత్తువ, స్కిన్ రాషెస్, వికారం, తలనొప్పి, ఆకలి మందగించడం, గొంతునొప్పి, ముక్కు కారడం, దగ్గు, గొంతు నొప్పి, ఉదరంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాల తీవ్రత తగ్గడానికి వ్యాధి నుంచి ఉపశమనం కలగడానికి మాత్రమే మందులు ఉపకరిస్తాయి.



డాక్టర్ రెహమాన్

వైరల్ ఫీవర్ లక్షణాలలో ఈ రెండు మూడు కనిపించిన రోగికి ఎక్కువగా నీళ్లు తాగించాలి. దీని వల్లన శరీరం డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది. తరువాత రోగికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి. తేలికపాటి ఆహారం ఇవ్వాలి. ముఖ్యంగా రోగి ఆందోళనకు గురికాకుండా చూసుకోవాలి. పెద్దవారికైతే గంజి తాగించడం మంచి పద్ధతి. ఇది వైరస్‌ను ఎక్కువ కాలం బతకనివ్వదు.

నిర్ధారణ ఎలా?


జ్వరం విపరీతంగా ఉండి, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే అన్ని రకాల రక్త పరీక్షలూ చేస్తారు. డెంగీ అనుమానం ఉంటే 'ఎన్ఎస్1 యాంటీజెన్' పరీక్ష చేస్తారు. విపరీతమైన చలి, జ్వరం ఉంటే మలేరియాగా అనుమానించి 'ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్ట్ చేస్తారు. వీటిద్వారా వైరల్ ఫీవరా? ఇతర వ్యాధులా తెలుస్తుంది.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?


వైరల్ ఫీవర్ ఇన్ఫెక్షన్ చాలా త్వరగా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి ఆహారం షేర్ చేసుకోవద్దు. సాధారణ వైరల్ ఫీవర్ తొమ్మిది రోజులు ప్రభావం చూపిస్తుంది. చల్లదనానికి సూక్ష్మక్రిముల బారినుండి కాపాడే శరీరభాగాలు శక్తి హీనంగా మారిపోయి సూక్ష్మక్రిములు సులువుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి చల్లదనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. నూనె పదార్థాలు తక్కువగా ఇవ్వాలి. సాధారణంగా ఈ కాలంలో (మిగతా..17లో)














సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

డాక్టర్ సిహెచ్ సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం



సీజనల్ వ్యాధులు, జ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు, సివిల్ సర్జన్ డాక్టర్ చుక్క సూర్యనారాయణ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రస్తుతం వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు వేడి నీటిని తాగితే మంచిది. బయట ఆహారం తినకూడదు. ఇంట్లో వేడిగా వండుకొని తినడం చాలా మంచిది. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకూడదు. బ్లీచింగ్ జల్లుకోవడం, శుభ్రంగా ఉంచుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే మలేరియా, డెంగ్యూ, డయేరియా లాంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. మరోవైపు కోవిడ్ అనంతరం కూడా పలు సమస్యలు వస్తున్నాయి. వాటి పట్ల జాగ్రత్తలు అవసరం. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి తగు వైద్యం చేయించుకోవాలి.

వైరల్ జ్వరాల పట్ల జాగ్రత్తలు అవసరం

(16వ పేజీ తరువాయి)

కనిపించే 'గొంతు నొప్పి'కి 90శాతం వైరస్‌లే కారణం, కాబట్టి దానిని తగ్గించేందుకు గోరు వెచ్చటి నీటిలో ఉప్పు వేసుకొని తరుచుగా పుక్కిట పట్టటం, లేదా మార్కెట్లో లభించే నోటిని గార్గిల్ లోషన్ తో పుక్కిలించు చేయడం మంచిది.

రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం ఎలా ?

వ్యాధి నిరోధక శక్తిని మెరుగ్గా ఉంచడంలో మనం తీసుకునే ఆహారం కూడా ఎంతో ఉపయోగపడుతుంది. పిల్లలకు జంక్ ఫుడ్ వంటివి అలవాటు చేయొద్దు. స్నాక్స్ బదులుగా పండ్లు,పొడి పండ్లు తినిపిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. నిమ్మ, నారింజ వంటి సిట్రస్ జాతి ఫలాలను ఇవ్వడం వల్ల ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు.

తల్లీ పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తప్పనిసరి

చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వాసుదేవరావు, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీ రేఖ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

గర్భం దాల్చిన స్త్రీని, తల్లి గర్భం నుండి బయటపడ్డ శిశువు ప్రాణాలకు రక్షణ కల్పించడంలో అతి ముఖ్యంగా వైద్య సేవలు అందిస్తున్నామని చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ జిజవాసుదేవరావు, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీ రేఖలు అన్నారు. 'డాక్టర్స్ డే' సందర్భంగా వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే...



డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ శ్రీ రేఖ

సౌందర్య థియేటర్ ముందు రోడ్లో అత్యాధునిక వైద్య పరికరాలతో సొంత భవనంలో గర్భిణులకు, చిన్నపిల్లలకు ప్రశాంత వాతావరణంలో వైద్య సేవలందిస్తున్నాం. జిల్లాలో మలేరియా ఎనిమిక్ జోన్‌గా గుర్తింపుబడ్డ ప్రాంతం కావున డయేరియా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి రోగాలతో చేరిన గర్భిణులు, చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో ఆపరేషన్ తప్పనిసరి తప్ప సాధారణ డెలివరీలు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇందులో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా వైద్య సేవలందిస్తున్నందుకు వారు ఎంతో ఆనందం పడుతున్నారన్నారు. మన్యం ప్రాంతంలో పుట్టుకతో రక్తహీనత ఉండడం వల్ల సికిల్ సెలేమియా కేసులు ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఈ రోగులను హైరిస్క్ కేసులుగా గుర్తించి సకాలంలో హాస్పిటల్‌కి చేర్చి వైద్యం అందిస్తున్నాం. రక్తహీనత ఉన్న గర్భిణుల్లో ఎనిమీయా తగ్గితే వైద్యుల పర్యవేక్షణలో జాగ్రత్త తీసుకోవాలి. సాధారణంగా చిన్నపిల్లలకు పచ్చకామర్ల సమస్యలను నియంత్రించేందుకు ఫోటో థెరఫీ అందించాల్సిన అవసరం ఉంది. నవజాతి శిశువులకు నిర్దిష్ట ఉష్ణోగ్రతలు అవసరం ఉంటుంది. ఇందుకోసం వార్మర్ సదుపాయం అందుబాటులో ఉంచాం. పచ్చకామర్లు వచ్చే గర్భిణులకు బ్రీడింగ్ కంట్రోల్ కాదు కాబట్టి డైట్ (న్యూట్రిషన్) పౌష్టికాహారం అందించాలి. స్త్రీలలో కొన్నింటికి క్యాన్సర్లకు చికిత్స చేసే అవకాశం లేకపోయినప్పటికీ గర్భాశయం ద్వారా క్యాన్సర్లకు ఇంజక్షన్ ఉంది. అలాంట రోగులు తమ హాస్పిటల్‌లో వైద్యం పొందొచ్చు. గర్భం దాల్చిన స్త్రీలు నెలకొకసారి తనిఖీలు చేయించుకోవాలి. డెలివరీలు అవసరమైన ఆధునిక పరికరాలతో ఆపరేషన్ థియేటర్లు సాయి సహస్ర హాస్పిటల్‌లో ఏర్పాటు చేసుకోవడం వల్ల డెలివరీలు సునాయసంగా చేయగలుగుతున్నాం.

సన్ షైన్ ఆర్థోఫిట్‌లో కీ హోల్ సర్జరీ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్



స్థానిక బైపాస్ రోడ్ లో సన్ షైన్ ఆర్థోఫిట్ హాస్పటల్‌లో అత్యాధునిక కీ హోల్ సర్జరీ చేయబడుతుందని సన్‌షైన్ ఆర్థోపిట్ అధినేత డాక్టర్ జి.శ్రావణ్ కుమార్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఈ టెక్నాలజీతో ఇప్పటికే సుమారు పదిమంది వరకు శరీర భాగాలను కట్ చేయకుండా కీ హెూల్ సర్జన్ ద్వారా మోకాలు, కండరాలు, భుజం కండరాలు చిట్లిన రోగులకు ఆర్థోస్కోప్ ద్వారా ఆపరేషన్ చేసి విజయవంతమయ్యాంజ ఈ ఆపరేషన్ ద్వారా రోగులకు కుట్లు గానీ, గాయం గానీ కనబడకుండా ఉండడమే కాకుండా సైడ్ ఎఫెక్ట్స్, ఇన్ఫెక్షన్స్ ఉండవు. సన్ షైన్ ఆర్థో, చిల్డ్రన్స్ కేర్ హాస్పిటల్ ప్రారంభం నుంచి ఒక్కో ఏడాది అత్యాధునిక పరికరాలతో కార్పొరేట్ వైద్యమందించేందుకు కృషి చేస్తున్నాం. కొన్ని క్రిటికల్ ఆపరేషన్లకు విశాఖపట్నం వెళ్లేందుకు రోగులు పడ్డ ఇబ్బందులే కాకుండా వ్యయ ప్రయాసాలకు గురు కాకుండా వైద్య సేవలను అందిస్తున్నాం. సిఆర్ఎం ఎక్స్ రే ద్వారా ఎముకులు, కీళ్ల రోగులకు వైద్య సేవలందిస్తున్నాం. కీళ్ల నొప్పులకు, ఎముకులు విరిగినప్పుడు సాధారణంగా పెయిన్‌బామ్‌లు రాయడం, ఆయిల్‌తో రుద్దడం, నాటుకట్లు వల్ల రోగులకు నష్టాలే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. 40 ఏళ్లు దాటిన మహిళల్లో నడుంనొప్పి సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కుటుంబ నియంత్రణలో భాగంగా గర్భసంచి తొలగించిన తర్వాత స్త్రీల్లో హార్మోన్ సమతుల్యం, కాల్షియం శాతం తగ్గడం వల్ల ప్రభావం చూపుతోంది.

ఈ సమస్య నుంచి బయటపడేందుకు రోజూ ఖర్జూరం, ఆకుకూరలు తీసుకొని ప్రతిరోజు ఉదయాన్నే సూర్యోదయం సమయంలో ఎండలో ఉండడం ద్వారా శరీరానికి కావాల్సిన విటమిన్ డి లభిస్తుంది. సాధారణంగా 40 ఏళ్లు పైబడిన వారిలో తరచూ మోకాళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. సాధారణంగా వచ్చే కీలు నొప్పులకు మందులు, దానికి తగ్గ ఆహారం తీసుకోవడం ద్వారా తగ్గించుకోవచ్చు. ఇక రెండో రకం దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు వీటి వైద్య పరీక్షలు నిర్వహించి కారణం విశ్లేషించి మందులు వాడడంతో వీటిని నియంత్రించగలం. ప్రమాదంలో ఎముకలు విరిగి గాయాలైనప్పుడు గాయం తగిలిన భాగాన్ని ఎత్తులో పెట్టి ఐసు ముక్కలు పెట్టి రక్తస్రావం జరగకుండా గుడ్డతో గట్టిగా కట్టి వైద్యుని వద్దకు వీలైనంత త్వరగా తీసుకుని పోయి చికిత్స అందేలా చూడాలి.

తల్లిపాలతో శిశువులకు వ్యాధి నిరోధక శక్తి

స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ స్నిగ్ధ



పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలే అతి ముఖ్యమని సన్ షైన్ ఆర్తో చిల్డ్రన్స్ కేర్ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ స్నిగ్ధ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

సీజన్ ప్రారంభం నుంచే చిన్న పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అప్పుడే జన్మించిన పిల్లలకు వచ్చే పచ్చకామర్లను నియంత్రిచ్చేందుకు ఫోటోథెరిఫి ట్రీట్మెంట్ అందించాల్సి ఉంటుంది. నవజాతి శిశువులకు నిర్దిష్టమైన ఉష్ణోగ్రతల అవసరం ఉంటుంది. అందుకు వార్మర్ సదుపాయం తమ సన్ షైన్ ఆర్తో చిల్డ్రన్స్ కేర్ హాస్పటల్ ద్వారా అందుబాటులో ఉంచి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం.

పేద, మధ్యతరగతి ప్రజలకు 'శ్రీవిజయ'లో వైద్యసేవలు

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండతో పాటు చుట్టుపక్క పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతోనే స్థానికంగా శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ దూబ పద్మావతి తెలిపారు. 'డాక్టర్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

ఇతర ప్రాంతాలకు వెళ్ళకుండా ఈ ప్రాంతంలోనే అన్ని రకాల వైద్య సేవలు అందించడానికి తమ ఎంతగానో కృషి చేస్తున్నాం. ముఖ్యంగా గర్భిణీలు గతంలో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు చేస్తున్నాం. దీని సంబంధించిన రోగులు వినియోగించుకోవాలని కోరారు.



కేన్సర్ ప్రభావిత వ్యాధులపై స్త్రీలు అప్రమత్తం

స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణ చంద్రిక

ప్రజాశక్తి- పార్వతీపురం

సాధారణంగా స్త్రీలు కేన్సర్ ప్రభావితం చేసే వ్యాధులతో సతమతమవుతున్నారని పద్మావతి క్లినిక్ స్త్రీ, వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణ చంద్రిక తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే..

గర్భాశయ ముఖద్వాపు కేన్సర్ వంటి ప్రధాన కేన్సర్ రోగాలు బారిన స్త్రీలు గురవుతున్నారు. కావున తప్పనిసరిగా వారు అప్రమత్తమై వైద్యుల సంప్రదింపులతో ఈ కేన్సర్ నిర్ధారణకు pap smeer పరీక్ష తప్పనిసరి చేయించుకోవాలి. ఇది హెచ్‌పివి హ్యూమన్ పార్టీలోమా వైరస్ వల్ల సోకుతుంది.



దీని బారిన పడకుండా ముందుగానే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాక్సినేషన్ టీకాను 9 నుంచి 26 ఏళ్ల లోపు మహిళలు వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖద్వారా కేన్సర్ ప్రమాదం నుండి బయటపడే అవకాశం ఉంటుంది. చిన్నపిల్లల డాక్టర్ భోగి. ఈశ్వర హాస్పిటల్ కి ఎదురుగా పద్మావతి క్లినిక్ ద్వారా వైద్య సేవలకు ఆర్థోపెట్ డాక్టర్ రాజేంద్ర కుమార్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణ ఎల్లవేళలు అందుబాటులో ఉంటాం. ప్రజల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి. ఎటువంటి రోగాలైనా అశ్రద్ధ చేయకుండా సకాలంలో డాక్టర్లను సంప్రదించి వైద్య చికిత్స పొందాలి.

కీళ్లు, ఎముకల ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి

కీళ్లు, ఎముకుల వైద్య నిపుణులు చుక్క. హేమప్రసాద్

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్



కీళ్లు, ఎముకల ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి అని కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ చుక్క హేమప్రసాద్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

అధిక బరువు వల్ల మోకాలు, నడుము (వెన్నుముక) ఎముకులు కీళ్ల త్వరగా అరుగుదలకు గురవుతాయని, అందుచేత ప్రతి ఒక్కరూ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. చిన్న చిన్న నొప్పులకు కూడా నొప్పి మాత్రలు, స్టెరాయిడ్స్ దీర్ఘకాలంగా వాడడం గ్యాస్టిక్, కిడ్నీ డామేజ్ సమస్యలతో పాటు ఎముకలు సాంద్రత తగ్గి ఫ్రాక్చర్ అయ్యే సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదం కూడా దారితీస్తుందన్నారు. పేదరికంలో ఉన్న రోగులు ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. మానవత దృక్పథంతో ఆర్థిక భారం లేని వారికి వైద్యమందించే ఆలోచనగా తమ బాధ్యతగా భావిస్తాను.

చిన్నపిల్లల వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

చిన్నపిల్లల వైద్యనిపులు జె.రవీంద్ర కుమార్

ప్రజాశక్తి - పాలకొండ

చిన్నపిల్లల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లల వైద్యనిపులు జె.రవీంద్ర కుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....



చిన్నపిల్లలకు చేదు మందులు అలవాటు చేయొద్దు. అనారోగ్యంగా ఉంటే దగ్గరలో ఉన్న ఆసుపత్రిని సంప్రదించాలి. ముఖ్యంగా వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలి.

క్షయను సరైన సమయంలో గుర్తిస్తే నివారించవచ్చు

పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చలమయ్య

ప్రజాశక్తి-రేగిడి

క్షయ వ్యాధిని సరైన సమయంలో గుర్తిస్తే నివారించం సాధ్యమేనని బూరాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.చలమయ్య అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...



అప్రమత్తంతోనే క్షయ వ్యాధి తగ్గుదల ఉంటుంది. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలు. సరైన సమయంలో గుర్తిస్తే తప్పకుండా క్షయను నివారించవచ్చు. టిబి నిర్ధారణ జరిగితే చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెలా రూ.500 రూపాయలు పోషణ భత్యం లభిస్తుంది. టిబి నిర్ధారణ పరీక్షలు, మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా లభిస్తాయి. కఫం పరీక్ష ద్వారా క్షయ వ్యాధిని నిర్ధారించుకోవచ్చు. టిబి సూక్ష్మ క్రిములు రోగి తగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, తుంపర్ల ద్వారా గాలిలోకి వ్యాపిస్తాయి. ఆరోగ్యవంతులు ఈ తుంపర్లను పీల్చినప్పుడు వారికి కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. టిబి మందులు 6 నుండి 8 నెలల పాటు వైద్యుల పర్యవేక్షణలో వినియోగించాలి.

సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- మందుల కొరత లేదు
- జ్వరాలు తగ్గుముఖం
- సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని 11 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో టైఫాయిడ్, మలేరియా వైరల్ జ్వరాలు సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నామని సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయ పార్వతి వెల్లడించారు. డాక్టర్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

సీతంపేట మండలంలో కుసిమి, మర్రిపాడు, ధోనుబాయి, భామిని మండలంలో బాలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాదికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కొక్క పిహెచ్‌సిలో ఇద్దరు డాక్టర్లకు ఒక్కరే ఉన్నారు. త్వరలోనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటాం. గిరిజన గ్రామాల్లో జ్వరాలు రాకుండా ఇప్పటికే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి సూచనల మేరకు జూన్ 16 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. తద్వారా డయేరియా రాకుండా ఉంటుంది. మలేరియా పాజిటివ్ కేసు నమోదైతే ఇంటింటా సర్వే చేపట్టి అందరికీ స్క్రీనింగ్ రక్తపరీక్షలు చేసి వైద్య శిబిరాలు నిర్వహి స్తున్నాం. ఇప్పటికే ఆశా వర్కర్లు, సిహెచ్ డబ్ల్యూఒ లు, ఎఎన్ఎం లను క్షేత్ర స్థాయిలో



అప్రమత్తం చేశాం. జ్వరాలు వచ్చిన వెంటనే ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం కోసం సీతంపేట ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నాం. ప్రస్తుతం జ్వరాలు తగ్గుముఖం పట్టాయి.

సికిల్ సెల్ ఎనీమియా అవగాహనా కార్యక్రమం జూన్ 16 నుంచి జూలై 3 వరకు జరుగుతుంది. ఎనీమియా సమస్య ఉన్న గర్భిణీలకు యాక్షన్ కమిటీలు ప్రతినెలా మొదటి బుధవారం సచివాలయంలో అవగాహన కల్పిస్తారు. దీంతో పాటు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందించి మిగతా వారికి ఏరియా ఆసుపత్రిలో చేర్పిస్తున్నాం. మలేరియా నివారణకు డ్రోన్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేయించి దోమలు వృద్ధి చెందకుండా ఆపరేషన్ చేస్తున్నాం. హైరిస్క్ గిరిజన గ్రామాల్లో ఐఆర్ఎస్ మలాథియన్ స్ప్రేయింగ్ నిర్వహించాం. గ్రామాల్లో జ్వరాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేశాం. ఇప్పటికీ అన్ని ఆసుపత్రిలో మందులు కొరత లేకుండా చూశాం. ప్రసవాలు ఆసుపత్రిలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. కుటుంబ నియంత్రణ లక్ష్యాల పూర్తికి కృషి చేస్తున్నాం. వైద్యాధికారులు, సిబ్బంది ద్వారా జ్వరాలపై ఎప్పటికప్పుడు ఆరా తీసి నివేదికలు తీసుకుంటూన్నాం. ఆస్పత్రిలో రోగులకు ఎటువంటి సమస్యలు లేకుండా ఆసుపత్రి ప్రాంగణంలో కూడా ఆహ్లాదకరంగా ఉండేటట్లు చర్యలు తీసుకున్నమని చెప్పారు.

కలుషిత నీటి వల్లే వ్యాధులు

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శశిభూషణరావు

ప్రజాశక్తి-బొబ్బిలి



నీరు కలుషితం వలనే ఎక్కువ వ్యాధులు వస్తాయని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

నీటి కలుషితం వలన డయేరియా, చీము, రక్తంతో విరేచనాలు, కలర, పచ్చకామెర్లు, టైఫాయిడ్, పేరా టైఫాయిడ్, వంటి వ్యాధులు వస్తాయి. దోమలు, ఈగలు వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, మెదడువాపువ్యాధి వస్తాయి. వేడి చేసి చల్లార్చిన నీరు తాగితే వ్యాధులను నివారించవచ్చు. ఏ జ్వరం వచ్చినా ప్లేటేలెట్లు తగ్గుతాయి. దోమలు, ఈగలు నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. సంపూర్ణ ఆరోగ్యం కోసం వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి. నీరు ఎక్కువ నిల్వ లేకుండా చూస్తే దోమలను నివారించవచ్చు. గోతులు, టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, కూలర్స్, ఫ్రిడ్జి వెనుక భాగం, నీటి కుండిలు, వాటర్ ట్యాంకులలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వారానికి ఒక్కరోజు డ్రైడే తప్పనిసరిగా పాటించాలి. ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించాలి.

వ్యాయామంతోనే ఆరోగ్యం

ప్రముఖ వైద్యునిపుణులు తులసీదాస్

ప్రజాశక్తి - పాలకొండ



వ్యాయామంతోనే ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ వైద్యులు కె.తులసీదాస్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. మరిన్ని వివరాలు వారి మాటల్లోనే..

ప్రస్తుత రోజుల్లో ఆహారంలో, వాతావరణంలో మార్పులు రావడం వల్ల నూటికి 60మంది అనారోగ్యానికి గురవుతున్నారు. కావున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలి. నిత్యం వ్యాయామం లేదా నడక అవసరం. మనం తీసుకొనే ఆహారంలో కూడా జాగ్రత్తలు పాటించాలి. చక్కెర ఉండే పదార్థాలకు దూరంగా ఉండాలి. ఫాస్ట్‌ఫుడ్ కూడా తీసుకోకూడదు. తాజా ఆకు, కూరగాయలు తీసుకోవాలి. అదే విధంగా పోషక విలువలున్న పళ్లు తీసుకుంటే మంచిది.

న్యూమోనియా పట్ల అప్రమత్తం

ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్

ప్రజాశక్తి-గజపతినగరం



న్యూమోనియా పట్ల అప్రమతంగా ఉండాలని ఊపిరి తిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ తొత్తడి రాజశేఖర్ అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లో..

న్యుమోనియా (నిమ్ము) అనేది ఒకవైపు లేదా రెండు వైపులా ఊపిరితిత్తుల యొక్క ఆల్వియోలై(గాలితిత్తు)లలో చీము చేరడం వలన వస్తుంది. దీనివలన శ్వాసను ఇబ్బందికి గురిచేస్తుంది. ఆక్సిజన్ తీసుకోవడాన్ని పరిమితం చేస్తుంది. దీనికి ముఖ్య కారణాలు మనం పీల్చే గాలిలో కనిపించని బ్యాక్టీరియా, వైరస్‌లు, సూక్ష్మ జీవుల వల్ల వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 15శాతం పిల్లల్లో మరణానికి అత్యంత సాధారణ కారణం న్యుమోనియా. ముఖ్యంగా చిన్నపిల్లలు, 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు తగు జాగ్రత్తలు పాటించాలి. సిఒపిడి, గుండె వ్యాధులు, ధూమపానం అలవాటు ఉన్నవారు, షుగర్ పేషెంట్లలో ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. దీని ముఖ్య లక్షణాలు జ్వరం, ఛాతి నొప్పి, దగ్గు ఎక్కువగా ఉండటం. ఇది ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. దీన్ని తొందరగా గుర్తించి వైద్యం చేయించుకోవాలి. న్యూమోనియా రాకుండా టీకాలు, వ్యాక్సిన్ వేయించుకోవాలి.

సెల్‌ఫోన్లతో పిల్లల్లో అనారోగ్యం

చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బిడికె సోమశేఖర్

ప్రజాశక్తి-శృంగవరపుకోట



త్వరలో ప్రారంభం కానున్న ఎస్‌కెఎంఎల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్

సెల్ ఫోన్ల వలన పిల్లలు అనారోగ్యం పాలవుతారని ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బిడికె సోమశేఖర్ తెలిపారు. డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..



పూర్వం చిన్నపిల్లలు మారం చేస్తే పెద్దవాళ్లు కథలు చెప్పో లేక జోల పాటలు పాడో సముదాయించే వారు. మరికొందరు వాళ్లకి ఇష్టమైన తిండి పదార్థం పెట్టో లేక ఆట బొమ్మలు కొనిపెట్టి సంతోషించేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. బిజీ లైఫ్‌లో భాగంగా తల్లిదండ్రులు పిల్లలను పట్టించుకోవడం మానేశారు. పిల్లలు మారం చేస్తే వారి చేతిలో ఒక మొబైల్ పెట్టి ఖుషీ చేయటం ఇప్పుడు ట్రెండ్ గా మారింది. పిల్లలను సంతోష్ పెట్టడానికి స్మార్ట్ ఫోన్లో ఓ గేమ్ ను డౌన్లోడ్ చేసి ఆ గేమును ఎలా ఆడాలో ఒడులో కూర్చుండబెట్టుకుని ట్రైనింగ్ ఇస్తున్నారు. ఫలితంగా నట్టింట్లో చలాకి గా తిరగాల్సిన పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. దీంతో పిల్లలకు అదో వ్యసనంగా మారి తల్లిదండ్రులు లేకపోయినా పరవాలేదు కానీ స్మార్ట్ ఫోన్ లేకపోతే ఉండలేకపోతున్నారు. అయితే ఈ స్మార్ట్ ఫోన్లు వ్యసనంగా మారి పిల్లలు తిండి తిప్పలూ మర్చిపోతున్నారు. సెల్ ఫోన్ రిసీవ్ చేసుకునే సిగ్నల్ కారణంగా రేడియో వేవ్స్ వలన చిన్నపిల్లల మెదడుకు సంబంధించిన వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా పిల్లలకు ఎక్కువగా దృష్టిలోపం రావడం, పిల్లల్లో చురుకుదనం తగ్గిపోవడం, ఒబిసిటీ రావడం, అతి సున్నితమైన కణాలు దెబ్బతినటం, పిల్లల ప్రవర్తనలో తేడా రావటం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి. అందువల్ల పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వడం మాని బొమ్మలు అలవాటు చేయాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల వద్ద ఎక్కువగా ఫోన్లు చూడకుండా ఉండాలి, పిల్లలను ప్లేగ్రౌండ్‌కు తీసుకువెళ్లాలి. తల్లిదండ్రులు పిల్లలతో ఆడాలి.మూడేళ్ల కన్నా తక్కువ వయసున్న పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని కోరుతున్నాం.


'అభినవ్'లో మెరుగైన సేవలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట పట్టణంలో సాయిబాబా గుడి ఎదురుగా గాంధీనగర్ నాలుగో వీధిలో ఉన్న అభినవ్ నర్సింగ్ హోమ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అన్ని రకాల వైద్యసేవలకు చిరునామాగా పేరుగాంచింది. ఇది నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్, మెడ్కేర్ ప్రొవైడర్స్ సర్టిఫికెట్ పొందిన ఏకైక హాస్పిటల్. అత్యాధునిక వైద్య సేవలైన సంతాన సౌఫల్య వైద్య సేవలు, ఇతర అన్ని రకాల శస్త్రచికిత్సలు, నొప్పులు లేకుండా ప్రసవం చేయడం, యూరాలజీ వైద్య సేవలు, డయాబెటాలజీ, థైరాయిడ్‌కు వైద్య సేవలు అందిస్తుంది. అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఆక్సిజన్ సప్లై, ఎసి, నాన్ ఎసి రూములు, ఆపరేషన్ థియేటర్, 24 గంటలు మందుల షాపు, అత్యాధునిక ల్యాబోరేటరీ, శ్రీసత్య స్కాన్ ఎండోస్కోప్ సెంటర్, శ్రీగంగా మెడికల్ సెంటర్, 20 కెవి జనరేటర్‌తో నిరంతర విద్యుత్ వంటి సౌకర్యాలు రోగులకు కల్పిస్తున్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ సదుపాయాలతో పాటు సుదీర్ఘ కాలం పాటు అనుభవంతో సామాన్యులకు సైతం చేరువలో అభినవ్ నర్సింగ్ హోమ్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్య సేవలు అందిస్తోంది.



శృంగవరపుకోటలోని అభినవ్ ఆసుపత్రి


శ్రీ సాయి సహస్ర
తల్లి పిల్లల హాస్పిటల్
సౌందర్య థియేటర్ రోడ్, పార్వతీపురం, సెల్ : 8985921941
అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు, వైద్యులకు, వైద్యసిబ్బందికి
డాక్టర్స్‌డే శుభాకాంక్షలు
Happy Doctors Day
డా॥ గుంట్రెడ్డి వాసుదేవరావు
ఎం.బి.బి.ఎస్., డి.సి.హెచ్.,,
పిల్లల వైద్య నిపుణులు
డా॥ కె.శ్రీరేఖ
ఎం.బి.బి.ఎస్., డి.జి.ఒ.,
స్త్రీ వైద్య నిపుణులు



అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
వైద్యులకు, వైద్యసిబ్బందికి డాక్టర్స్‌డే శుభాకాంక్షలు
National Doctor's Day
Suraksha
రాజశేఖర్ హాస్పిటల్
అపోలో మెడికల్స్ వెనుక, బైరిపురం రోడ్, గజపతినగరం,
సెల్ : 9581375125, 9492929718, 6281087467
జ్వరం, మలేరియా, టైఫాయిడ్, కాళ్ళు నొప్పులు
ఆస్థమా, ఉబ్బసం, గుండె వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు
మధుమేహం (షుగర్), రక్తపోటు (బి.పి.)
పిల్లల ఉబ్బసం (ఆస్థమా)
ప్రత్యేకంగా చూడబడును.
నెబ్యులేషన్ ఉచితం
టైమింగ్స్ : ఉ॥ 7 గం॥ నుండి మ॥ 2గం॥ వరకు
సా॥ 5 గం॥ నుండి రాత్రి 7గం॥ వరకు
డా॥ రాజశేఖర్ తొత్తడి
MD., DNB


అధికారులకు,
ప్రజాప్రతినిధులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
వైద్యులకు, వైద్యసిబ్బందికి
డాక్టర్స్ డే
శుభాకాంక్షలు
డా॥ జె.రవీంద్రకుమార్
MBBS, DCH.,
Children Specialist
గాయత్రి పిల్లల ఆసుపత్రి
గాయత్రి మెడికల్ & జనరల్ స్టోర్స్ - పాలకొండ, సెల్: 9701147764


DARMH
డా॥ అబ్దుల్ రెహమాన్ మెమోరియల్ హాస్పిటల్
చంటి పిల్లల మరియు జనరల్ హాస్పిటల్
డోర్ నెం.1-2-8/ఎ, కంటోన్మెంట్, విజయనగరం. ఫోన్ : 08922-276234, సెల్ : 76808 22111
ప్రత్యేకతలు
• లేబొరేటరీ (Laboratory)
• ఎక్స్‌రే (X-Ray) • ఇ.సి.జి (E.C.G)
• ఫోటోథెరఫీ (Phototherapy)
• ఇన్ పేషెంట్ (In Patient)
• నియోనేటర్ ఇంటెన్సివ్ కేర్ (Neonatal Intensive Care Unit)
• స్పెషల్ రూం సౌకర్యం కలదు (Special Room Avaiable)
• ఇన్సూరెన్స్ సదుపాయం కలదు (Insurance Facility Availabile)
• 24 గంటలు ఎమర్జెన్సీ సదుపాయం కలదు
అధికారులకు,
ప్రజాప్రతినిధులకు,
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు,
వైద్యులకు,
వైద్యసిబ్బందికి
డాక్టర్స్‌డే
శుభాకాంక్షలు
24/7 Emergency Services
DR. MD.AJAZ-UR-RAHMAN
M.B.B.S., DCH., Fellow Neonatology
PGPN (Boston)
Consultant Pediatrician & Neonatologist
Dr. VINOD KUMAR LALWANI
M.B.B.S., MD.,
General Medicine
Consultant Physician
Dr. MOHAMMED FAISAL
M.B.B.S., MD (PEDIATRICS)
Consultant Pediatrician
Specialist in Pediatric Critical Care


డాక్టర్స్ డే శుభాకాంక్షలు
శేఖర్ డాక్టర్ గారి హాస్పటల్
(ప్రసన్న సర్జికల్ నర్సింగ్ హోం)
Near : MDO Office, Airtel Tower,
S.Kota, Cell : 94419 66799,
Clinic : 08966 - 276822 (S.Kota)
◆ENT, ◆UROLOGY,
◆24 Hours Scaning Lab,
◆Pharmacy,
◆Casualiaty with ICU Fesility
Dr. S.V. Satya Sekhar, M.S
General Surgeon
LAPROSCOPIC SURGEON


డాక్టర్స్ డే శుభాకాంక్షలు
KASHVI HOSPITALS
Healing Hands - Caring Hearts
కాష్వి హాస్పిటల్స్
SUPER SPECIALITY HOSPITAL
24hr SERVICE EVERYDAY
CRITICAL CARE
Right care at the right moment
24/7 EMERGENCY CASUALTY
రోడ్డు ప్రమాదాలు
గుండెపోటు
పక్షవాతం
ఊపిరితిత్తుల ఇబ్బందులు
ICU, 3-TESLA MRI SCAN, CATH LAB, 64 SLICE CT SCAN, OPERATION THEATER,
Digital X-Ray, USG, TMT, 2D-ECHO, HOLTER & 24 Hrs Ambulatory Blood Pressure.
Ring Road, ICE Factory Jn, Dharmapuri Road, Vizianagaram.
వివరాలకు సంప్రదించండి : 9888771133, 9888441133


పద్మావతి హాస్పిటల్
డా॥ భోగి ఈశ్వరరావు హాస్పిటల్ ఎదురుగా, కర్షక మహర్షి హాస్పిటల్ రోడ్, పార్వతీపురం
అధికారులకు,
ప్రజాప్రతినిధులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
వైద్యులకు, వైద్యసిబ్బందికి
డాక్టర్స్‌డే
శుభాకాంక్షలు
National Doctor's Day
డా॥ పి.రాజేంద్ర కుమార్
M.B.B.S, M.S. (Ortho), Regd.No.67975
ఎముకలు, కీళ్ళు వెన్నుపూస శస్త్ర చికిత్స నిపుణులు
సెల్ : 9502648416
డా॥ డి.పూర్ణచంద్రిక
M.B.B.S, M.S. (OBGY), Regd.No.91674
స్త్రీ మరియు ప్రసూతి వైద్య నిపుణులు
సెల్ : 7022904515


అభయ హాస్పిటల్స్
...మీ ఆరోగ్యానికి మా అభయం
అధికారులకు, ప్రజాప్రతినిధులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
వైద్యులకు, వైద్యసిబ్బందికి
National Doctor's Day
డాక్టర్స్ డే
శుభాకాంక్షలు
ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా, ఫ్లై ఓవర్ ప్రక్కన, బొబ్బిలి
డా॥ శివకుమార్ మీసాల
DNB, Dr.NB
క్రిటికల్‌కేర్ స్పెషలిస్ట్
ప్రతిరోజు అందుబాటులో ఉండెదరు
డా॥ మరిశర్ల రాజేష్ కుమార్
M.D. General Medicine
షుగర్, బి.పి మరియు జనరల్ ఫిజిషియన్
అన్నిరకముల జ్వరాలు, దగ్గు, జలుబు, ఆయాసం,
వాంతులు, విరోచనాలు, పక్షవాతం
ప్రతిరోజు అందుబాటులో ఉండెదరు
డా॥ చుక్క సూర్యనారాయణ
M.S. General Medicine
షుగర్, బి.పి మరియు జనరల్ ఫిజిషియన్
ప్రతిరోజు అందుబాటులో ఉండెదరు
డా॥ బూరి అనీల్ కుమార్
M.S. (Ortho)
ఎముకలు, కీళ్ళు మరియు వెన్నుముక వైద్య నిపుణులు
కీళ్ల నొప్పి, కీళ్ల వాతం, మెడనొప్పి, భుజం నొప్పి,
వెన్ను నొప్పి, నడుం నొప్పి, మోకాళ్ళు అరుగుట,
మడం నొప్పి, విరిగిన ఎముకలు/ఫ్రాక్చర్స్ చికిత్స
ప్రతిరోజు అందుబాటులో ఉండెదరు
ఫోన్ : 9951832346, 08944-252346